బలగం TV
BALAGAM
నిజమే మా బలం..ప్రజలే మా బలగం
BALAGAM TV DIGTAL NEWS PAPER/ balagamtv100@gmail.com
హైదరాబాద్ ఆదివారం 20 సెప్టెంబర్-2026 balagamtv100@gmail.com పేజీలు-8

## గొంతు నొక్కాలని చూస్తే ఊరుకోం!



వివరాలు 2లో..

## కోదాడలో త్వరలో టాస్క్ కేంద్రం



- కోదాడలో మెగా జాబ్‌మేళా ప్రారంభం
- ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు
- 350 కంపెనీల ద్వారా 5,725 మంది అభ్యర్థుల ఎంపిక
- దరఖాస్తు చేసుకున్న అభ్యర్థులకు ఉద్యోగం వచ్చే వరకు అండగా ఉంటాం: మంత్రి ఉత్తమ్

**హైదరాబాద్,సెప్టెంబర్-19:** కోదాడలో త్వరలో తెలంగాణ అకాడమీ ఫర్ స్కిల్ అండ్ నాలెడ్జ్‘టాస్క్’ కేంద్రాన్ని ఏర్పాటు చేయనున్నట్టు ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు ప్రకటించారు. సూర్యాపేట జిల్లా కోదాడలో శనివారం నిర్వహించిన భారీ మెగా జాబ్‌మేళాను ఆయన మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డితో కలిసి ప్రారంభించారు. ఎంపికైన అభ్యర్థులకు మంత్రులు ఎన్.ఉత్తమ్‌కుమార్‌రెడ్డి, కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి, అడ్లూరి లక్ష్మణ్‌కుమార్‌తో కలిసి ఉద్యోగ నియామక పత్రాలను అందజేశారు. ఈ సందర్భంగా మంత్రి శ్రీధర్‌బాబు మాట్లాడుతూ.. స్థానిక యువతకు పరిశ్రమల అవసరాలకు అనుగుణంగా నైపుణ్య శిక్షణ ఇచ్చి, మెరుగైన ఉద్యోగ అవకాశాలు కల్పించడమే ఈ కేంద్రం లక్ష్యమని తెలిపారు. నైపుణ్యాభివృద్ధి, ఉపాధి కల్పనకు ప్రజా ప్రభుత్వం అత్యధిక ప్రాధాన్యం ఇస్తోందన్నారు. జాబ్‌మేళాలో పాల్గొన్న 350కి పైగా కంపెనీలు దాదాపు 5,725 మంది అభ్యర్థులను ప్రాథమికంగా ఎంపిక చేయడం గొప్ప విషయమని చెప్పారు. ఈ భారీ కార్యక్రమం విజయవంతం కావడానికి వారం రోజులుగా నిరంతరం శ్రమించిన అధికారులు, కంపెనీల ప్రతినిధులు, సుమారు 700 మంది వాలంటీర్ల సేవలను ప్రశంసించారు. ప్రభుత్వం ఒక్కటే ప్రతి ఒక్కరికీ ఉద్యోగాలు కల్పించడం సాధ్యం కాదని, ప్రయివేటు రంగం కూడా ముందుకొచ్చి ఉపాధి మిగతా 3లో..

## మహిళపై ఇంత కర్కశత్వమా?..

- మహిళా ఎమ్మెల్యేల జుట్టు, చీరలు లాగింద్రు
- గూండాలకు తీసిపోని విధంగా పోలీసుల తీరు
- బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ఆగ్రహం
- హైదరాబాద్‌లో మహిళను రోడ్డుపై జుట్టు పట్టి ఓ పోలీసు ఈడ్చుకెళ్లిన దారుణంపై మండిపాటు



**హైదరాబాద్,సెప్టెంబర్-19:** తెలంగాణ పోలీసుల తీరుపై బీఆర్ఎస్ వరింగ్ ప్రెసిడెంట్ కేటీ ఆర్ తీవ్రస్థాయిలో మండిపడ్డారు. సామాన్యులు, రాజకీయ ప్రత్య ర్థుల విషయంలో తెలంగాణ పోలీసులు కఠినంగా వ్యవహరిస్తు న్నారని, రాజ కీయంగా ప్రభావం ఉన్న వ్యక్తుల కుటుంబసభ్యులకు సంబంధించిన ఆరోపణల విష యంలో భిన్నంగా వ్యవహ రిస్తు న్నారని విమర్శించారు. హైదరా బాద్‌లో ఓ మహిళను పోలీసు జుట్టు పట్టి ఈడ్చుకెళ్తున్న వీడియో సామాజిక మాధ్యమాల్లో వైరల్ కాగా ఈ ఘటనపై కేటీఆర్ శనివారం ఎక్స్ వేదికగా తీవ్ర ఆగ్రహం వ్యక్తంచేశారు.కేంద్ర మంత్రి కొడుకుపై పోక్సో కేసు ఆరోప ణలు వచ్చినప్పుడు పోలీసులు తొమ్మిది రోజులపాటు మిగతా 3లో..

# వికసిత్ భారత్ లో తెలంగాణది కీలక పాత్ర

- దేశ ఆర్థిక వ్యవస్థలో తెలంగాణ వాటాను 5 నుంచి 10 శాతానికి పెంచే దిశగా ప్రణాళిక
- ప్రభుత్వ రుణాలపై ఆధారపడే విధానం నుంచి ప్రయివేటు, సంస్థాగత పెట్టుబడుల
- సమీకరణ వైపు అడుగులు
- క్యూర్-ప్యూర్-రేర్ విధానంతో రాష్ట్రవ్యాప్తంగా సమతుల్య అభివృద్ధి
- 30 వేల ఎకరాలకు పైగా విస్తీర్ణంలో భారత్ ఫ్యూచర్ సిటీ
- యువతే తెలంగాణకు అతిపెద్ద బలం : డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్కప్రపంచ పటాలు పరిశీలించండి



**హైదరాబాద్,సెప్టెంబర్-19:** వికసిత్ భారత్-2047 లక్ష్య సాధనలో తెలంగాణ కీలక పాత్ర పోషించేందుకు సిద్ధంగా ఉందని రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి, ఆర్థిక శాఖ మంత్రి మల్లు భట్టి విక్రమార్క అన్నారు. దేశం నిర్దేశించుకున్న భారీ ఆర్థిక లక్ష్యాలను సుదూర ఆశయాలుగా కాకుండా, తక్షణ కార్యాచరణ బాధ్యతగా తెలంగాణ భావిస్తోందని వివరించారు. కేంద్ర ఆర్థిక, కార్పొరేట్ వ్యవహారాల శాఖ మంత్రి శ్రీమతి నిర్మలా సీతారామన్ నేతృత్వంలో న్యూఢిల్లీలో జరిగిన ‘వికసిత్ భారత్ దిశగా భారతదేశ ప్రయాణానికి ఆర్థిక వనరుల సమీకరణ’ సదస్సులో శనివారం డిప్యూటీ సీఎం ప్రసంగించారు. వివిధ రాష్ట్రాల ముఖ్యమంత్రులు, ఆర్థిక మంత్రులు, కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల ఆర్థిక శాఖల ఉన్నతాధికారులు, ఆర్థిక నిపుణులు ఈ సదస్సులో పాల్గొన్నారు. తెలంగాణ నుంచి డిప్యూటీ సీఎంతో పాటు రాష్ట్ర ఆర్థిక, ప్రణాళిక శాఖ కార్యదర్శి డాక్టర్ గౌరవ్ ఉప్పల్ పాల్గొన్నారు.వికసిత్ భారత్ నిర్మాణాన్ని కేంద్రం లేదా రాష్ట్రాలు విడివిడిగా సాధించలేవని, సహకార సమాఖ్య స్ఫూర్తితో కేంద్రం-- మిగతా 3లో..

## దళితులపై సర్కార్ దండయాత్ర!..



- కేసీఆర్‌కు మద్దతుగా ఎర్రవల్లి దళిత రైతులు
- 120 మంది రైతులకు నోటీసులు వివరాలు 2లో..

## మంత్రులు, ఎమ్మెల్యేల్లో మొదలైన గుబులు..!



**హైదరాబాద్,సెప్టెంబర్-19:** ‘చెరపకురా చెడేవు..’ కాంగ్రెస్ మంత్రులు, ఎమ్మెల్యేలు ఇప్పుడు ఈ సామెతను గుర్తు చేసుకుంటున్నారు. కేసీఆర్ వ్యవసాయ క్షేత్రంపై తప్పుడు ఆరోపణలతో బట్టకాల్చి మీదేసే వ్యవహారం వారిలో ఆందోళన కలిగిస్తున్నది. రెండు రోజుల క్రితం పలువురు మంత్రులు, ఎమ్మెల్యేలు సీఎంతో భేటీ అయ్యి, ఈ వ్యవహారంపై సుదీర్ఘంగా చర్చించినట్టు విశ్వసనీయంగా తెలిసింది. ఇప్పుడు కేసీఆర్ వ్యవసాయ క్షేత్రంపై, కేటీఆర్, హరీశ్‌రావుపై, మిగతా 3లో..

## కాంగ్రెస్ సర్కార్ చేతకానితనం వల్లే కరువు

- ఎల్‌నినో కంటే కాంగెస్ తెచ్చిన కరువే ఎక్కువ
- అసెంబ్లీ వేదికగా మంత్రి ఉత్తమ్ పచ్చి అబద్ధాలు
- 80 టీఎంసీలిచ్చే తమ్మిడిహట్టికి 25వేల కోట్లయితే 240 టీఎంసీల కాళేశ్వరానికి రూ.లక్ష కోట్లు కావా?
- యాదాద్రి, భద్రాద్రి ప్లాంట్లలో విద్యుదుత్పత్తి స్టార్ట్ చేసి రైతులకు 24గంటల కరెంటివ్వాలి



- బీఆర్ఎస్ డిప్యూటీ ఫ్లోర్‌లీడర్ హరీశ్‌రావు డిమాండ్

**హైదరాబాద్,సెప్టెంబర్-19:** మేడిగడ్డలో నీళ్లున్నా ఎక్కడ కేసీఆర్‌కు పేరొస్తుందోననే అక్కసుతో కాంగ్రెస్ ప్రభుత్వం నీళ్లు ఎత్తిపో యకుండా ప్రాజెక్టును పడావు పెడుతున్నదని బీఆర్ఎస్ డిప్యూటీ ఫ్లోర్‌లీడర్ హరీశ్‌రావు ధ్వజమెత్తారు. ఎల్‌నినో వల్ల వచ్చిన కరువు కంటే సర్కార్ నిర్లక్ష్యం వల్ల వచ్చిన కరువే ఎక్కువని మండిపడ్డారు. రాష్ట్రంలో నెలకొన్న సాగునీటి, విద్యుత్తు కష్టాలపై ప్రభుత్వం చెప్పినవన్నీ పచ్చి అబద్ధాలేనని నిప్పులు చెరిగారు. తెలంగాణ భవన్‌లో శనివారం నిర్వహించిన మీడియా సమావేశంలో హరీశ్ రావు మాట్లాడారు. మిగతా 3లో..

## సున్నం చెరువు భూ వివాదం..



- టాలీవుడ్ నిర్మాత సి.కళ్యాణ్‌పై మాదాపూర్ పీఎస్‌లో ఫిర్యాదు..! వివరాలు 2లో..

## జన్వాడలో ఉద్రిక్తత!..



- ఫామ్‌హౌస్‌ను ముట్టడించేందుకు కాంగ్రెస్ నాయకుల యత్నం
- అడ్డుకునేందుకు యత్నించిన బీఆర్ఎస్ పార్టీ శ్రేణులను నిలువరించిన పోలీసులు
- ఇది దుర్మార్గమైన చర్య: లీగల్ అడ్వైజర్ రాజేశ్వర్‌రావు వివరాలు 2లో..

## ముంబై టు బంగ్లాదేశ్!



- చోరీ చేసిన మొబైల్‌లు అంతర్జాతీయ మార్కెట్‌లో విక్రయం
- తెలంగాణ, మధ్యప్రదేశ్‌లలో వరుస దొంగతనాలు
- హైదరాబాద్ టాస్క్‌ఫోర్స్, ఖమ్మం పోలీసుల సంయుక్త ఆపరేషన్
- తొమ్మిది మంది నిందితుల అరెస్టు, పరారీలో ముగ్గురు

వివరాలు 3లో..

## 22 ఏ సమస్యలకు త్వరలో ముగింపు



- 12 అంశాల్లో ఇప్పటికే రెండింటిపై జీవోలు : మంత్రి పొంగులేటి శ్రీనివాస రెడ్డి
- ఇండ్ల క్రమబద్ధీకరణకు సంబంధించిన ధ్రువపత్రాల అందజేత

**హైదరాబాద్,సెప్టెంబర్-19:** రాష్ట్రంలో 22-ఏతో పాటు ఇతర భూ సమస్యలకు త్వరలో పరిష్కారం చూపి ప్రజలకు తీపికబురు అందిస్తామని రెవెన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి తెలిపారు. సీఎం రేవంత్‌రెడ్డి శాసనసభలో ప్రకటించిన 12 అంశాలపై దశలవారీగా చర్యలు చేపడుతున్నామని, ఇందులో కాలనీల సమస్యకు జీవో 118, సింగరేణి ప్రాంతంలోని ఇండ్ల స్థలాల క్రమబద్ధీకరణకు జీవో 76 జారీ చేసినట్టు వెల్లడించారు. మరో 45 రోజుల్లో భూ సమస్యను పూర్తిస్థాయిలో పరిష్కరిస్తామని చెప్పారు. హైదరాబాద్ ఎల్‌బీనగర్ నియోజకవర్గంలోని 44 కాలనీల్లో ఇండ్ల క్రమబద్ధీకరణకు సంబంధించిన ధ్రువపత్రాలను శనివారం సరూర్‌నగర్ ఇండోర్ స్టేడియంలో మంత్రులు పొన్నం ప్రభాకర్, అజారుద్దీన్, ప్రజాప్రతినిధులతో కలిసి లబ్దిదారులకు అందజేశారు. ఈ సందర్భంగా పొంగులేటి మాట్లాడుతూ.. గ్రామీణ ప్రాంతాల్లో రైతుల భూ సమస్యల పరిష్కారానికి ఆధార్ తరహాలో భూదార్ కార్డులు అందించనున్నట్టు చెప్పారు. ఎల్‌బీనగర్ నియోజకవర్గంలోని 64 కాలనీలకు 44 కాలనీల సమస్యలను పరిష్కరిం చామని తెలిపారు. గత ప్రభుత్వం నుంచి నిషేధిత ఉత్తర్వులు ఉన్నప్పటికీ నెల రోజుల్లోగా సమస్యలను పరిష్కరించి మిగతా 3లో..

## దానం యూటర్న్..



- ఎమ్మెల్యే సభ్యత్వ రద్దుపై సుప్రీం కోర్టులో పిటిషన్..! వివరాలు 2లో..

## మన్నెంపల్లిలో టెన్షన్.. టెన్షన్

- గ్రామ పంచాయతీ పాత భవనం కూల్చివేతలో తీవ్ర ఉద్రిక్తత
- నోటీసులు ఇవ్వకుండా ఎలా కూల్చివేస్తారంటూ అడ్డుకున్న సర్పంచ్, పంచాయతీ పాలకవర్గం
- పోలీసులతో పాలకవర్గం వాగ్వాదం
- సర్పంచ్ ఆత్మహత్యాయత్నం



వివరాలు 2లో..

## రీయింబర్స్‌మెంట్ ఎత్తివేతకు కుట్ర

- తక్షణమే రూ.8.500 కోట్ల ఫీజు బకాయిలు చెల్లించాలి
- విద్యార్థులు, కృష్ణయ్య నిరసన ర్యాలీ
- అడ్డుకున్న పోలీసులు.. ఉద్రిక్తత

వివరాలు 3లో..

## గ్రేట్ మహానగరి జిల్లాలు

• హైదరాబాద్ • మేడ్చల్- రంగారెడ్డి

# మన్నెంపల్లిలో టెన్షన్.. టెన్షన్



- పోలీసులతో పాలకవర్గం వాగ్వాదం
- సర్పంచ్ ఆత్మహత్యాయత్నం

హైదరాబాద్,సెప్టెంబర్-19: కరీంనగర్ జిల్లా తిమ్మాపూర్ మండలం మన్నెంపల్లిలో శనివారం ఉదయం జీపులు, లారీలతో పోలీస్ సిబ్బంది దిగడంతో గ్రామస్తుల్లో టెన్షన్ నెలకొన్నది. వివరాల్లోకి వెళ్తే.. మన్నెంపల్లి పాత గ్రామ పంచాయతీ భవనాన్ని కూల్చేందుకు అధికారులు తెల్లవారుజామున భారీ పోలీసు బందోబస్తు మధ్య పొక్లెయిన్లతో రాగా.. సర్పంచ్ పొన్నం సునీతాఅనిల్‌గౌడ్ అడ్డుకున్నారు. జీపీ పాత భవనాన్ని గ్రామ పంచాయతీ ఇతర కార్యకలా పాలకు వాడుకునేందుకు తీర్మానం చేశామని.. దానిని కూల్చవద్దంటూ వేడుకున్నారు. బిల్డింగ్ శిథిలావస్థలో ఉన్నదని, ఇంజనీరింగ్ అధికారులు ఇచ్చిన నివేదిక ప్రకారం కూల్చేయడానికి కలెక్టర్ ఆదేశాలు ఇచ్చారని అధికారులు చెప్పారు. ఈ భవనాన్ని కూల్చి దాని స్థానంలో మహిళా సంఘాల కోసం స్థలం కేటాయించామని పాలకవర్గ సభ్యులు అధికారులకు వివరించారు. అధికార పార్టీ నేతలకు తలొగ్గి, పాలకవర్గ తీర్మానాన్ని పట్టించుకోకుండా ఏకపక్షంగా వ్యవహరిస్తున్నారని సర్పంచ్ మండిపడ్డారు. సర్పంచుల ఫోరం మండల అధ్యక్షురాలైన తన పరిస్థితే ఇలా ఉంటే సాధారణ సర్పంచుల పరిస్థితి ఏందని ప్రశ్నించారు. దీంతో అధికారులకు పాలకవర్గానికి మధ్య వాగ్వాదం చోటుచేసుకున్నది. ఈ క్రమంలో సర్పంచ్ భర్త పొన్నం అనిల్‌ను తిమ్మాపూర్ సీఐ బొల్లం రమేశ్ బలవంతంగా బలగాలతో లాకెళ్లి ఎల్ఎండీ పోలీస్ స్టేషన్‌కు తరలించారు. తన భర్తను అక్రమంగా అరెస్ట్ చేస్తున్నారంటూ సర్పంచ్ సునీత ఆగ్రహం వ్యక్తం చేస్తూ పోలీస్ వాహనానికి అడ్డుపడగా పోలీసులు బలవంతంగా పకకు తీసుకెళ్లారు. దీంతో ఉద్వేగానికి లోనైన ఆమె పకనే ఉన్న గ్రామ పంచాయతీ నూతన భవనంలోకి వెళ్లి తలుపులు పెట్టుకుని ఆత్మహత్యకు యత్నించింది. పోలీస్ సిబ్బంది వెంటనే తలుపులు నెట్టి ఆమె నుంచి పెట్రోల్‌డబ్బాను తీసుకుని పడేశారు. అనంతరం పోలీసులు, పంచాయతీరాజ్ శాఖ అధికారులు పాత భవనాన్ని నేలమట్టం చేయించారు. జెండా గద్దెను సైతం జేసీబీతో తొలగింపజేశారు. మన్నెంపల్లిలో ఉద్రిక్తతల నేపథ్యంలో బీఆర్ఎస్ నాయకులు సర్పంచ్‌కు మద్దతు పలికారు. పార్టీ మండలాధ్యక్షుడు రావుల రమేశ్, రాష్ట్ర నాయకులు కేతిరెడ్డి దేవేందర్‌రెడ్డి, ఉల్లెంగుల ఏకానందం, పాశం అశోక్‌రెడ్డి, తదితరులు గ్రామానికి చేరుకుని సర్పంచ్ దంపతులతో మాట్లాడారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. గ్రామంలో పోలీస్ బలగాలను పెట్టి దౌర్జన్యం చేయడం సరికాదన్నారు. ఎమ్మెల్యే కవ్వంపల్లి సత్యనారాయణ అధికారాన్ని అడ్డుపెట్టుకుని నిరంకుశంగా వ్యవహరిస్తున్నారని.. పాత బిల్డింగ్ కూల్చేందుకు రాజకీయం చేయడం కరెక్ట్‌కాదనిమండిపడ్డారు. అధికారులపై చట్టపరమైన చర్యలకు సిద్ధమవుమవుతామని చెప్పారు.

## జన్వాడలో ఉద్రిక్తత!..



- ఫామ్‌హౌస్‌ను ముట్టడించేందుకు కాంగ్రెస్ నాయకుల యత్నం
- అడ్డుకునేందుకు యత్నించిన బీఆర్ఎస్ పార్టీ శ్రేణులను నిలువరించిన పోలీసులు
- ఇది దుర్మార్గమైన చర్య: లీగల్ అడ్వైజర్ రాజేశ్వర్‌రావు

హైదరాబాద్,సెప్టెంబర్-19: రంగారెడ్డి జిల్లా శంకర్‌పల్లి మండలంలోని జన్వాడ లో తీవ్ర ఉద్రిక్తత చోటు చేసుకున్నది. ఓ ఫామ్‌హౌస్‌ను ముట్టడించేందుకు కాంగ్రెస్ నాయకులు యత్నించడంతో వారిని అడ్డుకునేందుకు బీఆర్ఎస్ శ్రేణులు పెద్ద ఎత్తున అక్కడికి చేరుకున్నారు. దీంతో ఫాంహౌస్ పరిసరాల్లోకి పోలీసు బలగాలు పెద్ద ఎత్తు న చేరుకున్నాయి. జన్వాడలోని ప్రదీప్‌రెడ్డి కి చెందినదిగా భావిస్తున్న ఫామ్‌హౌస్ ము ట్టడికి కాంగ్రెస్ నేతలు ప్రయత్నించారు. ఫాంహౌస్‌ను కేటీఆర్‌కు లీజ్‌కి మాత్రమే ఇచ్చానని ఓనర్ ప్రదీప్‌రెడ్డి రెండు రోజుల క్రితం మీడియా సమావేశంలో వెల్లడించా రు. అయినా కాంగ్రెస్ నాయకులు దౌర్జన్యంగా శనివారం ఫామ్‌హౌస్‌పై దాడి చేసేందుకు కుట్రలు చేశారు. కాంగ్రెస్ నాయకులను అడ్డుకునేందుకు షాబాద్ మాజీ జడ్పీటీసీ పట్నం అవినాశ్‌రెడ్డితోపాటు ఆయా మండలాల పార్టీ అధ్యక్షులు, మాజీ ప్రజాప్రతినిధుల ఆధ్వర్యంలో చేవెళ్ల నియోజకవర్గంలోని నాలుగు మండలాల నుంచి బీఆర్ఎస్ శ్రేణులు పెద్ద ఎత్తున జన్వాడకు బయలుదేరగా పోలీసులు అడ్డుకున్నారు. కాంగ్రెస్ నాయకులు ఫామ్‌హౌస్‌కు వస్తున్నారనే సమాచారంతో పోలీసులు చుట్టు పక్కల ఉన్న దుకాణాలను మూసి వేయాలని ప్రజలను సైతం ఇబ్బంది పెట్టారు. ప్రతి వాహనాన్ని తనిఖీ చేశారు. కాంగ్రెస్ నేతల బస్సుకు అడ్డంగా నిలబడి బీఆర్ఎస్ కార్యకర్తలు నిరసన తెలిపారు. కాంగ్రెస్ నాయకులు దౌర్జన్యంగా ఫామ్‌హౌస్‌పై దాడికి రావడం దుర్మార్గమైన చర్య అని లీగల్ అడ్వైజర్ రాజేశ్వర్‌రావు మండిపడ్డారు. ప్రదీప్‌రెడ్డి ఫామ్‌హౌస్‌లో ఎలాంటి నాలాలు, కబ్జాలు లేవని, చట్టపరంగానే 2019లో ఈ భూమిని కొన్నారని తెలిపారు. ఎలాంటి కబ్జాలు ఉన్నా ప్రభుత్వం న్యాయపరంగా, చట్టపరంగా చర్యలు తీసుకోవచ్చునని తెలిపారు.

## మహిళ జుట్టుపట్టి ఈడ్చుకెళ్లిన హోమ్‌గార్డ్

**సోషల్ మీడియాలో వైరల్‌గా హఫీజ్‌పేట్ రైల్వేస్టేషన్ ఘటన**

**తీవ్రంగా స్పందించిన డీజీపీ ఆనంద్.. సర్వీసు నుంచి తొలగింపు.. అరెస్ట్**

హైదరాబాద్,సెప్టెంబర్-19: అసెంబ్లీ ఎదుటే ఇటీవల పోలీసులు బీఆర్ఎస్ మహి ళా ఎమ్మెల్యేల చీరలు లాగడం, గొంతులు ప ట్టుకోవడం, జుట్టుపట్టి లాగిన ఘటనలు మరువకముందే అలాంటిదే మరో ఘటన చోటుచేసుకున్నది. చుట్టుపక్కల వారు ప్రశ్నిస్తున్నా రైల్వే స్టేషన్‌లో కూర్చున్న మహిళను హోమ్‌గార్డు జుట్టుపట్టి ఈడ్చుకెళ్లడం తీవ్ర దుమారం రేపింది. హైదరాబాద్‌లోని హఫీజ్‌పేట్ రైల్వేస్టేషన్‌లో శుక్రవారం రాత్రి గుర్తుతెలియని వా రందరినీ బయటకు పంపించే క్రమంలో విధు ల్లో ఉన్న ఆర్‌పీఎఫ్ హోమ్‌గార్డు కడిగ ఆనంద్ స్టేషన్‌లో కూర్చున్న ఓ మహిళను బూతులు తిడుతూ జుట్టు పట్టుకుని బయటకు ఈడ్చుకెళ్లాడు. బాధితురాలు బాధతో రోదిస్తున్నా కనికరం చూపలేదు. ఆ మహిళ తనపై నోరుపారేసుకోవడంతో ఆగ్రహంతో ఇలా చేసినట్టు హో మ్‌గార్డు పేర్కొన్నాడు. అక్కడున్నవారు ఇ దంతా రికార్డు చేసి సోషల్ మీడియాలో పోస్టు చేయడంతో అది వైరల్‌గా మారి డీజీపీ దృష్టికి వెళ్లింది. దీంతో డీజీపీ సీవీ ఆనంద్ తీవ్రంగా స్పందించారు. వెంటనే హోమ్‌గార్డును సర్వీస్ నుంచి తొలగించడంతోపాటు క్రిమినల్ కేసు నమోదు చేయాలని సైబరాబాద్ సీపీని ఆదేశించారు. పోలీసులు హద్దుమీరి ప్రవర్తిస్తే చట్టపరమైన చర్యలు తప్పవని హెచ్చరించారు. సైబరాబాద్ సీపీ హో మ్‌గార్డుపై కేసు నమోదు చేసి అరెస్టు చేయాల్సిందిగా మియాపూర్ పోలీసులను ఆదేశించారు. పోలీసులు ఆనంద్‌పై కేసు నమోదు చేసి అరెస్టు చేశారు.

# దళితులపై సర్కార్ దండయాత్ర!..

**కేసీఆర్‌కు మద్దతుగా ఎర్రవల్లి దళిత రైతులు**

**120 మంది రైతులకు నోటీసులు**





హైదరాబాద్,సెప్టెంబర్-19: అప్పుడెప్పుడో 1980లో ఇందిరమ్మ కాలంలో దళితులకు భూములు ఇచ్చినప్పటికీ నాలుగు దశాబ్దాలపాటు అవి గడ్డి భూములుగానే మిగిలిపోయాయి. ఆ భూములను దళితులు చూసుకొని మురవటమే తప్ప పైసా ఆమ్దానీ పొందలేదు. కేసీఆర్ ప్రభుత్వం వచ్చాకే రాళ్లురప్పలతో నిండిన భూమిని సాగుయోగ్యంగా మార్చారు. తన వ్యవసాయ క్షేత్రం పక్కనే ఉన్న దళితుల దయనీయ స్థితిని చూసి వారికి బతుకునిచ్చే ఉద్దేశంతో ఆ భూములను కేసీఆర్ సిరుల మాగాణంగా కొత్త రూపునిచ్చారు. రాజకీయంగా కేసీఆర్‌పై కక్షతో రగిలిపోతున్న కాంగ్రెస్ సర్కారు, దళితుల భూములను కేసీఆర్ కబ్జా చేశారని అసెంబ్లీ సాక్షిగా ఆరోపించింది. సీఎం రేవంత్ సభలో ప్రటించిన 325 సర్వేనంబర్‌లో అసలు కేసీఆర్‌కు ఇంచు భూమి కూడా లేదని తేలడంతో సర్కారు పరువుపోయింది. ఎర్రవల్లి దళిత రైతులు ప్రభుత్వానికే మద్దతుగా ఉంటారని, కేసీఆర్‌కు వ్యతిరేకంగా మాట్లాడుతారని, వాళ్లను అడ్డం పెట్టుకొని బీఆర్ఎస్ అధినేతను మరింత ఇరకాటంలోకి నెట్టొచ్చని రేవంత్‌రెడ్డి భావించారు. కానీ ఇది కూడా అడ్డం తిరిగింది. దీంతో తన వైఫల్యాన్ని కప్పిపుచ్చుకోవడానికి ఎర్రవల్లి దళిత రైతులపైకి సర్కారు దండెత్తింది. అసైన్డ్ భూములుగా దళితులకు హక్కున్నప్పటికీ, వాటిని గైరాన్ ప్రభుత్వ భూములుగా పేర్కొంటూ అవి మీ కబ్జాలో ఎందుకున్నాయి? మీకెలాంటి హక్కులున్నాయో చెప్పాలని నోటీసులు ఇచ్చింది. అసెంబ్లీ సాక్షిగా సీఎం ప్రకటించినట్టుగా డపుపకొట్టిన 800 మంది రైతులకు అరెకరం చొప్పున ఎర్రవల్లి దళితుల భూములను పంచుతానని చెప్పి వారిలో గుబులు పుట్టించారు. మరోవైపు ఈ వివాదం చాలదన్నట్టు ఎర్రవల్లి శివారు వెంకటపూర్ రైతులు ఆభూములు తమవని, కొన్నేండ్ల కిందట రికార్డులు మారిపోయాయని కొత్త పంచాయతీని తెరపైకి తీసుకొచ్చారు. ఎకరం కోటిన్నరపైనే పలికే భూములపై ఎవరి కన్నుపడింది? ఎందుకు ఈ వివాదం పెద్దదవుతున్నది? కుట్ర దాగి ఉన్నదా? అనే కొత్త అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. కేసీఆర్‌ను బద్నాం చేయాలనుకున్న సీఎం రేవంత్‌రెడ్డి కుట్రలు బద్దలయ్యాయి. కేసీఆర్ వ్యవసాయ క్షేత్రంలో ఇంచు అసైన్డ్ భూమి కూడా లేదని అధికారుల సర్వేలో తేటతెల్లమైంది. ప్రభుత్వానికి అనుకూలంగా ఉంటారనుకున్న ఎర్రవల్లి దళిత రైతులు కేసీఆర్‌కు మద్దతుగా నిలిచారు. కుట్రలు, కుతంత్రాలన్నీ బెడిసికొట్టడంతో సీఎం ఫ్రస్ట్రేషన్ పతాకస్థాయికి చేరింది. కేసీఆర్‌పై కక్షను ఎర్రవల్లి దళిత రైతులపై తీర్చుకునేందుకు పంతంగట్టారు. అక్కడి దళిత రైతులకు కాంగ్రెస్ ప్రభుత్వం నోటీసులు జారీచేసింది. 'మీరు సాగు చేసుకుంటున్న అసైన్డ్ భూమి మీదేనని నిరూపించుకోవాలి' అంటూ హుకుం జారీచేసింది. శనివారం సిద్దిపేట జిల్లా మర్కూక్ తహసీల్దార్ తొలి విడుతగా 120 మంది రైతులకు నోటీసులు జారీ చేశారు. రెండురోజుల్లో ఆధారాలు చూపించాలని ఆదేశించారు. ఆ నోటీసులతో దళిత రైతులు ఆందోళన వ్యక్తంచేస్తున్నారు. తాతల కాలం నుంచి సాగు చేసుకుంటున్న తమ భూమిని కాంగ్రెస్ సర్కార్ ఎక్కడ గుంజుకుంటుందోనని ఆందోళన చెందుతున్నారు. సీఎం రేవంత్‌రెడ్డి ఆదేశాలతో మూడురోజులుగా రెవెన్యూ అధికారులు ఎర్రవల్లిలోని 325 సర్వేనంబర్‌లో ఉన్న 388 ఎకరాల అసైన్డ్ భూమిలో సర్వే చేస్తున్నారు. ఇక్కడ ఎంత భూమి ఉన్నది? ఎంత మంది రైతులున్నారు? ఎవరు కబ్జాలో ఉన్నారు? ఎవరి పేరుపై ఎంత భూమి ఉన్నది? అనే లెక్కలు తీస్తున్నారు. అధికారులు దాదాపుగా సర్వే పూర్తిచేశారు. ఆ తర్వాత అక్కడి అసైన్డ్ భూమిలో కబ్జాలో ఉన్న దళిత రైతులకు నోటీసులు జారీచేస్తున్నారు. మొత్తం 243 మంది దళిత రైతులకు గానూ శనివారం 120 మందికి నోటీసులు అందజేశారు. మిగతా వారికి నేడో, రేపో జారీ చేసేందుకు అధికారులు కసరత్తు చేస్తున్నారు.'మర్కూక్ మండలం, ఎర్రవల్లి గ్రామ పరిధిలోని రెవెన్యూ రికార్డు, సేత్వార్ ప్రకారం సర్వే నం. 325లో గైరాన్ ప్రభుత్వ భూమిగా నమోదైన మొత్తం విస్తీర్ణం 388.05 ఎకరాల భూమి సమగ్ర సర్వే/ఎంజాయ్‌మెంట్ సర్వే నిర్వహించబడును. కావున పైభూమికి సంబంధించి పహాణీలో పట్టాదారులు/ అనుభవదారులుగా నమోదైన మీకు తేదీ 21.09.2026 రోజున మీ యొక్క భూమి వద్ద తగిన ఆధారాలతో తప్పనిసరిగా హాజరై మీ హద్దులను సర్వే అధికారులకు తెలుపగలరు' అంటూ ఆ నోటీసుల్లో పేర్కొన్నారు. కబ్జాలో ఉన్న భూమికి సంబంధించిన ఆధారాలు చూపించాలని ఆదేశాలు జారీచేశారు.

## సున్నం చెరువు భూ వివాదం..

**టాలీవుడ్ నిర్మాత సి.కళ్యాణ్‌పై మాదాపూర్ పీఎస్‌లో ఫిర్యాదు.!**



హైదరాబాద్,సెప్టెంబర్-19: టాలీవుడ్ ప్రముఖ సినీ నిర్మాత సి. కళ్యాణ్ మరోసారి వివాదంలో చిక్కుకున్నారు. హైదరాబాద్‌లోని హైప్రొఫైల్ ప్రాంతమైన మాదాపూర్‌లో ఆయనపై ల్యాండ్ గ్రాబింగ్ ఆరోపణలు వస్తూ పోలీస్ స్టేషన్‌లో అధికారికంగా ఫిర్యాదు నమోదైంది. సున్నం చెరువు ప్రాంతంలో తమకున్న భూములను, ప్లాట్లను బల వంతంగా కబ్జా చేయడానికి ఆయన యత్నిస్తున్నారం టూ బాధితులు, ప్లాట్ యజమానులు పోలీసులను ఆశ్రయించారు. వివరాల్లోకి వెళితే.. గుట్టల బేగంపేట్ పరిధిలోని సర్వే నంబర్లు 12, 12a 13లలో సియాట్ సొసైటీకి చెందిన ప్లాట్లు ఉన్నాయి. ఈ స్థలాలపై కన్నేసిన నిర్మాత సి. కళ్యాణ్, తన అనుచరులతో కలిసి శనివారం ఉదయం పూట హఠాత్తుగా ఆ ప్లాట్లలోకి అక్రమంగా ప్రవేశించినట్లు బాధితులు ఆరోపించారు. ఎవరికీ ఎలాంటి హక్కులు లేనప్పటికీ, తమ సొంత స్థలాల్లోకి చొరబడి ప్లాట్ల చుట్టూ బ్లూ షీట్లు కట్టేశారని, దీంతో తాము తమ సొంత భూముల్లోకి వెళ్లకుండా తీవ్రమైన అడ్డంకులు సృష్టించారని వాపోయారు. అసలు ఎలాంటి ముందస్తు అనుమతులు లేకుండా ఇలా ప్రహరీలు కట్టడం, షీట్లు వేయడం వెనుక పెద్ద కుట్ర దాగి ఉందని వారు మండిపడ్డారు. ఈ భూమికి సంబంధించి గతంలోనూ పలుమార్లు అక్రమ ఆక్రమణ ప్రయత్నాలు జరిగాయని సియాట్ సొసైటీ అధ్యక్షుడు శ్యామ్ సింగ్ తెలిపారు. ప్రస్తుతం ఈ వివాదం ముప్పేట దాడిలా మారడంతో, బాధితులందరూ కలిసి శ్యామ్ సింగ్ నేతృత్వంలో మాదాపూర్ పోలీస్ స్టేషన్‌కు తరలివెళ్లారు. నిర్మాత సి. కళ్యాణ్‌తో పాటు ప్రకాష్ ధారక్, ప్రేమలత తదితరులు ఈ అక్రమ చొరబాటు వెనుక ఉన్నారని ఫిర్యాదులో స్పష్టంగా పేర్కొన్నారు. తమకు న్యాయం చేసి, అక్రమాలకు పాల్పడిన వారిపై వెంటనే చట్టపరమైన కఠిన చర్యలు తీసుకోవాలని వారు పోలీసులను కోరారు. బాధితుల నుంచి అందిన బలమైన ఫిర్యాదును స్వీకరించిన మాదాపూర్ సర్కిల్ ఇన్‌స్పెక్టర్ (CI), ఈ ఘటనపై పూర్తిస్థాయి విచారణను ప్రారంభించారు. సర్వే నంబర్ల డాక్యుమెంట్లు, అసలు హక్కుదారుల వివరాలను పరిశీలిస్తు న్నారు. టాలీవుడ్ ప్రముఖ నిర్మాతపై ల్యాండ్ సెటిల్‌మెం ట్, కబ్జా ఆరోపణలు రావడంతో ఈ ఉదంతం స్థానికంగానూ, సినీ పరిశ్రమ వర్గాల్లోనూ తీవ్ర సంచలనం సృష్టిస్తోంది.

## దానం యూటర్న్..

**ఎమ్మెల్యే సభ్యత్వ రద్దుపై సుప్రీం కోర్టులో పిటిషన్..!**



హైదరాబాద్,సెప్టెంబర్-19: బీఆర్ఎస్ పార్టీ తరఫున ఎమ్మెల్యేగా గెలుపొంది కాంగ్రెస్‌లోకి ఫిరాయించి అనర్హత వేటుకు గురైన దానం నాగేందర్ (ఖుఖుఎ చీఘ్రవఅఎవతీ) యూటర్న్ తీసుకున్నారు. హైకోర్టు తీర్పును స్వాగతిస్తున్నా, ఉప ఎన్నికకు సిద్ధమేనని ప్రకటించిన దానం సుప్రీం కోర్టును ఆశ్రయించారు. తన ఎమ్మెల్యే సభ్యత్వాన్ని రద్దు చేస్తూ హైకోర్టు ఇచ్చిన తీర్పును సవాల్ చేస్తూ అత్యున్నత ధర్మాసనంలో శనివారం ఆయన పిటిషన్ వేశారు. ఫిరాయింపు ఎమ్మెల్యే దానం నాగేందర్ ఒక్కరోజులోనే మాట మార్చారు. అనర్హత వేటు వేస్తూ హైకోర్టు ఇచ్చిన తీర్పును స్వాగతిస్తున్నానని, సుప్రీం కోర్టుకు వెళ్లే ఆలోచన లేదని, ఉప ఎన్నికకు సిద్ధమేనని పేర్కొన్న ఆయన శనివారం సుప్రీం కోర్టును ఆశ్రయించారు. తనపై అనర్హత వేటును ఆయన సవాల్ చేశారు. ఖైరతాబాద్ నుంచితన ఎమ్మెల్యే సభ్యత్వాన్ని రద్దు చేస్తూ శుక్రవారం తెలంగాణ హైకోర్టు ఇచ్చిన తీర్పును సవాల్ చేశారు దానం. కాగా, ఇదే కేసులో బీఆర్ఎస్ ఎమ్మెల్యే పాడి కౌశిక్ రెడ్డి ఇప్పటికే కేవియట్ దాఖలు చేశారు. బీఆర్ఎస్ ఎమ్మెల్యే పార్టీ ఫిరాయింపుపై రాష్ట్ర హైకోర్టు శుక్రవారం సంచలన తీర్పు వెలువరించింది. ఖైరతాబాద్ ఎమ్మెల్యే దానం నాగేందర్ పార్టీ ఫిరాయించినట్టు నిర్ధారించింది. ఆయనను అనర్హుడిగా ప్రకటిస్తూ తీర్పు వెలువరించింది. 2023 అసెంబ్లీ ఎన్నికల్లో బీఆర్ఎస్ తరఫున ఎమ్మెల్యేగా గెలిచిన దానం నాగేందర్, అదే పార్టీలో కొనసాగుతూనే 2024 లోక్‌సభ ఎన్నికల్లో కాంగ్రెస్ అభ్యర్థిగా బరిలోకి దిగారు. సికింద్రాబాద్ లోక్‌సభ నియోజకవర్గం నుంచి ఆయన కాంగ్రెస్ తరఫున పోటీ చేయడం ద్వారా బీఆర్ఎస్ సభ్యత్వాన్ని స్వచ్ఛందంగా వదులుకున్నట్టేనని ధర్మాసనం తేల్చి చెప్పింది. దానం నాగేందర్ 2024 ఏప్రిల్ 23న కాంగ్రెస్ అభ్యర్థిగా లోక్‌సభ ఎన్నికలకు నామినేషన్ దాఖలు చేసిన తేదీ నుంచే రాజ్యాంగంలోని పదో షెడ్యూల్‌లోని 2(1)(ఏ)తోపాటు ఆర్టికల్ 191(2) ప్రకారం ఎమ్మెల్యే పదవికి అనర్హుడని ప్రకటించింది.

## ధాన్యం కొనుగోళ్లకు సిద్ధం: స్టీఫెన్ రవీంద్ర




హైదరాబాద్,సెప్టెంబర్-19: అక్టోబర్ మొదటి వారం నాటికి రైతులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా ధాన్యం కొనుగోళ్ల ప్రక్రియను ప్రారంభించేందుకు స్టోరేజ్, హమాలీ, ట్రాన్స్‌పోర్ట్ ఆధారిత 'ఎస్‌హెచ్‌టీ' వ్యూహాన్ని అమలు చేస్తున్నట్టు పౌర సరఫరాల శాఖ కమిషనర్ ఎం స్టీఫెన్ రవీంద్ర తెలిపారు. శనివారం నిర్వహించిన సమీక్షా సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. సాధారణ గోదాములతోపాటు మూతపడిన రైస్ మిల్లులు, ఇండస్ట్రియల్ షెడ్లు, ఏఎంసీ ఆవరణలు, ఫంక్షన్ హాళ్లను సైతం నిల్వ కోసం వినియోగించుకోవాలని సూచించారు. హమాలీల కొరత రాకుండా ముందస్తు చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. 2026-27 వానకాలానికి సంబంధించి సుమారు 65 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం కొనుగోళ్ల కోసం పౌర సరఫరాల శాఖ సమగ్ర కార్యాచరణ సిద్ధం చేసినట్టు పేర్కొన్నారు.

## జూరాల వద్ద ఉద్రిక్తత..




**స్వయంగా ప్రాజెక్టు నుండి నీళ్లు వదులుకున్న రైతులు..!**

హైదరాబాద్,సెప్టెంబర్-19: జూరాల ప్రాజెక్టు వద్ద ఉద్రిక్తత పరిస్థితులు నెలకొన్నాయి. సాగునీటి విడుదల కోసం పొద్దటి నుంచి ధర్నా చేసినా అధికారులు స్పందించకపోవడంతో ఆగ్రహించిన రైతులు రెగ్యులేటర్ పైకి ఎక్కారు. మూకుమ్మడిగా రెగ్యులేటర్ పైకి చేరుకున్న రైతన్నలు స్వయంగా పొలాలకు సాగునీరు వదులుకున్నారు. వనపర్తి జిల్లా జూరాల ప్రాజెక్టు కుడి, ఎడమ కాలువలకు నీటిని నిలిపివేయడంతో ఆయకట్టు రైతులు ఆగ్రహం వ్యక్తం చేశారు. జూరాల ప్రాజెక్టు నుంచి సాగునీటిని విడుదల చేయాలని కోరుతూ శనివారం ఉదయం నుంచి సాయంత్రం 7 గంటల వరకు ధర్నా చేశారు. అయినా సరే అధికారుల నుంచి స్పందన లేకపోవడంతో రైతన్నలకు కోపమొచ్చింది. పంటల ఎండుతున్నా కనికరం లేని కాంగ్రెస్ సర్కార్‌ను తిట్టుకుంటూ.. మూకుమ్మడిగా జూరాల ప్రాజెక్టు ఎడమ కాలువ రెగ్యులేటర్‌పైకి ఎక్కిన రైతులు స్వయంగా నీటిని విడుదల చేసుకున్నారు.

## బీసీ వెల్ఫేర్ ప్రమోషన్లలో అవకతవకలు..

**అనర్హులకు సైతం ప్రమోషన్లు!**




హైదరాబాద్,సెప్టెంబర్-19: బీసీ సంక్షేమ శాఖలో ఇటీవల నిర్ణయించిన ఉన్నతస్థాయి ప్రమోషన్లలో భారీ అవకతవకలు జరిగాయనే ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. ప్రమోషన్లు కల్పించ డంతోపాటు సీటుకో రేటు చొప్పున పోస్టింగ్‌లు ఇచ్చేందుకు సైతం సిద్ధమయ్యారని బీసీ సంక్షేమ శాఖ ఉద్యోగవర్గాలు గగ్గోలు పెడుతున్నాయి. సంక్షేమభవన్‌లో ఇప్పుడిదే చర్చనీయాంశంగా మారింది. తక్షణం ప్రభుత్వం జోక్యం చేసుకొని ఇటీవల డీపీసీలో నిర్ణయించిన ప్రమోషన్లపై పూర్తిస్థాయి విచారణ చేపట్టాలని డిమాండ్ చేస్తున్నాయి. బీసీ సంక్షేమ శాఖలో ఆరు డిప్యూటీ డైరెక్టర్ (డీడీ) పోస్టులు ఖాళీగా ఉన్నాయి. హనుమకొండ, కరీంనగర్, నల్లగొండ డీడీ పోస్టులతోపాటు గురుకుల సొసైటీలో డిప్యూటీ సెక్రటరీ పోస్టులు రెండు, బీసీ కార్పొరేషన్‌లో జనరల్ మేనేజర్ (జీఎం) పోస్టు ఖాళీగా ఉన్నాయి. ఆయా పోస్టుల భర్తీకి సంబంధించి ఇటీవల డిపార్ట్‌మెంటల్ ప్రమోషన్ కమిటీ (డీపీసీ) సమావేశం నిర్వహించారు. అందులో డిస్ట్రిక్ట్ బీసీవెల్ఫేర్ ఆఫీసర్ పోస్టులు ఏండింటికి సంబంధించిన ఫైలుపై చర్చించారు. వీరిలో ఒకరికి మినహా మిగతా ఆరుగురు డీబీసీవోలకు డీడీలుగా ప్రమోషన్లు కల్పిస్తూ ఆమోదం లభించింది. ఉత్తర్వులు రావాల్సి ఉన్నది. ఈ ప్రమోషన్లపై సంక్షేమభవన్ వర్గాల నుంచి, బీసీ ఉద్యోగ సంఘాల నుంచి తీవ్ర అభ్యంతరాలు వ్యక్తమవుతున్నాయి. అవకతవకలు చోటుచేసుకున్నాయని, పలువురు అనర్హులకు ప్రమోషన్లు ఇచ్చారనే ఆరోపణలొస్తున్నాయి. కొంతమంది అధికారుల గత సర్వీస్ రికార్డులు, విచారణలు, పోస్టింగ్‌లపై పెండింగ్‌లో ఉన్న అంశాలను తొక్కిపెట్టారనే విమర్శలు వినిపిస్తున్నాయి. ప్రస్తుతం ప్రమోషన్ పొందిన ఒక అధికారి గతంలోనే షరతులపై ప్రమోషన్ పొందారని వివరిస్తున్నారు. ముఖ్యంగా ఎస్సీ కుల ధ్రువీకరణపై విచారణకు లోబడి ప్రమోషన్ ఉంటుందని గతంలోనే కమిటీ పేర్కొన్నదని, ఇప్పటికీ దానిపై విచారణ కొనసాగుతున్నదని, అయితే విచారణ పూర్తికాకముందే ప్రస్తుతం మరోసారి ప్రమోషన్ ఇచ్చారనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. ఈ అంశంపై అధికారిక ఫైల్ నోటింగ్స్, విచారణ నివేదికలు ఏవీ బయటపెట్టలేదని తెలుస్తున్నది. ప్రమోషన్ కల్పించిన మరో అధికారిపై కూడా అనేక పరిపాలనా వ్యవహారాలు, ప్రొటోకాల్, విధులకు గైర్హాజర్ తదితర అంశాలపై క్రమశిక్షణా చర్యలకు సంబంధించిన విచారణలు ఉన్నాయని, వాటిని తొక్కిపెట్టారని సంక్షేమభవన్ వర్గాలు ఆరోపిస్తున్నాయి. మరొక అధికారిపై హాస్టళ్ల నిర్వహణ, బిల్లుల చెల్లింపులు, ఔట్ సోర్సింగ్ సిబ్బంది వేతనాలు, విదేశీ విద్యా పథకాలు తదితర అంశాల్లో అవకతవకలపై అధికారిక విచారణలు జరిగాయని, కానీ అవేవీ బయటపెట్టకుండా, క్లీన్‌చిట్ రాకముందే ప్రస్తుతం దొడ్డిమార్గంలో ప్రమోషన్ కల్పించారని ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి.

# (మొదటిపేజీ తరువాయి)

## మంత్రులు, ఎమ్మెల్యేల్లో మొదలైన గుబులు..!

వారి కుటుంబంపై భూముల విషయంలో చేస్తున్న రాజకీయ ఆరోపణలు భవిష్యత్తులో తమకు ముప్పు తెచ్చిపెట్టడం ఖాయమని వారు ఆందోళన వ్యక్తంచేసినట్టు సమాచారం. 'ఇప్పుడు వాళ్ల లెక్కలు తీస్తున్నాం.రేపు బీఆర్ఎస్ వాళ్లు మన భూముల లెక్కలు తీస్తే పరిస్థితి ఏంది?' అని పలువురు మంత్రులు, ఎమ్మెల్యేలు సీఎంను ప్రశ్నించినట్టు తెలిసింది. 'వాళ్లు ప్రతిపక్షంలో ఉన్నారు కాబట్టి ఇప్పుడేమీ కాదు.. మనం అధికార పక్షంలో ఉన్నాం, ప్రజలకు ఏం సమాధానం చెప్తాం' అని నిలదీసినట్టు తెలిసింది. మనందరికీ నిబంధనలకు విరుద్ధంగా భూములు లేవా? వాటి గురించి ఏం చేద్దాం? అని ప్రశ్నించినట్టు సమాచారం. అందరికీ ఎక్కడో ఒక చోట చిన్నదో, పెద్దదో ఫామ్‌హౌస్‌లు ఉన్నాయని, ఇది ప్రస్తుత కాలంలో కామన్‌గా మారిపోయిందని అన్నట్టుగా తెలిసింది. బీఆర్ఎస్ వాళ్లు మనందరి ఫామ్‌హౌస్‌ల లెక్కలు తీసి ప్రజల ముందుపెడితే ఎలా? అని ప్రశ్నించినట్టుగా సమాచారం.ఎలాగూ మన ప్రభుత్వం మరోసారి వచ్చే పరిస్థితిలేదని, వచ్చేది పక్కాగా బీఆర్ఎస్ ప్రభుత్వమేనని, ఆ తర్వాత తమ పరిస్థితి ఏందని ప్రశ్నించినట్టు తెలిసింది. ఈ భేటీ సందర్భంగా సీఎం రేవంత్‌రెడ్డి తీరును ఇద్దరు మంత్రులు ఎండగట్టినట్టుగా తెలిసింది. 'ఎన్నికల సమయంలో, నెలరోజుల కిందటి వరకూ మీరే కేసీఆర్ వ్యవసాయ క్షేత్రం వెయ్యి ఎకరాలంటూ ప్రచారం చేశారు. ఇప్పుడు అసెంబ్లీ సాక్షిగా 67 ఎకరాలు మాత్రమేనని లెక్కలతో సహా చెప్పారు. ఇదేం విధానం, ఏం చెప్పదలుచుకుంటున్నారు?' అని ప్రశ్నించినట్టు తెలిసింది. మీరే వెయ్యి ఎకరాలని ఆరోపించి, ఇప్పుడు మీరే మీ నోటితో 67 ఎకరాలని ఎలా చెప్తారని నెటిజన్లు సైతం ప్రశ్నిస్తున్నారు. మీరే కేసీఆర్‌కు క్లీన్‌చిట్ ఇచ్చారని అన్నట్టు తెలిసింది. ఇలాంటి తొందరపాటు చర్యలు తీసుకోవద్దని వారించినట్టు సమాచారం.

## కోదాడలో త్వరలో టాస్క్ కేంద్రం

అవకాశాల కల్పనలో కీలక పాత్ర పోషించాలని కోరారు. డిగ్రీ, ఇంజినీరింగ్, పీజీ, డిప్లొమా, ఐటీఐ, ఫార్మసీ తదితర విద్యార్హతలు కలిగిన యువతకు పరిశ్రమలు విస్తృత అవకాశాలు కల్పించాలన్నారు. ఎమ్మెల్యే పద్మావతిరెడ్డి విజ్ఞప్తి మేరకు కోదాడలో వీలైనంత త్వరగా 'టాస్క్' కేంద్రాన్ని ఏర్పాటు చేస్తామని హామీ ఇచ్చారు.

## వికసిత్ భారత్ లో తెలంగాణది కీలక పాత్ర

రాష్ట్రాలు కలిసి ముందుకు సాగాల్సిన అవసరం ఉందని ఉప ముఖ్యమంత్రి అన్నారు. ప్రభుత్వ, ప్రయివేటు వనరులను సమర్థంగా సమీకరించడంతో పాటు బలమైన సంస్థలు, పరస్పర సహకార విధానాలు అవసరమన్ని తెలిపారు. తెలంగాణ కేవలం నిధులను కోరేందుకు కాకుండా, స్పష్టమైన అభివృద్ధి ప్రణాళిక, ఆర్థిక వనరుల సమీకరణకు నిర్దిష్ట విధానం, దీర్ఘకాలిక లక్ష్యంతో ఈ చర్చలో భాగస్వామ్యమవుతోందని తెలిపారు. 3 ట్రిలియన్ డాలర్ల ఆర్థిక వ్యవస్థను నిర్మించాలంటే మౌలిక వసతులకు నిధులు సమకూర్చే విధానంలో మార్పు అవసరమని భట్టి విక్రమార్క వివరించారు. రోడ్లు, వంతెనలు, ఇతర మౌలిక వసతుల కోసం ప్రభుత్వ రుణాలపైనే అధికంగా ఆధారపడే పద్ధతి నుంచి క్రమంగా మారాల్సిన అవసరం ఉందన్నారు. ప్రయివేటు పెట్టుబడులు, సంస్థాగత నిధులు, సావరిన్ ఫండ్స్ నుంచి అధిక మొత్తంలో పెట్టుబడులను సమీకరించి, ప్రభుత్వ నిధులను వ్యూహాత్మకంగా వినియోగించే నమూనా వైపు తెలంగాణ అడుగులు వేస్తోందన్నారు. ప్రాజెక్టుల్లో పెట్టుబడిదారుల రిస్క్‌ను తగ్గించడం, వయబిలిటీ గ్యాప్‌లను పూడ్చడం, ప్రయివేట్ పెట్టుబడులకు విశ్వాసం కల్పించడం వంటి అంశాల్లో ప్రభుత్వ నిధులు కీలక పాత్ర పోషిస్తాయని తెలిపారు.

## మహిళపై ఇంత కర్కశత్వమా?..

స్పందించకుండా ఉన్నారని, అదే సమయంలో ప్రజలు, రాజకీయ ప్రత్యర్థుల విషయంలో మాత్రం అత్యంత దూకుడుగా వ్యవహరిస్తున్నారని విమర్శించారు. ఒడిశాకు చెందిన ఓ పేద యువతిని ఎంపీ కొడుకు వాహనంతో ఢీకొట్టి చంపితే పోలీసులు మౌనం వహించారని మండిపడ్డారు. రాజకీయంగా పలుకుబడి ఉన్న వ్యక్తుల కుటుంబాలకు సంబంధించిన కేసుల్లో ఒక రకంగా, సామాన్య ప్రజలు లేదా రాజకీయ ప్రత్యర్థుల విషయంలో మరో రకంగా వ్యవహరిస్తున్నారని నిప్పులు చెరిగారు. మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్‌పై దాడి చేయించేందుకు గూండాలను ప్రత్యేక తాళ్ల బృందాలతో పోలీసులు ఎస్కార్ట్ కల్పించారని కేటీఆర్ ఆరోపించారు. పోలీసు వ్యవస్థను రాజకీయ ప్రత్యర్థులపై ఉపయోగిస్తున్నారని విమర్శించారు. ఈ నెల 7న అసెంబ్లీ వద్ద మహిళా ఎమ్మెల్యేలపై పోలీసులు దాడి చేశారని, వారి జుట్టు, చీరలు లాగారని గుర్తుచేశారు. తమ పార్టీ నేత మన్నె క్రిశాంక్ అరెస్టు వ్యవహారంలో ఆయన బిడ్డను పాఠశాలకు వెళ్లకుండా అడ్డుకొని భయభ్రాంతులకు గురిచేశారని ఆవేదన వ్యక్తంచేశారు.చిన్నారులు, మహిళల రక్షణ విషయం లో పోలీసు వ్యవస్థ మరింత బాధ్యతాయుతంగా వ్యవహరించాల్సిన అవసరం ఉన్నదని పేర్కొన్నారు.

## కాంగ్రెస్ సర్కార్ చేతకానితనం వల్లే కరువు

భేషజాలు పకనపెట్టి కన్నెపల్లి మోటర్లు ఆన్ చేసి గోదావరి నీళ్లు ఎత్తాలని, యాదాద్రి, భద్రాద్రిలో విద్యుత్తు ఉత్పత్తి స్టార్ట్ చేసి రైతులకు 24గంటల కరెంటివ్వాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.ఎల్‌నినోపై నెట్టేయడం బాధ్యతారాహిత్యం ఇది కాలం తెచ్చిన కరువు కాదని, కాంగ్రెస్ తెచ్చిన కరువు, రేవంత్‌రెడ్డి తెచ్చిన కరువు అంటూ హరీశ్‌రావు నిప్పులు చెరిగారు. నీళ్లు, కరెంటు.. ఈ రెండు విషయాల్లోనూ ప్రభుత్వం తన తప్పిదాలను ఎల్‌నినోపై నెట్టి చేతులెత్తేయడం బాధ్యతారాహిత్యమని ధ్వజమెత్తారు. కృష్ణా బేసిన్‌లో గతంలో ఎన్నడూ లేనివిధంగా 2024-25లో 286 టీఎంసీల నీటిని వాడామని మంత్రి ఉత్తమ్ చెబుతున్నదంతా పచ్చి అబద్ధమని తేల్చిచెప్పారు.నీటి కోటాను వాడుకోలేని అసమర్థ ప్రభుత్వం మన తాత్కాలిక వాటా 34శాతం కాగా ఆ కోటా మేరకు కూడా వాడుకోలేని అసమర్థ ప్రభుత్వం కాంగ్రెస్ అని హరీశ్‌రావు నిప్పులు చెరిగారు. 2014 నుంచి 2017 వరకు బీఆర్ఎస్ హయాంలో తెలంగాణ 31శాతం, 35.8శాతం, 45శాతం దాకా వాడుకుంటే.. 2024-25లో ఆంధ్రప్రదేశ్ 71.5% వాడుకున్నదని, తెలంగాణ వాడింది కేవలం 28.4శాతమేనని వివరించారు. 2025-26 సంవత్సరంలో మరీ దారుణంగా 25శాతం జలాలను మాత్రమే వాడుకున్నదని ధ్వజమెత్తారు.ప్రస్తుతం ఎల్‌నినో కరువు కాలంలోనూ ఏపీ 83 టీఎంసీలు వాడుకుంటే, హైదరాబాద్ తాగునీటితో కలిపి తెలంగాణ వాడింది కేవలం 43టీఎంసీలేనని చెప్పారు. కల్వకుర్తి ఎత్తిపోతల కింద శ్రీశైలంలో నీళ్లున్నా ఐదు మోటర్లకుగాను ఒకటి, రెండు మోటర్లే, అది కూడా రోజుకు 10 గంటలే నడుపుతున్నారని మండిపడ్డారు. కరెంట్ లేక మోటర్లు నడుపక, కేసీఆర్ సాగులోకి తీసుకొచ్చిన 3.16లక్షల ఎకరాల ఆయకట్టును ఆగం చేస్తున్నారని వాపోయారు. నెట్టెంపాడు, భీమా, కోయిల్ సాగర్, జూరాల కింద దాదాపు 3లక్షల ఎకరాల పంట ఎండిపోయే ప్రమాదకర స్థితిలో ఉన్నదని, కనీసం కర్ణాటకలోని అదే కాంగ్రెస్ ప్రభుత్వాన్ని అడిగి ఆల్మట్టి నుంచి ఒక నెల రోజులు నీళ్లు తెప్పించి పంటలు కాపాడే సోయి తెలంగాణ కాంగ్రెస్‌కు లేదని నిప్పులు చెరిగారు. గోదావరి బేసిన్ విషయానికొస్తే మరీ దారుణమని హరీశ్‌రావు మండిపడ్డారు. అన్నారం, సుందిళ్ల, మేడిగడ్డ బరాజ్‌లపై కేంద్ర ప్రభుత్వ సంస్థ సెంట్రల్ వాటర్ అండ పవర్ రీసెర్చ్ స్టేషన్(సీడబ్ల్యూపీఆర్ఎస్) ఇచ్చిన అఫీషియల్ రిపోర్ట్ తమ వద్ద ఉన్నదని వెల్లడించారు. బరాజ్‌లపై రీబౌండ్ హామర్ టెస్ట్, జీపీఆర్, అల్ట్రాసోనిక్ పల్స్ వెలాసిటీ(యూపీవీ) తదితర 3 రకాల టెస్టులు చేశారని వివరించారు. సుందిళ్ల, అన్నారంలో 100శాతం నాణ్యత బాగున్నదని, మేడిగడ్డలోనూ కుంగిన బ్లాక్-7 మినహా, మిగతా ఆరు బ్లాకులు సేఫ్ అని తేల్చిందని తెలిపారు.నీటి నిర్వహణ, నిల్వ, వినియోగంపై రాష్ట్ర ప్రభుత్వమే నిర్ణయం తీసుకోవాలని, నీళ్లు ఎత్తుకోవచ్చని ఎన్‌డీఎస్ఏనే హైకోర్టులో అఫిడవిట్ వేసిందని, విశ్రాంత ఇంజినీర్లు కూడా మేడిగడ్డ గేట్లు తెరిచి ఉంచి ప్రవాహం ద్వారా నీళ్లు ఎత్తొచ్చని ప్రభుత్వానికే లేఖ రాశారని గుర్తుచేశారు. అయినప్పటికీ సర్కార్ ఎందుకు మోటర్లు ఆన్ చేయడం లేదని నిలదీశారు.

## 22 ఏ సమస్యలకు త్వరలో ముగింపు

ఇండ్లను క్రమబద్ధీకరిస్తామని, ఎవరూ ఇండ్లు కూల్చాల్సిన పరిస్థితి ఉండదని స్పష్టం చేశారు. జీవో 118 ద్వారా మేడ్చల్, రంగారెడ్డి జిల్లాల్లోని మరికొంత మంది సమస్యలను కూడా నెల రోజుల్లోగా పరిష్కరిస్తామని చెప్పారు.రాష్ట్రవ్యాప్తంగా భూ సర్వే నిర్వహించి భూముల సరిహద్దులను డిజిటల్ మ్యాపింగ్ ద్వారా నమోదు చేసి ప్రతి భూమికీ భద్రత కల్పిస్తామని మంత్రి హామీ ఇచ్చారు.22ఏ సమస్య ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ కాలం నుంచే ఉందని, దానిని పరిష్కరించేందుకు ప్రభుత్వం సిద్ధంగా ఉందని చెప్పారు. జీహెచ్ఎంసీ, హెచ్ఎండీఏ పరిధిలోని లేఅవుట్లలోని కొన్ని ప్లాట్లు కూడా 22ఏ జాబితాలో చేరాయని, వాటిని పరిశీలించి పరిష్కరిస్తామని ప్రకటించారు. కోల్‌బెల్ట్ ప్రాంతంలోనూ ఇలాంటి సమస్యలు ఉన్నాయని, వాటి పరిష్కారానికి ముగ్గురు సభ్యులతో కమిటీని ఏర్పాటు చేసినట్టు తెలిపారు. ఎన్నికలను దృష్టిలో పెట్టుకుని జీవో 118 జారీ చేయలేదని, పేదల కష్టాలు తెలిసిన ప్రభుత్వం ప్రజల హక్కులను కాపాడేందుకు ఈ నిర్ణయం తీసుకుందని చెప్పారు. గతంలో దరఖాస్తు చేసుకున్న ప్రతి ప్లాట్ యజమానికీ పూర్తి హక్కులు కల్పిస్తామని హామీ ఇచ్చారు. మంత్రి పొన్నం ప్రభాకర్ మాట్లాడుతూ.. రెవెన్యూ శాఖలోని చిక్కులను తొలగించేందుకు 44 కాలనీల కోసం జీవో 118 తీసుకొచ్చామని తెలిపారు. త్వరలో భూ సదస్సులు నిర్వహిస్తామని చెప్పారు.

# రీయింబర్స్‌మెంట్ ఎత్తివేతకు కుట్ర

- తక్షణమే రూ.8.500 కోట్ల ఫీజు బకాయిలు చెల్లించాలి
- విద్యార్థులు, కృష్ణయ్య నిరసన ర్యాలీ
- అడ్డుకున్న పోలీసులు.. ఉద్రిక్తత



హైదరాబాద్,సెప్టెంబర్-19: ఫీజు రీయింబర్స్‌మెంట్ స్కీమ్‌ను ఎత్తివేయడానికి కాంగ్రెస్ ప్రభుత్వం కుట్ర పన్నుతున్నదని బీసీ సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షుడు ఆర్ కృష్ణయ్య మండిపడ్డారు. రేవంత్ సర్కార్ రాష్ట్రంలో 14 లక్షల మంది విద్యార్థుల జీవితాలతో చెలగాటమాడుతున్నదని దుయ్యబట్టారు. ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలు విడుదల చేయాలని డిమాండ్ చేస్తూ బీసీ విద్యార్థి సంఘం రాష్ట్ర కన్వీనర్ నిఖిల్ పటేల్ ఆధ్వర్యంలో శనివారం బషీర్‌బాగ్ చౌరస్తాలోని డీఈవో కార్యాలయం నుంచి సెక్రటేరియట్ వరకు నిర్వహించిన ర్యాలీలో ఆర్ కృష్ణయ్య పాల్గొన్నారు.బషీర్‌బాగ్ చౌరస్తా వద్ద పోలీసులు ర్యాలీని అడ్డుకున్నారు. దీంతో కొద్దిసేపు పోలీసులకు, విద్యార్థులకు తోపులాట జరిగింది. తీవ్ర ఉద్రిక్త పరిస్థితి నెలకొన్నది. ఈ సందర్భంగా ఆర్ కృష్ణయ్య మాట్లాడుతూ.. పెండింగ్‌లో ఉన్న రూ.8.500 కోట్ల ఫీజు బకాయిలు చెల్లించకుండా ప్రభుత్వం నిర్లక్ష్యం చేస్తున్నదని పేర్కొన్నారు. ఈ ఏడాది ఇంజినీరింగ్ కళాశాలల్లో 50% సీట్లు కూడా భర్తీకాలేదని విమర్శించారు. విద్యార్థుల చదువులకు బడ్జెట్ లేదని చెప్పడం సిగ్గుచేటని మండిపడ్డారు.ఇప్పటి వరకు రూ. 4 లక్షల కోట్లు అప్పులు తెచ్చి ఏమీ అభివృద్ధి చేశారో.. ఎన్ని సంక్షేమ పథకాలు అమలు చేశారో శ్వేతపత్రం విడుదల చేయాలని డిమాండ్ చేశారు. విద్యార్థులు శాంతియుతంగా ర్యాలీ చేస్తుంటే పోలీసుల చేత దౌర్జన్యం చేయించడంపై మండిపడ్డారు. తక్షణమే సీఎం రేవంత్‌రెడ్డి, కాంగ్రెస్ ప్రభుత్వం విద్యార్థులకు క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు. ఫీజు బకాయిలు పాత పద్ధతిలో విడుదల చేసే వరకు తెలంగాణ తరహాలో ఉద్యమాలు చేపడుతామని హెచ్చరించారు.

## 'సింగరేణి' స్థలాల సమస్యకు పరిష్కారం: పొంగులేటి



హైదరాబాద్,సెప్టెంబర్-19: సింగరేణి కార్మికుల ఇండ్ల స్థలాల సమస్యకు శాశ్వత పరిష్కారం చూపే దిశగా చర్యలు చేపడుతున్నట్టు మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి తెలిపారు. శనివారం సచివాలయంలో నిర్వహించిన సమీక్షలో ఆయన మాట్లాడుతూ.. సింగరేణి బొగ్గు బెల్ట్ ప్రాంతంలోని ఇండ్ల స్థలాల సమస్యకు చట్టబద్ధమైన పరిష్కారం చూపుతూ అర్హులైన కుటుంబాలకు హక్కు కల్పించే ప్రక్రియను వేగవంతం చేస్తున్నామని చెప్పారు. భద్రాద్రి కొత్తగూడెం, జయశంకర్ భూపాలపల్లి, కుమ్రం భీం ఆసిఫాబాద్, ఆదిలాబాద్, మంచిర్యాల, పెద్దపల్లి, జగిత్యాల జిల్లాల్లో పెండింగ్‌లో ఉన్న దరఖాస్తులను హైకోర్టు ఆదేశాలకు లోబడి 45 రోజుల్లోపు పరిష్కరించాలని అధికారులను ఆదేశించారు. పెండింగ్ దరఖాస్తుల పరిశీలన, పరిష్కారం కోసం ప్రతి జిల్లాలో త్రిసభ్య కమిటీని ఏర్పాటు చేసినట్టు ఆయన వెల్లడించారు. జిల్లా కలెక్టర్ చైర్మన్‌గా, సింగరేణి కాలరీస్ కంపెనీ లిమిటెడ్ ప్రతినిధి, జిల్లా రిజిస్ట్రార్ సభ్యులుగా ఉంటారని తెలిపారు.

### క్యూర్ పరిధిలో 21వేల డబుల్ బెడ్‌రూమ్ ఇండ్లు

క్యూర్ పరిధిలోని 26 ప్రాంతాల్లో 21వేల డబుల్ బెడ్ రూమ్ ఇండ్లను పూర్తి చేశామని రెవెన్యూ, హౌసింగ్ శాఖల మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి తెలిపారు. శనివా రం హైదరాబాద్, రంగారెడ్డి, మేడ్చల్, సంగారెడ్డి కలెక్టర్లతో ఆయన వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. డబుల్‌బెడ్ రూమ్ ఇండ్లకు ఈ నెల 30లోగా డ్రా పద్ధతిలో లబ్ధిదారుల ఎంపిక పూర్తి చేసి ఆన్‌లైన్ పోర్టల్‌లో వివరా లను నమోదు చేయాలని అధికారులను ఆదేశించారు. డబుల్ బెడ్ రూమ్ ఇండ్లు ఉన్న ప్రాంతానికి 5 నుంచి 7 కిలోమీటర్ల పరిధిలో ఉన్నవారినే ఎంపిక చేయాలని సూచించారు.

## గొంతు నొక్కాలని చూస్తే ఊరుకోం!

- మీ ఆగడాలను అడ్డుకొని తీరుతాం
- మంత్రి పొంగులేటి సమక్షంలోనే
- కాంగ్రెస్ నాయకులకు సుధీర్ రెడ్డి వార్నింగ్



హైదరాబాద్,సెప్టెంబర్-19: ఇండ్ల పట్టాల పంపిణీ కార్యక్రమం ఉద్రిక్తతకు దారి తీసింది. పేదలకు అందించే ఇండ్ల పట్టాల కార్యక్రమాన్ని సైతం కాంగ్రెస్ ప్రభుత్వం రాజకీయ చేయడంపై సర్వత్రా విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. సరూర్‌నగర్ ఇండోర్‌స్టేడియంలో నగరంలోని పలు ప్రాంతాల నివాసితులకు ఇండ్ల పట్టాల పంపిణీ కార్యక్రమం శనివారం జరిగింది. ఈ కార్యక్రమానికి స్థానిక ఎల్బీనగర్ ఎమ్మెల్యే సుధీర్ రెడ్డి రాకుండా అడ్డుకునేందుకు పోలీసులు అడుగడుగున అడ్డంకులు సృష్టించారు. క్యాంప్ కార్యాలయం చుట్టు వందలాది మంది పోలీసులు మోహరించారు. దీంతో సుధీర్ రెడ్డి మరో దారిలో కాన్వాయ్ పక్కనపెట్టి ద్విచక్రంపై ప్రయాణించి ఎట్టకేలకు సమావేశానికి చేరుకున్నారు. ఈ క్రమంలో తనను అడ్డుకునేందుకు యత్నించిన పోలీసుల చర్యలను సభావేదికపై మంత్రి పొంగులేటికి వివరించే ప్రయత్నం చేశారు. ఈ క్రమంలో సభపై ఉన్న కాంగ్రెస్ నాయకులు విచక్షణ మరిచి ఏకవచనంతో అడ్డగోలు నినాదాలు చేశారు. సుధీర్ రెడ్డి ఉపన్యాసానికి అడ్డుతగిలారు. బీఆర్ఎస్ అధినేత కేసీఆర్, వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్‌లపై అనుచిత వ్యాఖ్యలు చేశారు. దీంతో ఎమ్మెల్యే సుధీర్ రెడ్డి మంత్రి పొంగులేటి సమక్షంలోనే కాంగ్రెస్ నాయకులకు స్ట్రాంగ్ వార్నింగ్‌తో నోరు మూయించారు.'మా గొంతు నొక్కాలని చూస్తే ఊరుకునే ప్రసక్తే లేదు. మీ ఆగడాలను అడ్డుకొని తీరుతాం.' అంటూ సుధీర్ రెడ్డి ఘాటుగా హెచ్చరించారు. జీవో 118 ద్వారా గత కేసీఆర్ ప్రభుత్వం హయాంలోనే కన్వియన్స్ డీడ్‌లను ఇచ్చినప్పటికీ ప్రస్తుతం మిగిలిపోయిన వారికి ఈ డీడ్‌లు ఇచ్చేందుకు ప్రభుత్వం ప్రయత్నించింది. ఆ వేదికను కాంగ్రెస్ నేతలతో నింపి కార్యక్రమాన్ని తమకు అనుకూలంగా చేసుకోవాలని చూశారు.ఈ సందర్భంగా సుధీర్‌రెడ్డికి అనుకూలంగా బీఆర్ఎస్ నాయకులు నినాదాలు చేయడంతో ఆ ప్రాంతం ఒక్కసారిగా ఉద్రిక్త వాతవరణం నెలకొన్నది. ఓ దశలో అధికారిక కార్యక్రమంలో కాంగ్రెస్ నేతలతోనే సమావేశం ఎలా చేస్తారంటూ ప్రశ్నించడంతో కార్యక్రమంలో ఉద్రిక్తత చోటు చేసుకుంది. కాగా, స్టేజికి వెనుకవైపు కూర్చున్న లింగోజిగూడా డివిజన్‌కు చెందిన మాజీ కార్పొరేటర్ దర్పల్లి రాజశేఖర్‌రెడ్డి అనుచరుడైన ఓ నాయకుడు కేసీఆర్, కేటీఆర్‌పై చేసిన కామెంట్లపై ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డి సీరియస్ అయ్యారు.

## ముంబై టు బంగ్లాదేశ్!

- చోరీ చేసిన మొబైల్‌లు అంతర్జాతీయ మార్కెట్‌లో విక్రయం
- తెలంగాణ, మధ్యప్రదేశ్‌లలో వరుస దొంగతనాలు
- హైదరాబాద్ టాస్క్‌ఫోర్స్, ఖమ్మం పోలీసుల సంయుక్త ఆపరేషన్
- తొమ్మిది మంది నిందితుల అరెస్టు, పరారీలో ముగ్గురు



హైదరాబాద్,సెప్టెంబర్-19: పశువులకు మత్తు ఇంజెక్షన్లు ఇచ్చి అపహరించడంతో పాటు అర్ధరాత్రి వేళల్లో సెల్‌ఫోన్ దుకాణాల షట్టర్లు లేపి దొంగతనాలకు పాల్పడుతున్న అంతర్రాష్ట్ర దొంగల ముఠాను హైదరాబాద్ సిటీ పోలీసులు, టాస్క్‌ఫోర్స్, ఖమ్మం పోలీసులు సంయుక్తంగా నిర్వహించిన ఆపరేషన్‌లో అరెస్టు చేశారు. చోరీ సొత్తును కొనుగోలు చేస్తూ బంగ్లాదేశ్‌కు అక్రమ రవాణా చేస్తున్న అంతర్జాతీయ నెట్‌వర్క్‌ను పోలీసులు ఛేదించారు.ఈ ముఠాకు చెందిన 9మందిని అదుపులోకి తీసుకున్నట్లు హైదరాబాద్ సీపీ సజ్జనార్ తెలిపారు. నిందితులు తెలంగాణ వ్యాప్తంగా 13 పశువుల దొంగతనాల కేసుల్లోనూ, ఖమ్మం, మధ్యప్రదేశ్‌లోని ఉజ్జయినిలో మొబైల్ దుకాణాల చోరీ కేసుల్లోనూ ప్రమేయం కలిగి ఉన్నారు. శనివారం బంజారాహిల్స్‌లోని టీజీఐసీసీసీలో హైదరాబాద్ పోలీసు కమిషనర్ వీసీ సజ్జనార్ మీడియాకు ఈ అంతర్జాతీయ చోరీ మొబైల్ నెట్‌వర్క్‌ను ఎలా ఛేదించామో తెలిపారు. నిందితుల నుంచి 15 మొబైల్ ఫోన్లు, మూడు కార్లు, 22లక్షల నగదును స్వాధీనం చేసుకున్నట్లు ఆయన పేర్కొన్నారు.

# తెలంగాణ

## మైనారిటీల సంక్షేమంలో సర్కార్ విఫలం

### ప్రభుత్వాన్ని ప్రశ్నించని మజ్లిస్

### బీఆర్ఎస్ సీనియర్ నేత షేక్ అబ్దుల్లా సోహైల్ ఫైర్



హైదరాబాద్,సెప్టెంబర్-19: రాష్ట్రంలోని మైనారిటీల సంక్షేమానికి కేటాయించిన నిధులను ఖర్చు చేయ దంలో కాంగ్రెస్ ప్రభుత్వం పూర్తిగా విఫలమైందని, నిధుల కోసం పోరాడటంలో ఎంఐఎం పూర్తిగా చేతులెత్తేసిందని బీఆర్ఎస్ సీనియర్ షేక్ అబ్దుల్లా సోహైల్ శనివారం ఒక ప్రకటనలో ఆరోపిం చారు.గత రెండు బడ్జెట్లలో మైనారిటీల సంక్షేమ కోసం రూ.5,100.97 కోట్లు కేటాయించి, రూ.1,972.17 కోట్లు మాత్రమే ఖర్చు చేశారని శాసనసభా వేదికగా ప్రభుత్వమే అంగీకరించిందని సోహైల్ గుర్తుచేశారు. మజ్లిస్ నేతలు అసెంబ్లీ సమావేశాల్లో మైక్‌ల ముందే ప్రశ్నిస్తూ మొకుబడి చర్యలకే పరిమితమవుతున్నారని ఆగ్ర హం వ్యక్తంచేశారు. నిధుల కేటాయిం పు, విడుదల, లబ్ధిదారుల వివరాలపై ప్రభుత్వం శ్వేతపత్రం విడుదల చేయాలని సోహైల్ డిమాండ్ చేశారు.

## వ్యవసాయ రంగంలో లోటుపాట్లు సరిదిద్దండి: తుమ్మల



హైదరాబాద్,సెప్టెంబర్-19: వ్యవసాయ రంగంలో లోటుపాట్లను సరిదిద్దాలని వ్యవసాయ, మారెటింగ్ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు అధికారులను ఆదేశించారు. శనివారం దక్షిణాది రాష్ట్రాల వ్యవసాయ సదస్సు సూచనల నేపథ్యంలో సచివాలయంలో ఉన్నతాధికారులతో సమగ్ర సమీక్ష నిర్వహించారు. రాష్ట్రంలో రసాయన ఎరువుల అతి వినియోగంపై ఆందోళన వ్యక్తంచేస్తూ, యూరియా వాడకం జాతీయ సగటు కంటే ఎకువగా ఉన్నదని, జీవ ఎరువులు, సూక్ష్మ పోషకాల వినియోగాన్ని ప్రోత్సహించాలని ఆదేశించారు. యాసంగికి అవసరమైన విత్తనాలను ముందుగానే సిద్ధం చేయాలని సూచించారు.

## జీపీ భవన నిర్మాణాల్లో వేగం పెంచాలి: సీతక్క



హైదరాబాద్,సెప్టెంబర్-19: గ్రామీణ ప్రాంతాల్లో మంజూరైన గ్రామ పంచాయతీ, గ్రామ సమైక్య, అంగన్‌వాడీ భవనాల నిర్మాణ పనుల్లో వేగం పెంచి, సకాలంలో పూర్తి చేయాలని పంచా యతీ రాజ్, గ్రామీణాభివృద్ధి శాఖ మంత్రి సీతక్క అధికారులను ఆదేశించారు. శనివారం సచివా లయంలో ఆ యా భవనాల నిర్మాణ పనుల పురోగతిపై ఆమె అధికారులతో సమీక్షించారు. రాష్ట్రంలో 9,745 గ్రామ సమైక్య భవనాలు మంజూరు కాగా, ఇప్పటివరకు 534 భవనాల నిర్మాణ పనులు పూర్తయ్యాయని అధికారులు తెలిపారు. మరో 6,141 భవనాల నిర్మాణ పనులు పురోగతిలో ఉన్నాయని, 3,070 భవనాల పనులు ప్రారంభం కావాల్సి ఉన్నట్టు తెలిపారు.3,906 గ్రామపంచాయతీ భవనాలు మంజూరు కాగా, ఇప్పటికే 444 భవనాల నిర్మాణ పనులు పూర్తయ్యాయని, మిగిలిన 3,444 భవనాల పనులు కొనసాగుతున్నాయని చెప్పారు. 2,313 అంగన్‌వాడీ భవనాలు మంజూరు కాగా, ఇప్పటివరకు 200 భవనాల పనులు పూర్తయ్యాయని, మిగిలిన 2,113 భవనాల పనులు కొనసాగుతున్నాయని వివరించారు. అంగన్‌వాడీ భవనాల నిర్మాణానికి అదనపు నిధులు సమీకరించేందుకు ఎంపీ లాడ్స్ నిధులు వినియోగించుకునేలా చర్యలు తీసుకోవాలని, ఈ విషయమై తాను రాష్ట్ర ఎంపీలకు లేఖలు రాస్తానని మంత్రి తెలిపారు. సమావేశంలో స్పెషల్ సీఎస్ దానకిశోర్, పంచాయతీరాజ్ గ్రామీణాభివృద్ధిశాఖ కమిషనర్ దివ్యాదేవరాజన్, మహిళా శిశు సంక్షేమశాఖ కమిషనర్ శృతి ఓఝా, పంచాయతీరాజ్ ఈఎన్సీ జగదీశ్‌తోపాటు వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

## • జాతీయం-అంతర్జాతీయం

# మోడీ-షా విభేదాలు? రాజీనామాకు సీనియర్ల నో..!



### కేబినెట్ ప్రక్షాళన ఆలస్యం వెనుక?

**న్యూఢిల్లీ, సెప్టెంబర్-19:** రెండు నెలలుగా అప్పుడు, ఇప్పుడు అంటూ ఊరిస్తూ వస్తున్న కేంద్ర కేబినెట్ ప్రక్షాళన (ఖుఎఆఅవ్ =వంప్త్రబటటశ్రీవ) అంతకంతకూ ఆలస్యమవుతోంది. పార్లమెంట్ వర్షాకాల సమావేశాలకు ముందే కేబినెట్ ప్రక్షాళనకు రంగం సిద్ధమైనా, అనివార్య కారణాలతో వాయిదా పడింది. అప్పటి నుంచి డెడ్ లైన్లు మారుతున్నాయి కానీ కేబినెట్ ప్రక్షాళన మాత్రం జరగడం లేదు. దీంతో ప్రస్తుతం ఉన్న చాలా మంది మంత్రులు అదనపు శాఖల భారం మోయాల్సి వస్తోంది. ఆ మేరకు పాలన కుంటుపడుతోందన్న విమర్శలు వస్తున్నాయి. అయితే కేంద్ర కేబినెట్ ప్రక్షాళన ఆలస్యం వెనుక సంచలన కారణాలు ఉన్నట్లు తెలుస్తోంది. కేంద్ర కేబినెట్ ప్రక్షాళన చేయాలన్న ఉద్దేశంతో ఇప్పటికే పలువురు రాజ్యసభ సభ్యులైన కేబినెట్ మంత్రులకు ఈసారి పొడిగింపు ఇవ్వలేదు. అలాగే పలువురు మంత్రుల్ని అసెంబ్లీ ఎన్నికలు జరగాల్సిన రాష్ట్రాలకు ఇన్ చార్జ్ లుగా పంపారు. కేంద్రంలో పదవి ఇస్తామని ఊరించి నితీశ్ కుమార్ ను బీహార్ సీఎం పదవి నుంచి దించేశారు. కాక్రోచ్ నిరసనలతో విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామా చేసారు. ఆయన శాఖను ప్రహ్లాద్ జోషీ మోయాల్సి వస్తోంది. అయినా కేబినెట్ ప్రక్షాళనకు ముందడుగు పడటం లేదు. దీని వెనుక ఉన్న కారణాలను కాక్రోచ్ జనతా పార్టీ (జజీూ) నేత సౌరవ్ దాస్ బయటపెట్టారు. ప్రధానమంత్రి పుట్టినరోజు నాటకం ముగిస్తే, భారతదేశానికి ఇప్పటికీ పూర్తికాల విద్యాశాఖ మంత్రి లేకపోవడంపై ఇప్పుడు మనం దృష్టి పెట్టగలమా?అంటూ సౌరవ్ దాస్ ఓ ట్వీట్ చేశారు. ప్రధాని, హోం మంత్రికి మధ్య ఉన్న తీవ్ర మైన విభేదాల కారణంగా మంత్రివర్గ పునర్వ్యవస్థీకరణ నిలిచిపోయిందని బీజేపీలో గుసగుసలు వినిపిస్తున్నాయని ఆయన తెలిపారు. దానికి తోడు, రాజీనామా చేయమని కోరినా నిరాకరిస్తున్న సీనియర్ మంత్రుల నిశ్శబ్ద తిరుగుబాటు కూడా ఉందన్నారు. పరిపాలన విషయంలో ఈ ప్రభుత్వం పూర్తిగా దారి తప్పడం దిగ్భ్రాంతి కలిగిస్తోందన్నారరు. గంభీరమైన పరిపాలనను పణంగా పెట్టి, మొత్తం మంత్రివర్గాన్ని, రాష్ట్ర బీజేపీ ప్రభుత్వాలను దీపాలు వెలిగించడం, మహామానవుడికి హారతి ఇవ్వడంలో పెట్టేశారని చురకలు అంటించారు. క్షేత్రస్థాయి పరిస్థితులతో పూర్తిగా సంబంధం తెగిపోయిందన్నారు. యువతరం తమ భవిష్యత్తు గురించి ఆందోళన చెందుతుంటే, ప్రభుత్వం పన్ను చెల్లింపుదారుల డబ్బును పూర్తిగా పనికిమాలిన వాటిపై ఖర్చు చేయడంలో నిమగ్నమై ఉందని విమర్శించారు. భారతదేశం, దాని యువత ఇంతకంటే మెరుగైన దానికి అర్హులు, పూర్తికాల విద్యాశాఖ మంత్రితో ఇది ప్రారంభం కావాలని కోరారు. ప్రధానమంత్రి తన మంత్రివర్గాన్ని పునర్వ్యవస్థీకరించలేకపోవడం విద్యా మంత్రిత్వ శాఖలో తీవ్రమైన సమస్యలను సృష్టిస్తోందన్నారు. మంత్రి చివరికి పదవి నుంచి తప్పుకుంటారని తెలిసి అధికారులు వణికిపోతున్నారన్నారు. కానీ జంతర్ మంతర్‌కు ముందు నెలల నుంచే ఈ పునర్వ్యవస్థీకరణ పెండింగ్‌లో ఉందని, పరిపాలన పూర్తిగా కుప్పకూలిపోయిందని విమర్శించారు.

## కేజ్రీవాల్, ఆయన ఫ్యామిలీకి SIR నోటీసులు.. ఈసీపై ఆప్ ఫైర్

**న్యూఢిల్లీ, సెప్టెంబర్-19:**



ఆమ్ ఆద్మీ పార్టీ అధినేత, ఢిల్లీ మాజీ సీఎం కేజ్రీవాల్ కు బిగ్ షాక్ తగిలింది. సర్ ప్రక్రియలో భాగంగా ఢిల్లీ ఓటర్ జాబితాకు సంబంధించి ఆయన కుటుంబంలోని ఐదుగురికి ఢిల్లీ ప్రధాన ఎన్నికల అధికారి కార్యాలయం నోటీసులు జారీ చేసింది. వీరిలో కేజ్రీవాల్, ఆయన భార్య సునీతా కేజ్రీవాల్, కుమారుడు పుల్కిత్ కేజ్రీవాల్ అలాగే తల్లిదండ్రులు గోవింద్ రామ్ కేజ్రీవాల్, గీతా దేవి ల పేర్లు ఉన్నాయి. అయితే ఇదే విషయంలో ఎన్నికల సం ఘంపై ఆమ్ ఆద్మీ పార్టీ ఫైర్ అయింది.ఢిల్లీకి మూడుసార్లు ముఖ్య మంత్రిగా పనిచేసిన అరవింద్ కేజ్రీవాల్ జీ, ఆయన కుటుంబ సభ్యుల పేర్లు ఢిల్లీ ఓటరు జాబితాలో లేకపోవడం ఎలా సాధ్యం..? అని ప్రశ్నించింది. దేశంలో జరుగుతున్న ప్రతీ అంశం సుప్రీం లార్డ్ ను సంతోష పెట్టేం దుకేనా..? అంటూ ఎద్దేవా చేసింది. ఇక కేజ్రీవాల్ ఫ్యామిలీ మొత్తం మరోసారి ఎన్నికల అధికారుల ముందు హాజరై ఓటు సరి చేసుకోవాల్సి ఉంటుంది. అందుకు సంబంధించిన పత్రాలను సమర్పించాల్సి ఉంటుంది. ఇక కేజ్రీవాల్ న్యూఢిల్లీ- 40 అసెంబ్లీ నియోజకవర్గంలో నమోదైన ఓటరుగా ఉన్నారు.మరోవైపు ఢిల్లీలో సర్ ప్రక్రియలో భాగంగా ఓటర్ల జాబితాలో వివరాలకు సంబంధించి అవకతవకలు ఉన్న మొత్తం 33.1 లక్షల మంది ఓటర్లకు నోటీసులు జారీ చేసినట్లు ఎన్నికల అధికారులు వెల్లడించారు. అటు ఢిల్లీ సీఎం రేఖా గుప్తాకు కూడా సర్ ప్రక్రియలో భాగంగా నోటీసులు జారీ అయినట్లు సమాచారం. అయితే ఆమె వివరాలు, పత్రాలను పరిశీలించిన తర్వాత ఓటరు నమోదు చెల్లుబాటు అయిందని ఎన్నికల సంఘం స్పష్టం చేసినట్లు తెలుస్తోంది. అలాగే రాజ్యసభ ఎంపీ కపిల్ సిబల్ కూడా గత సర్ తో వివరాలు మ్యాప్ కాకపో వడం కారణంగా నోటీసులు అందుకున్నారు. ఇక మాజీ ఢిల్లీ బీజేపీ అధ్యక్షుడు వీరేంద్ర సచ్ దేవా, ఆయన భార్య, సోదరుడికి కూడా నోటీసులు జారీ చేసినట్లు సమాచారం అందుతోంది. ఇక సర్ ప్రక్రియలో తుది ఓటరు జాబితాను నవంబర్ 4న విడుదల చేయనున్నారు అధికారులు.

## వచ్చే 20 ఏళ్లలో భారత్ స్థానం ఇదే..

### అజిత్ దోవల్ కీలక వ్యాఖ్యలు

**న్యూఢిల్లీ, సెప్టెంబర్-19:**జాతీయ భద్రతా సలహాదారు అజిత్ దోవల్ భారత్ అభివృద్ధిపై కీలక వ్యాఖ్యలు చేశారు. రానున్న 20 ఏళ్లలో భారత జీడీపీ 38 ట్రిలియన్ డాలర్లకు చేరుతుందని హర్షం వ్యక్తం చేశారు. భారత ఆర్థిక వ్యవస్థ ప్రస్తుతం ఉన్న 4.015 ట్రిలియన్ డాలర్ల ఎకానమీ నుంచి 38 ట్రిలియన్ డాలర్ల ఎకానమీకు చేరుతుందని ఆయన అంచనా వేశారు. ఉత్తరాఖండ్ లోని ఐఐటీ రూర్కీ లో నిర్వహించిన స్నాతకోత్సవం కార్యక్రమానికి అజిత్ దోవల్ ముఖ్య అతిథిగా విచ్చేశారు. అనంతరం మాట్లాడారు. ప్రస్తుతం ఇలాంటి కాలంలో విద్యార్థులు జీవిస్తున్నందుకు వాళ్లు అదృష్టవంతులను రానున్న కాలంలో విద్యార్థుల భవిష్యత్తు మరింత నమ్మకమైన భరోసా ఇక్కడ ఉంటుందని స్పష్టం చేశారు. అలాగే విద్యార్థులు శ్రీ రాముడి మాదిరి ధైర్య సాహసాలతో ఉండాలని సూచించారు. శ్రీరాముడి ధైర్య సాహసాలను చూసే మహార్షి విశ్వామిత్రుడు రాక్షసులను అంతమొందించేందుకు ఆయన్ను ఎంచుకున్నాడని గుర్తుచేశారు. " దేశంలో గణనీయమైన మార్పులు చోటుచేసుకుంటున్నాయి. అత్యద్భుతమైన భవిష్యత్తు దిశగా భారత్ అడుగులు వేస్తోంది. 2047 అమృత్ కాల్ అని ప్రధాని నరేంద్ర మోదీ ఇప్పటికే తెలిపారు. ఇది నిజంగా అద్భుతమైన అమృత కాలం. భారత ప్రస్తుత జీడీపీ 4.015 ట్రిలియన్ గా ఉంది. అయితే వచ్చే 20 ఏళ్లలో అది 38 ట్రిలియన్ అమెరికన్ డాలర్లకు చేరుతుంది" అని దోవల్ స్పష్టం చేశారు. అలాగే తాను సిక్కింలో గతంలో పోస్టింగ్ ఇచ్చినప్పుడు అక్కడ ఓ గురువు వద్ద మూడు మంత్రాలను నేర్చుకున్నానని అవి తన జీవితంలో విజయవంతం అవ్వడానికి ఎంతో సాయపడ్డాయని వివరించారు. అందులో మొదటిది మనం ఎక్కడ ఉన్నాం.. రెండోది మనం ఎక్కడి నుంచి ఎక్కడికి వెళ్లాలి. ఇక మూడోది అక్కడకు వెళ్లినా తిరిగి మళ్లీ ఇక్కడకు ఎలా చేరుకోవాలి..? అనే దానిపైనే ఉంటుందని విద్యార్థులకు అజిత్ దోవల్ హితబోధ చేశారు. ప్రస్తుతం టెక్నాలజీ ఎంతో పెరిగిపోయిందని యువత, విద్యార్థులకు ఎన్నో అవకాశాలు ఏర్పడుతున్నాయని అజిత్ దోవల్ తెలిపారు. మీ ముందు తరాల ప్రజలు బానిసత్వంలో మగ్గిపోయారని.. ఇప్పటి యువతకు ఉన్నన్ని అవకాశాలు వారికి ఉండేవి కావని వివరించారు. ఇక వృద్ధి సాధించడంలో ఏ దేశానికైనా టెక్నాలజీ అత్యంత కీలకమైన శక్తిగా ఉండే దశలోకి మీరు అడుగుపెడుతున్నారని స్పష్టం చేశారు. రానున్న రోజుల్లో మీరు ఎన్నో అద్భుతాలను సాధించగలరు అని అజిత్ దోవల్ తెలిపారు.

# హౌసింగ్ బోర్డు స్థలాలు అన్యాక్రాంతం

### సెట్‌బ్యాక్, కామన్ ఏరియా స్థలాల్లో నిర్మాణాలు

**హైదరాబాద్,సెప్టెంబర్-19:**
గృహ నిర్మాణ సంస్థ స్థలాలు అన్యాక్రాంతమవుతున్నాయి. గ్రేటర్ వ్యాప్తంగా విచ్చలవిడిగా అక్రమ నిర్మాణాలు కొనసాగుతున్నాయి. నిబంధనలు తుంగలో తొక్కుతూ అక్రమార్కులు కోట్లాది రూపాయల విలువైన స్థలాలను కబ్జా చేస్తున్నారు. హౌసింగ్ బోర్డు కేటాయించిన బ్లాక్‌లను కూల్చి కామన్ ఏరియా స్థలాలను కలుపుకొని ఎలాంటి అనుమతులు లేకుండా నిర్మాణాలు చేపడుతున్నారు. బ్లాక్ స్థలాల్లో ఇండ్ల నిర్మాణాలకు జీహెచ్‌ఎంసీ అధికారులు ఎలాంటి తనిఖీలు చేయకుండా అనుమతులు ఇస్తున్నారు.హౌసింగ్ బోర్డు బ్లాక్‌ల స్థానంలో కొత్త నిర్మాణాలను చేపడుతున్నారు. ఎన్‌వోసీ తీసుకోకున్న జీహెచ్‌ఎంసీ ఇష్టానుసారం అనుమతులు మంజూరు చేస్తున్నది. హౌసింగ్ బోర్డు స్థలాలను ఆక్రమించి, ఎన్‌వోసీ తీసుకోకుండా ఇండ్లు నిర్మిస్తున్నా అధికారులు చూసీ చూడనట్లు వ్యవహరిస్తున్నారనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. ఇదంతా అధికారులకు తెలిసే జరుగుతున్నదని స్థానికులు మండిపడుతున్నారు.సిటీ బ్యూరో, సెప్టెంబర్ 19 (నమస్తే తెలంగాణ) ఉమ్మడి ఏపీలో నాలుగైదు దశాబ్దాల క్రితం నగరంలో హౌసింగ్ బోర్డు జీ ప్లస్ వన్ తరహాలో బ్లాక్‌లను నిర్మించింది. ఒక్కో బ్లాక్‌లో నాలుగు ఇండ్లను నిర్మించి నాలుగు కుటుంబాలకు కేటాయించింది. ఆయా బ్లాక్‌లకు చుట్టూ 150 నుంచి 200 గజాల కామన్ ఏరియా ఉంటుంది. హౌసింగ్ బోర్డు నిబంధనల ప్రకారం ఆయా బ్లాక్‌లలోని గదులు మాత్రమే లబ్ధిదారులకు రిజిస్ట్రేషన్ అవుతాయి. చుట్టూ ఉన్న కామన్ ఏరియా హౌసింగ్ బోర్డు పరిధిలోనే ఉంటుంది. కానీ ప్రస్తుతం ఆ బ్లాక్‌లు శిథిలావస్థకు చేరుకున్నాయని వాటిని కూల్చి కొత్త నిర్మాణాలు చేపడుతున్నారు. చుట్టూ ఉన్న కామన్ ఏరియాను కూడా కలుపుకొని నిర్మిస్తున్నారు.హౌసింగ్ బోర్డు నిబంధనల ప్రకారం కామన్ ఏరియాలో నిర్మాణం చేపట్టాలంటే ప్రస్తుత మార్కెట్ ధర చెల్లించి కొనుగోలు చేయాల్సి ఉంటుంది. అలా కొనుగోలు చేసినట్లు హౌసింగ్ బోర్డు నుంచి ఎన్‌వోసీ ఉంటేనే జీహెచ్‌ఎంసీ అనుమతులు మంజూరు చేయాల్సి ఉంటుంది. కానీ అలాంటిదేమీ జరగకుండానే కామన్ ఏరియాను కబ్జా చేసి అక్రమ నిర్మాణాలు చేపడుతున్నారు. అటు జీహెచ్‌ఎంసీ అధికారులు, హౌసింగ్ బోర్డు అధికారులు మాత్రం వేడుక చూస్తున్నారు. ఇలా నగర వ్యాప్తంగా రూ.కోట్ల విలువైన హౌసింగ్ బోర్డు స్థలం అన్యాక్రాంతం అవుతున్నది. ముఖ్యంగా ఎస్‌ఆర్‌నగర్, బాగ్ లింగంపల్లిలో ఈ తరహా నిర్మాణాలు విచ్చలవిడిగా కొనసాగుతున్నాయి. ఎక్కడా హౌసింగ్ బోర్డు అధికారులు తనిఖీలు చేపట్టకపోవడంతో అక్రమార్కులు దర్జాగా కబ్జా చేస్తున్నారు. ఇప్పటికైనా ఉన్నతాధికారులు స్పందించి కబ్జాలకు అడ్డుకట్ట వేయాలని స్థానికులు కోరుతున్నారు.ఎస్‌ఆర్‌నగర్‌లో హౌసింగ్ బోర్డు కేటాయించిన బ్లాక్‌లను కూల్చి, కామన్ ఏరియాను కబ్జా చేసి నూతన నిర్మాణాలు విచ్చలవిడిగా వెలుస్తున్నాయి. బాపునగర్‌ను ఆనుకుని ఉన్న ఎస్‌ఆర్‌నగర్‌లో బీ4 బ్లాక్‌లు ఉన్నాయి. ఆ ప్రాంతంలో రెండేండ్ల కిందట హౌసింగ్ బోర్డు బ్లాక్‌ను కూల్చి దాదాపు 160 గజాల కామన్ ఏరియాను కబ్జా చేసి ఐదు అంతస్తుల భవనం నిర్మించారు. బహిరంగ మార్కెట్‌లో ఒక్కో గజం ధర రూ.1.5 లక్షల నుంచి రూ.2 లక్షల దాకా పలుకుతున్నది. 160 గజాలకు రూ.2 కోట్ల దాకా హౌసింగ్ బోర్డు స్థలాన్ని కలుపుకొన్నారు.దానికి జీహెచ్‌ఎంసీ 7-1-621, బీ4/ఎఫ్3 ఇంటి పేరుతో ఎలాంటి తనిఖీలు చేయకుండా అనుమతులు ఇచ్చింది. తాజాగా దాని పక్కనే మరో బ్లాక్ స్థానంలో ఇంకో నిర్మాణం ప్రారంభించారు. ఇప్పుడు అది పిల్లర్ల దశలో ఉంది. దీని యజమాని కూడా హౌసింగ్ బోర్డు పరిధిలోని 160 గజాల కామన్ ఏరియాను కబ్జా చేశారు. జీహెచ్‌ఎంసీ నుంచి అన్ని అనుమతులు తెచ్చుకున్నారు. ఇదంతా హౌసింగ్ బోర్డు అధికారులకు తెలిసే జరుగుతున్నట్లు, తమలాగా చాలా మంది నిర్మిస్తున్నట్లు యజమానులే బహిరంగంగా చెబుతున్నారు. కామన్ ఏరియాలో నిర్మాణం చేసేందుకు హౌసింగ్ బోర్డు నుంచి ఎలాంటి అనుమతులు తీసుకోలేదని అంటున్నారు. అధికారులు మొద్దు నిద్ర వీడకపోవడంతో మరిన్ని హౌసింగ్ బోర్డు స్థలాలు కబ్జాలకు గురవుతున్నాయి.

## బీటెక్ విద్యార్థిని బలవన్మరణం..

**హైదరాబాద్,సెప్టెంబర్-19:**
యాదాద్రి భువనగిరి జిల్లాలో షాకింగ్ ఘటన చోటుచేసుకుంది. పెళ్లయిన 18 రోజులకే బీటెక్ విద్యార్థిని ఆత్మహత్య చేసుకుంది. ఈ విషాద ఘటనతో యువతి తల్లిదండ్రులు కన్నీరుమున్నీరుగా విలపిస్తున్నారు. తమ కూతురు చావుకు అల్లుడే కారణమని పోలీసులకు ఫిర్యాదు చేశారు. మృతురాలి తల్లి ఇచ్చిన ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తును వేగవంతం చేశారు. ఇక పూర్తి వివరాల్లోకి వెళ్తే.. యాదాద్రి భువనగిరి జిల్లా మూటకొండూరు మండలం తాటపల్లి గ్రామానికి చెందిన ఏనుగు మధుసూదన్ రెడ్డి కుమార్తె పల్లవి(20) హైదరాబాద్ ఘట్ కేసర్ పీఎస్ పరిధిలోని కొమ్మూరి ప్రతాప్ రెడ్డి ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీలో బీటెక్ మూడో సంవత్సరం చదువుతోంది. అయితే ఈ ఏడాది ఆగస్టు 30వ తేదీన చైతన్యపురి పోలీస్ స్టేషన్ లో కానిస్టేబుల్ గా పని చేస్తున్న శ్రీకాంత్ రెడ్డి తో ఆమెకు వివాహం జరిగింది. అయితే పెళ్లి అయిన తర్వాత నుంచి పల్లవి కాలేజీకి వెళ్లలేదు. కానీ ఈ గురువారం నుంచి కాలేజీకి పల్లవి హాజరు అవతూ వచ్చింది. ఈ క్రమంలో శుక్రవారం విద్యార్థులు అంతా వెళ్లిపోయిన తర్వాత 3 వ అంతస్తుకు వెళ్లి అక్కడి నుంచి కిందకు దూకి ఆత్మహత్యకు పాల్పడింది పల్లవి. వెంటనే గుర్తించిన కాలేజీ సిబ్బంది యువతిని తొలుత జీడిమెట్లలోని నీలిమ ఆస్పత్రికి తరలించారు. అయితే పరిస్థితి విషమంగా ఉండటంతో అనంతరం మేడిపల్లిలోని శ్రీకర ఆస్పత్రికి షిఫ్ట్



చేశారు. అక్కడ చికిత్స పొందుతూ పల్లవి మృతి చెందింది. అయితే అదనపు కట్నం కోసం పల్లవికి భర్త శ్రీకాంత్ నుంచి శారీరకంగా, మానసికంగా వేధింపులు మొదలయ్యాయని అందువల్లే తన కుమార్తె ఆత్మహత్యకు పాల్పడిందని మృతురాలి తల్లి సంధ్య.. ఘట్ కేసర్ పోలీసులకు ఫిర్యాదు చేసింది. దీంతో కేసు నమోదు చేసిన పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు. ఇక ఈ ఘటన ప్రస్తుతం సామాజిక మాధ్యమాల్లో వైరల్ కావడంతో నెటిజన్లు పలు రకాలుగా కామెంట్స్ చేస్తున్నారు. చిన్న వయసులో పెళ్లి చేయడం వల్ల ఇలాంటి ఇబ్బందులే ఎదురవుతాయని అభిప్రాయపడుతున్నారు.

## వరంగల్ ఎయిర్ పోర్ట్‌కు ఆ పేరు పెట్టండి..

- సీఎం రేవంత్ కు దర్శకుడు సందీప్ రెడ్డి వంగా సూచన..

**హైదరాబాద్,సెప్టెంబర్-19:**
వరంగల్ మామునూరులో నూతనంగా ఏర్పాటవుతున్న ఎయిర్ పోర్టుకు ఏం పేరు పెట్టాలో సూచించాలని తాజాగా సీఎం రేవంత్‌రెడ్డి కోరిన సంగతి తెలిసిందే. ఈ మేరకు పత్రికల్లో వచ్చిన కథనాలను ఆయన తన అధికారిక ఎక్స్ ఖాతాలో పోస్టు చేశారు. గత బీఆర్ఎస్ ప్రభుత్వం పదేళ్లు అధికారంలో ఉండి వరంగల్ ప్రజల కలను నెరవేర్చడంలో విఫలమైంది. బీఆర్ఎస్ నేతలు ప్రజల గురించి పట్టించుకోలేదు. వారి సౌఖ్యాల కోసం ఫామ్ హౌజ్ లు కట్టుకున్నారు. కానీ ఇప్పుడు ప్రజాపాలనలో పేదల కల నెరవేరింది. తెలంగాణ ప్రభుత్వం భూ సేకరణ కోసం రూ. 295 కోట్లను కేటాయించింది. ఇప్పటికే అవసరమైన భూమిని స్వాధీనం చేసుకుని ఎయిర్ పోర్ట్స్ అథారిటీ ఆఫ్ ఇండియాకు అప్పగించాం.. ఇది కేవలం ఎయిర్ పోర్ట్ మాత్రమే కాదు.. ఇండస్ట్రీ, టూరిజం, ఎడ్యుకేషన్, జాబ్స్ అలాగే పెట్టుబడులకు గేట్ వే లాంటిది. మామునూరు అంతర్జాతీయ విమానాశ్రయం నుంచి ప్రయాణించేందుకు ఆసక్తిగా ఎదురుచూస్తున్నాను. ఈ మేరకు వరంగల్ ఎయిర్ పోర్టుకు ఓ పేరును సూచించండి అని సీఎం రేవంత్ రెడ్డి తన ట్వీట్ లో స్పష్టం చేశారు. అయితే సీఎం రేవంత్ రెడ్డి ట్వీట్ కు తాజాగా టాలీవుడ్ ప్రముఖ దర్శకుడు సందీప్ రెడ్డి వంగా పలు సూచనలు చేశారు. సందీప్ రెడ్డి వంగా సొంతూరు వరంగల్ కావడంతో తన సొంత ఊరికి ఎయిర్ పోర్టు రావడంపై ఆయన హర్షం వ్యక్తం చేశారు. వరంగల్‌లో ఇంటర్నేషనల్ ఎయిర్‌పోర్టు కల నిజం కాబోతుండటం చాలా సంతోషంగా ఉందని తెలిపారు. ఈ మేరకు తన అధికారిక ఎక్స్ ఖాతా వేదికగా స్పందించారు. ఈ ఎయిర్‌పోర్టుకు 'రుద్రమ ఇంటర్నేషనల్



ఎయిర్‌పోర్ట్' లేదా 'కాకతీయ ఇంటర్నేషనల్ ఎయిర్‌పోర్ట్' అనే పేర్లు పెట్టాలని సూచనలు చేశారు. వరంగల్ కు వేల సంవత్సరాల నుంచి ఉన్న గొప్ప చరిత్ర, కాకతీయుల సంస్కృతి, వారసత్వం గుర్తుండిపోయేలా ఎయిర్ పోర్టుకు పేరు ఉండాలంటూ ఎక్స్ లో తన అభిప్రాయాన్ని చెప్పుకొచ్చారు. ఇక వరంగల్ లో ఎయిర్ పోర్టు పనులకు సంబంధించిన ప్రాజెక్ట్ ను ముందుకు తీసుకెళ్లడంలో కీలకంగా వ్యవహరిస్తున్న తెలంగాణ సీఎం రేవంత్ రెడ్డికి.. సందీప్ రెడ్డి వంగా ధన్యవాదాలు తెలిపారు. దీంతో ఆయన పోస్టు ఇప్పుడు సామాజిక మాధ్యమాల్లో బాగా వైరల్ అవుతోంది. అయితే సందీప్ రెడ్డి వంగా పోస్టుకు సీఎం రేవంత్ రిప్లై ఇచ్చారు. దట్స్ ది స్పిరిట్ అంటూ సమాధానం ఇచ్చారు. దాంతో ఆయన సోషల్ మీడియాలో ఎంత యాక్టివ్ గా ఉంటారో అర్థం అవుతోంది. అలాగే ప్రభాస్ తో స్పిరిట్ అనే సినిమాను చేస్తున్నారు సందీప్ రెడ్డి వంగా.. ఈ క్రమంలో సీఎం రేవంత్ రెడ్డి తన ట్వీట్ లో స్పిరిట్ అనే పదాన్ని వాడటం ఆశ్చర్యకరం.

## సుప్రీంకోర్టును ఆశ్రయించిన దానం నాగేందర్



**హైదరాబాద్,సెప్టెంబర్-19:**
పార్టీ ఫిరాయింపు కేసులో తెలంగాణ హైకోర్టు ఇచ్చిన తీర్పును సవాల్ చేస్తూ ఖైరతాబాద్ ఎమ్మెల్యే దానం నాగేందర్ సుప్రీంకోర్టును ఆశ్రయించారు. ఈ మేరకు సుప్రీంకోర్టులో దానం నాగేందర్ పిటిషన్ దాఖలు చేశారు. దానం నాగేందర్ పై నిన్న హైకోర్టు అనర్హత వేటు వేసిన విషయం తెలిసిందే. 91 పేజీల తీర్పును వెల్లడించింది. అలాగే 2024 ఏప్రిల్ 23 నుంచే అనర్హత అమల్లోకి వచ్చినట్లు తన తీర్పులో హైకోర్టు పేర్కొంది. దాంతో హైకోర్టు తీర్పును సుప్రీంకోర్టులో సవాల్ చేశారు దానం నాగేందర్.ఇక ఈ పిటిషన్ ఎల్లుండి పరిశీలనకు వచ్చే అవకాశం ఉన్నట్లు సమాచారం. అయితే అంతకుముందు హైకోర్టు తీర్పుపై స్పందించిన దానం నాగేందర్ తీర్పును స్వాగతిస్తున్నానని.. ఖైరతాబాద్ ఉప ఎన్నిక వస్తే పోటీ చేసేందుకు సిద్ధంగా ఉన్నానని తెలిపారు. అంతేకాక ఈ తీర్పుపై సుప్రీంకోర్టుకు వెళ్లే ఆలోచన లేదని స్పష్టం చేశారు. ఎన్నికలు తనకు కొత్త కాదని.. ఉప ఎన్నిక ఎప్పుడొచ్చినా తాను రెడీ అని పేర్కొన్నారు. ఇక్కడి వరకూ తాను యుద్ధం చేసే వచ్చాని.. మరోసారి యుద్ధం కొత్తకాదని ఆయన స్పష్టం చేశారు. కానీ తాజాగా ఆయన సుప్రీంకోర్టును ఆశ్రయించడం రాజకీయంగా చర్చనీయాంశంగా మారింది. మరోవైపు దానం నాగేందర్ సుప్రీంకోర్టును ఆశ్రయించిన నేపథ్యంలో దీ=ూ ఇప్పటికే అప్రమత్తమైంది. తమ వాదనలు వినకుండా ఎలాంటి ఆదేశాలు ఇవ్వొద్దంటూ సుప్రీంకోర్టులో కేవియట్ పిటిషన్ ను దాఖలు చేసింది. గత అసెంబ్లీ ఎన్నికల్లో ఖైరతాబాద్ అసెంబ్లీ స్థానం నుంచి దీ=ూ అభ్యర్థిగా దానం నాగేందర్ గెలుపొందారు. అనంతరం కాంగ్రెస్ చేపట్టిన ఆపరేషన్ ఆకర్ష్ లో భాగంగా ఆ పార్టీలో చేరారు. ఈనేపథ్యంలో దానం నాగేందర్ పై దీ=ూ పార్టీ ఆగ్రహం వ్యక్తం చేసింది. ఈ నేపథ్యంలో ఎమ్మెల్యే పాడి కౌశిక్ రెడ్డి, బీజేపీ ఎమ్మెల్యే మహేశ్వర్ రెడ్డి వేర్వేరుగా తెలంగాణ హైకోర్టులో పిటిషన్ దాఖలు చేశారు. ఈ పిటిషన్లను విచారించిన హైకోర్టు ఈ మేరకు దానం నాగేందర్ పై అనర్హత వేటు వేసింది. హైకోర్టు నిర్ణయాన్ని బీఆర్ ఎస్, బీజేపీ నేతలు స్వాగతించారు.

## జన్వాడ ఫామ్‌హౌస్ కేటీఆర్‌ది కాదా..?

### కాంగ్రెస్ నేతల పరిశీలనలో తేలిందేంటి..!!



**హైదరాబాద్,సెప్టెంబర్-19:**
బీఆర్ఎస్ ముఖ్య నేతల భూములు.. నిర్మాణాల చుట్టూ రాజకీయం కొనసాగుతోంది. అసెంబ్లీ వేదిక గా సీఎం రేవంత్ కీలక అంశాలను బయట పెట్టారు. కేసీఆర్ ఫాం హౌస్ భూముల పైన విచారణకు ఆదేశించారు. ఇదే సమయంలో బీఆర్ఎస్ నుంచి స్ట్రాంగ్ కౌంటర్ కనిపిస్తోంది. కాగా.. కాంగ్రెస్ నేతలు జన్వాడ లోని ఫామ్ హౌస్ ను సందర్శించారు. కీలక అంశాలను వెల్లడించారు. ఫాం హౌస్ కేటీఆర్ ది కాదా అనే సందేహం వ్యక్తం అవుతోంది. నిబంధనలను ఉల్లంఘించి నిర్మాణం చేసారని నేతలు తేల్చారు. జన్వాడ ఫాంహౌస్‌పై కాంగ్రెస్ ఎంపీలు సంచలన వ్యాఖ్యలు చేశారు. రంగారెడ్డి జిల్లా శంకర్‌పల్లి మండలం జన్వాడలోని ఫామ్‌హౌస్ లక్ష్యంగా కాంగ్రెస్ ప్రజాప్రతినిధులు చేపట్టిన పర్యటన ఉత్కంఠకు దారితీసింది. ఇది బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ అక్రమ ఆస్తి అని, అసలు నిజాలు నిగ్గుతేలుస్తామని కాంగ్రెస్ పట్టుబడుతుండగా.. ఇది కేటీఆర్ ది కాదని, లీజు ప్రాపర్టీ మాత్రమేనంటూ అసలైన యజమాని తెరపైకి రావడం ఈ వివాదాన్ని సరికొత్త మలుపు తిప్పింది. ఫాంహౌస్ నిర్మాణానికి అనుమతులు లేవని, నాలాపై ఫాంహౌస్‌ను కట్టారంటూ కాంగ్రెస్ నేతలు ఆరోపించారు. కాంగ్రెస్ పార్టీ ఎంపీ, ఎమ్మెల్యేల బృందం జన్వాడ ఫాంహౌస్‌కు వెళ్లింది. ఫాంహౌస్ భూములను ప్రజాప్రతి నిధుల బృందం పరిశీలించింది. అయితే.. జన్వాడ ప్రాపర్టీ అసలు యజమానిని తానేనంటూ ప్రదీప్ రెడ్డి మీడియా ముందుకు వచ్చారు. ఆ స్థలానికి కేటీఆర్‌కు నేరుగా ఎలాంటి యాజమాన్య హక్కులు లేవని స్పష్టం చేశారు. జన్వాడలోని ఈ 4 ఎకరాల భూమి పూర్తిగా తన స్వార్జితమని వెల్లడించారు. 2019లో చట్టబద్ధమైన ప్రక్రియలు, రిజిస్ట్రేషన్ నిబంధనలన్నీ పూర్తి చేసి ఈ భూమిని కొనుగోలు చేశానని, దీనికి సంబంధించి నూటికి నూరు శాతం చట్టబద్ధమైన టైటిల్ పత్రాలు తన వద్ద ఉన్నాయని స్పష్టం చేశారు. కేటీఆర్ తనకు చిన్ననాటి స్నేహితుడు కావడంతో నిబంధనల ప్రకారమే లీజుకు మాత్రమే ఇచ్చానని, ఇక్కడ ఎలాంటి అక్రమాలు లేదా భూ ఆక్రమణలు జరగలేదని తేల్చిచెప్పారు.

## శంషాబాద్ వద్ద ఇన్నోవా ప్రమాదం

### నలుగురు దుర్మరణం

**హైదరాబాద్,సెప్టెంబర్-19:**
గణేష్ నిమజ్జన వేడుకలలో పాల్గొని ఎంతో సంతోషంగా ఇంటికి తిరిగి వస్తున్న ఒకే కుటుంబానికి చెందిన నలుగురు.. ఘోర రోడ్డు ప్రమాదంలో ప్రాణాలు కోల్పోయారు. ఒక్కరు తీవ్రంగా గాయపడ్డారు. రంగారెడ్డి జిల్లా శంషాబాద్ సమీపంలోని పాలమాకుల వద్ద జాతీయ రహదారి 44 పై ఈ విషాదకర ఘటన చోటు చేసుకుంది. గణనాథుడిని సాగనంపిన ఆనందంలో ఉన్న ఆ కుటుంబంలో ఈ ప్రమాదం ఊహించని శోకాన్ని నింపింది. మృతులందరూ మహబూబ్‌నగర్ జిల్లా నవాబ్‌పేట మండలానికి చెందిన మెట్టుగడ్డ తండా వాసులుగా గుర్తించారు. వీరంతా కూడా తమ స్వగ్రామంలో జరిగిన వినాయక నిమజ్జనం ఉత్సవాల్లో ఆనందంగా పాల్గొన్నారు. తిరిగి శంషాబాద్ వైపు ఇన్నోవాలో వెళ్తోండగా మార్గమధ్యలో ప్రమాదం సంభవించింది. పాలమాకుల సమీపంలో కారు అదుపు తప్పింది. బోల్తా కొట్టింది. ఈ ప్రమాద తీవ్రతకు కారు ముందు భాగం మొత్తం పూర్తిగా నుజ్జు నుజ్జు అయింది. ఈ ఘటనలో మరణించిన వారిని కేతావత్ లింబ్యా, ఆయన భార్య కేతావత్ జమున, కత్రావత్ మాన్‌సింగ్, కేతావత్ వాస్రామ్ గా పోలీసులు గుర్తించారు. ఈ ప్రమాదంలో కారు డ్రైవర్ సబావత్ అశోక్ తీవ్రంగా గాయపడ్డాడు. ప్రాణాపాయ స్థితిలో కొట్టుమిట్టాడుతున్నాడు. సమాచారం అందిన వెంటనే జాతీయ రహదారి పెట్రోలింగ్ సిబ్బంది, పోలీసులు హుటాహుటిన సంఘటన స్థలానికి చేరుకున్నారు. సహాయక చర్యలు చేపట్టారు. డ్రైవర్ అశోక్‌ను కారు నుంచి వెలికి తీయడానికి పోలీసులు శ్రమించాల్సి వచ్చింది. అనంతరం అత్యవసర చికిత్స నిమిత్తం శంషాబాద్ ఆసుపత్రికి తరలించారు. అతని పరిస్థితి విషమంగానే ఉందని తెలుస్తోంది. మృతదేహాలను కారులో నుంచి వెలికితీసి పోస్టుమార్టం నిమిత్తం సమీప ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. ఒకే కుటుంబానికి చెందిన నలుగురు వ్యక్తులు మరణించారనే విషయం తెలియడంతో మెట్టుగడ్డ తండాలో విషాదఛాయలు అలముకున్నాయి.

# రాజన్న దయతో ఆది శ్రీనివాస్‌కు మంత్రి పదవి ఇవ్వాలి

**-వెయ్యి రోజుల ప్రజా పాలనలో వేములవాడ అభివృద్ధికి రూ 1000 కోట్ల నిధులు..**
**-శ్రీ రాజరాజేశ్వరుని సన్నిధిలో మున్సిపల్ చైర్మన్ పుల్కం రాజు ప్రత్యేక పూజలు..**
**-వేములవాడ రాజన్న ఆలయంలో కోడె మొక్కు చెల్లించిన కాంగ్రెస్ శ్రేణులు..**
**-ఆది శ్రీనివాస్ నిండు నూరేళ్లు ఆయురారోగ్యాలతో వర్ధిల్లాలి: పుల్కం రాజు**
**-తెలంగాణ చౌక్‌లో ఘనంగా కేక్ కట్ చేసి సంబరాలు జరిపిన నాయకులు**



బలగం టీవీ, వేములవాడ:
వేములవాడ పట్టణ కాంగ్రెస్ కమిటీ ఆధ్వర్యంలో తెలంగాణ ప్రభుత్వ విప్, స్థానిక శాసనసభ్యులు ఆది శ్రీనివాస్ జన్మదిన వేడుకలను శుక్రవారం పట్టణ వ్యాప్తంగా కాంగ్రెస్ శ్రేణుల సంబరాల నడుమ నిర్వహించారు.

ఈ సందర్భంగా పురపాలక సంఘం చైర్మన్ పుల్కం రాజు, స్థానిక కౌన్సిలర్లు, కాంగ్రెస్ పార్టీ ముఖ్య నాయకులు, కార్యకర్తలతో కలిసి దక్షిణ కాశీగా ప్రసిద్ధి చెందిన ప్రముఖ పుణ్యక్షేత్రం శ్రీ భీమేశ్వర స్వామివారి దేవాలయానికి చేరుకుని, ఆలయంలో స్వామివారికి పవిత్రమైన కోడె మొక్కు చెల్లించుకుని, స్వామివారి సన్నిధిలో ప్రత్యేక పూజలు నిర్వహించి ఆది శ్రీనివాస్ పేరిట అర్చనలు జరిపించారు. ఆలయ దర్శనం పూర్తయిన అనంతరం భీమేశ్వరుని ప్రాంగణంలో భక్తులకు, స్థానిక నిరుపేదలకు, బాటసారులకు పెద్ద ఎత్తున పండ్ల పంపిణీ కార్యక్రమాన్ని చేపట్టారు.

ఈ సందర్భంగా మున్సిపల్ చైర్మన్ పుల్కం రాజు మాట్లాడుతూ... వేములవాడ నియోజకవర్గ ప్రజాప్రతినిధి, ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్‌కు పురపాలక వర్గం, కాంగ్రెస్ పార్టీ నాయకులు, పట్టణ ప్రజలందరి



తరపున హృదయపూర్వక జన్మదిన శుభాకాంక్షలు తెలియజేశారు. శ్రీ రాజరాజేశ్వర స్వామివారి దివ్య ఆశీస్సులతో ఆది శ్రీనివాస్ నిండు నూరేళ్లు ఆయురారోగ్యాలతో, సకల సుఖసంతోషాలతో వర్ధిల్లాలని ఆకాంక్షించారు. ప్రజా సేవలో నిరంతరం నిమగ్నమయ్యేందుకు, ప్రజల కష్టసుఖాల్లో తోడుగా ఉండేందుకు అవసరమైన పూర్తి శక్తి సామర్థ్యాలు, ధైర్యాన్ని ఆ భగవంతుడు ప్రసాదించాలని కోరారు. రాబోయే రోజుల్లో ఆది శ్రీనివాస్ మరిన్ని ఉన్నత పదవులను అధిరోహించి ప్రాంతీయంగా, రాష్ట్రస్థాయిలో గొప్ప నాయకుడిగా ఎదగాలని ఆశాభావం వ్యక్తం చేశారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నాయకత్వంలో, ఆది శ్రీనివాస్ దూరదృష్టి, ప్రత్యేక ఆలోచనా విధానంతో వేములవాడ ప్రాంతం రాబోయే కాలంలో అన్ని రంగాల్లో అగ్రగామిగా అభివృద్ధి చెందుతుందని ధీమా వ్యక్తం చేశారు.

కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత గడిచిన వెయ్యి రోజుల ప్రజా పాలనలో ప్రత్యేకంగా నిధులు తీసుకువచ్చి వేములవాడ నియోజకవర్గాన్ని అభివృద్ధి పథంలో ముందంజలో నిలిపారని పుల్కం రాజు కొనియాడారు. ఆది శ్రీనివాస్ ఆలోచనా సరళి, ప్రజా సంక్షేమ విధానాలు కేవలం వేములవాడకే పరిమితం కాకుండా, యావత్తు తెలంగాణ రాష్ట్రానికే ఒక దిశా నిర్దేశంలా నిలుస్తున్నాయని, ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నాయకత్వంలో ఆ విధానాలను రాష్ట్రవ్యాప్తంగా అవలంబిస్తున్నారని స్పష్టం చేశారు. ఎల్లవేళలా ప్రజల మధ్యనే ఉంటూ వారి సమస్యల పరిష్కారానికి నిరంతరం కృషి చేసే ఒక నిజమైన బహుజన నాయకుడి జన్మదిన వేడుకలను ఈ రీతిలో ఘనంగా జరుపుకోవడం ఎంతో సంతోషాన్ని ఇస్తోందన్నారు. ఆయన ప్రజా జీవితంలో ఎలాంటి విఘ్నాలు లేకుండా నిండు నూరేళ్లు ప్రశాంతంగా ముందడుగు వేయాలని ఆకాంక్షించారు.

అంతేకాకుండా, శ్రీ రాజరాజేశ్వర స్వామివారి దయాకటాక్షాలతో పాటు, కాంగ్రెస్ పార్టీ అధిష్ఠానం, ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఆది శ్రీనివాస్ సేవలను గుర్తించి ఆయనకు త్వరలోనే రాష్ట్ర మంత్రివర్గంలో చోటు కల్పించి, మంత్రి పదవిని కట్టబెట్టాలని పుల్కం రాజు కోరారు. బహుజన సామాజిక వర్గానికి చెందిన ఆది శ్రీనివాస్‌కు మంత్రి పదవి లభిస్తే వేములవాడ నియోజకవర్గంతో పాటుగా యావత్తు తెలంగాణ రాష్ట్ర ప్రజలందరికీ ఎంతో మేలు జరుగుతుందని అన్నారు. ఆయన నాయకత్వంలో రాష్ట్రం అన్ని రంగాల్లో, ముఖ్యంగా గ్రామీణ ప్రాంతాలు సంపూర్ణ అభివృద్ధి సాధిస్తాయని పేర్కొన్నారు. ఇప్పటికే నియోజకవర్గంలో విద్య, వైద్య రంగాలలో విప్లవాత్మకమైన మార్పులు తీసుకువచ్చారని, ప్రభుత్వ సంక్షేమ పథకాలు అర్హులైన ప్రతి ఒక్కరికీ అత్యంత పారదర్శకంగా, అవినీతికి తావులేకుండా అందేలా ఆది శ్రీనివాస్ నాయకత్వంలో అమలవుతున్నాయని చైర్మన్ తెలిపారు. నియోజకవర్గ ప్రజల తరఫున, కాంగ్రెస్ పార్టీ శ్రేణుల తరఫున అధిష్ఠానాన్ని వేడుకుంటున్నామని, ఆది శ్రీనివాస్‌కు తగిన గుర్తింపుగా మంత్రి పదవి ఇచ్చి గౌరవించాలని విజ్ఞప్తి చేశారు.

ఆలయంలో ప్రత్యేక పూజలు, పండ్ల పంపిణీ కార్యక్రమం ముగిసిన అనంతరం, నాయకులు, కార్యకర్తలు అందరూ కలిసి పట్టణంలోని తెలంగాణ చౌక్ వద్దకు చేరుకుని ప్రజాప్రతినిధులు, కౌన్సిలర్లు, కాంగ్రెస్ కార్యకర్తల మధ్య ఆది శ్రీనివాస్ జన్మదిన సందర్భంగా భారీ కేక్ కటింగ్ కార్యక్రమాన్ని నిర్వహించారు. అనంతరం ఒకరికొకరు కేక్ తినిపించుకుంటూ, మిఠాయిలు పంచుకుంటూ, జై కాంగ్రెస్.. జై ఆది శ్రీనివాస్ అంటూ పెద్ద ఎత్తున నినాదాలు చేస్తూ సంబరాలు జరుపుకున్నారు. ఈ కార్యక్రమంలో పట్టణ కాంగ్రెస్ నాయకులు, కౌన్సిలర్లు, ప్రజాప్రతినిధులు, కార్యకర్తలు పెద్ద ఎత్తున పాల్గొన్నారు

## అక్టోబర్ 4న ఐఆర్‌సీఎస్ మేనేజింగ్ కమిటీ ఎన్నికలు..

**- 24వ తేదీన నామినేషన్ల స్వీకరణ..**
**- జిల్లా ప్రెసిడెంట్, జిల్లా కలెక్టర్ గరిమ అగ్రవాల్**



బలగం టీవీ, రాజన్న సిరిసిల్ల:
అక్టోబర్ 4వ తేదీన ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటీ (ఐఆర్ సీ ఎస్) మేనేజింగ్ కమిటీ ఎన్నికలు రాజన్నసిరిసిల్ల జిల్లా కేంద్రంలోని జిల్లా సమాఖ్య భవనంలో నిర్వహించనున్నట్లు జిల్లా ప్రెసిడెంట్, జిల్లా కలెక్టర్ గరిమ అగ్రవాల్ తెలిపారు. మొత్తం 15 మంది సభ్యులను ఎన్నుకోవడం జరుగుతుందని పేర్కొన్నారు. ఐఆర్ సీఎస్ లో సభ్యత్వం ఉన్న వారు పోటీ చేసేందుకు అర్హులని స్పష్టం చేశారు.

ఈ నెల 24 వ తేదీన ఉదయం 10.00 గంటల నుంచి మధ్యాహ్నం 01.00 గంట వరకు నామినేషన్ల దాఖలు, 25వ తేదీన నామినేషన్ల పరిశీలన, 26వ తేదీన నామినేషన్ల ఉప సంహరణ ఉంటుందని, అదే రోజు పోటీలో ఉన్న అభ్యర్థుల జాబితా ప్రకటిస్తామని తెలిపారు. అక్టోబర్ 4వ తేదీన ఆదివారం ఉదయం 08.00 గంటల నుంచి రాజన్నసిరిసిల్ల జిల్లా కేంద్రంలోని జిల్లా సమాఖ్య భవనంలో ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటీ మేనేజింగ్ కమిటీ ఎన్నికలు నిర్వహించనున్నట్లు వెల్లడించారు. అదే రోజు 04.00 గంటలకు కౌంటింగ్, ఫలితాలను ప్రకటిస్తామని తెలిపారు. ఎన్నికల అధికారిగా జిల్లా ఆడిట్ అధికారి శ్రీనివాస్ వ్యవహరిస్తున్నారని జిల్లా కలెక్టర్ గరిమ అగ్రవాల్ పేర్కొన్నారు.

## చందుర్తి సింగిల్ విండో చైర్మన్‌గా గసికంటి ప్రభాకర్

**రైతుల సంక్షేమం, సొసైటీ అభివృద్ధికి కృషి చేస్తా: చైర్మన్ ప్రభాకర్**



బలగం టీవీ, చందుర్తి:
చందుర్తి సింగిల్ విండో కో-ఆపరేటివ్ సొసైటీ చైర్మన్‌గా ఎనగంటి గ్రామానికి చెందిన గసికంటి ప్రభాకర్ నియమితులయ్యారు. ఈ సందర్భంగా వేములవాడ ఎమ్మెల్యే, ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ ప్రభాకర్‌కు ప్రత్యేకంగా శుభాకాంక్షలు తెలిపారు. ప్రభాకర్ నియామకం పట్ల పలువురు నాయకులు, ప్రజాప్రతినిధులు, రైతులు, సహకార సంఘం సభ్యులు ఆయనను కలిసి పూలమాలలు వేసి అభినందించారు. తనపై నమ్మకంతో చైర్మన్ బాధ్యతలు అప్పగించిన ప్రజాప్రతినిధులు, నాయకులకు గసికంటి ప్రభాకర్ కృతజ్ఞతలు తెలిపారు.

ఈ సందర్భంగా ప్రభాకర్ మాట్లాడుతూ.. రైతుల సంక్షేమం, సహకార సంఘం అభివృద్ధే ప్రధాన లక్ష్యంగా పనిచేస్తానని అన్నారు. అందరి సహకారంతో సొసైటీని మరింత అభివృద్ధి పథంలో తీసుకెళ్లేందుకు కృషి చేస్తానని తెలిపారు. సింగిల్ విండో సొసైటీ ద్వారా రైతులకు అందాల్సిన సేవలను మరింత వేగవంతంగా, సమర్థవంతంగా అందించేందుకు చర్యలు తీసుకుంటానని స్పష్టం చేశారు.

## వేములవాడ సింగిల్ విండో చైర్మన్‌గా వకుళభరణం శ్రీనివాస్

**రైతుల సంక్షేమం, సొసైటీ అభివృద్ధియే ధ్యేయం: నూతన చైర్మన్**

బలగం టీవీ, వేములవాడ:
వేములవాడ సింగిల్ విండో కో-ఆపరేటివ్ సొసైటీ చైర్మన్‌గా నూకలమర్రి గ్రామానికి చెందిన కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకుడు వకుళభరణం శ్రీనివాస్ నియమితులయ్యారు. నూతన చైర్మన్‌గా బాధ్యతలు చేపడుతున్న ఆయనకు స్థానిక కాంగ్రెస్ పార్టీ ప్రజాప్రతినిధులు, నాయకులు, రైతులు మరియు సహకార సంఘం సభ్యులు శుభాకాంక్షలు తెలిపారు.

ఈ సందర్భంగా వకుళభరణం శ్రీనివాస్ మాట్లాడుతూ.. తనపై నమ్మకంతో ఈ బాధ్యతలు అప్పగించిన కాంగ్రెస్ పార్టీ అధిష్ఠానానికి, నాయకులకు మరియు సొసైటీ సభ్యులకు ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. రైతుల సంక్షేమమే ధ్యేయంగా, సొసైటీ అభివృద్ధికి అందరి సహకారంతో ముందుకు సాగుతానని స్పష్టం చేశారు. రైతులకు అవసరమైన రుణాలు, ఎరువులు, విత్తనాలు సకాలంలో అందేలా చర్యలు తీసుకుంటానని, సహకార సంఘం సేవలను మరింత వేగవంతం చేసి రైతులకు ఎల్లవేళలా అందుబాటులో ఉంటానని ఆయన వెల్లడించారు.

# కాటన్ చీరల కార్మికుల కూలి పెంచాలి..

**- సమస్య పరిష్కారం కాకపోతే సోమవారం కలెక్టరేట్ వద్ద నిరాహార దీక్ష: పవర్‌లూమ్ వర్కర్స్ యూనియన్**



బలగం టీవీ, సిరిసిల్ల:
కాటన్ చీరలు నడిపించే పవర్‌లూమ్ కార్మికుల కూలి పెంచాలని డిమాండ్ చేస్తూ కొనసాగుతున్న సమ్మె 19వ రోజుకు చేరుకుంది. కార్మికుల సమస్యను పరిష్కరించడంతో పాటు, చేనేత రిజర్వేషన్ చట్టాన్ని ఉల్లంఘిస్తూ పవర్‌లూమ్‌లపై చీరల ఉత్పత్తి చేస్తున్న యజమానులపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేస్తూ కార్మికులు రాజన్న సిరిసిల్ల జిల్లా ఎన్‌ఫోర్స్‌మెంట్ ఆఫీసర్ అనితకు వినతిపత్రం అందజేశారు.

ఈ సందర్భంగా పవర్‌లూమ్ వర్కర్స్ యూనియన్ రాష్ట్ర అధ్యక్షులు ముశం రమేష్ మాట్లాడుతూ.. చట్టానికి విరుద్ధంగా చీరల ఉత్పత్తి చేస్తూ కార్మికుల శ్రమతో యజమానులు అధిక లాభాలు ఆర్జిస్తున్నారని ఆరోపించారు. అయితే కార్మికులకు కూలి పెంచేందుకు యజమానులు నిరాకరిస్తూ మొండి వైఖరి అవలంబిస్తున్నారని అన్నారు.

గత 19 రోజులుగా కార్మికులు సమ్మె చేస్తున్నప్పటికీ, అధికారులు సమస్య పరిష్కారానికి తగిన చర్యలు తీసుకోవడం లేదని రమేష్ ఆవేదన వ్యక్తం చేశారు. సుమారు పది రోజుల క్రితం కలెక్టర్‌కు వినతిపత్రం అందజేయగా, సమస్యను పరిష్కరించాలని సంబంధిత అధికారులకు ఆదేశించినప్పటికీ ఇప్పటివరకు యజమానులపై చర్యలు తీసుకోలేదని తెలిపారు.

చట్టవిరుద్ధంగా చీరల ఉత్పత్తి చేస్తున్న యజమానులపై వెంటనే చర్యలు తీసుకుని, కార్మికుల కూలి పెంపు సమస్యను పరిష్కరించాలని డిమాండ్ చేశారు. రేపటి వరకు సమస్య పరిష్కారం కాకపోతే సోమవారం కలెక్టర్ కార్యాలయం వద్ద నిరాహార దీక్ష చేపడతామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో బూర మల్లేశం, వడ్నాల వీరేశం, నాగేష్, చిరంజీవి, గుండేటి కనకయ్య తదితర కార్మికులు పాల్గొన్నారు.

## జక్కుల చెరువులో వినాయక నిమజ్జన ఏర్పాట్ల పరిశీలన...




బలగం టీవీ, ఎల్లారెడ్డిపేట:
ఎల్లారెడ్డిపేట మండలం రాచర్ల బొప్పాపూర్ గ్రామంలోని జక్కుల చెరువులో వినాయక నిమజ్జనానికి చేపడుతున్న ఏర్పాట్లను సీఐ వెంకటేష్, ఎస్ఐ రమేష్ శనివారం పరిశీలించారు. గ్రామ సర్పంచ్ ఇల్లేందుల గీతాంజలి–శ్రీనివాస్ రెడ్డి, ఉపసర్పంచ్ కొండాపురం వెంకట్ రెడ్డితో కలిసి నిమజ్జన ప్రదేశాన్ని సందర్శించారు.

ఈ సందర్భంగా నిమజ్జన ప్రదేశంలో భక్తులకు, వినాయక విగ్రహాలను తీసుకువచ్చే వాహనాలకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా చేపడుతున్న ఏర్పాట్లను పరిశీలించారు. నిమజ్జన సమయంలో ట్రాఫిక్, భక్తుల రాకపోకలు, వాహనాల నిర్వహణ తదితర అంశాలపై అధికారులతో చర్చించారు.

ఈ సందర్భంగా సీఐ వెంకటేష్ మాట్లాడుతూ.. వినాయక నిమజ్జన కార్యక్రమం ప్రశాంతంగా, సురక్షితంగా జరిగేలా ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు చోటుచేసుకోకుండా అప్రమత్తంగా ఉండాలని, నిమజ్జనానికి వచ్చే భక్తులు, విగ్రహాల తరలింపు వాహనాలకు అవసరమైన సౌకర్యాలు కల్పించాలని సర్పంచ్, ఉపసర్పంచ్‌లకు సూచించారు. భక్తుల భద్రతకు ప్రాధాన్యతనిస్తూ నిమజ్జన కార్యక్రమాన్ని సజావుగా నిర్వహించేందుకు అవసరమైన అన్ని ఏర్పాట్లు చేస్తున్నట్లు సర్పంచ్, ఉపసర్పంచ్ తెలిపారు. ఈ కార్యక్రమంలో గ్రామ కార్యదర్శి సంతోష్, పోలీసు సిబ్బంది, గ్రామ పెద్దలు, సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# పేదల సొంతింటి కల సాకారమే ప్రభుత్వ లక్ష్యం..



- ఇందిరమ్మ ఇల్లు నిర్మాణ పనులకు భూమిపూజ చేసిన మున్సిపల్ చైర్మన్ పుల్కం రాజు..

బలగం టీవీ, వేములవాడ:
రాష్ట్ర ప్రభుత్వం అత్యంత ప్రతిష్ఠాత్మకంగా చేపట్టిన ఇందిరమ్మ ఇళ్ల పథకంలో భాగంగా వేములవాడ పట్టణంలో నిర్వహించిన భూమిపూజ కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ పుల్కం రాజు ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు.

ఈ సందర్భంగా ఇందిరమ్మ ఇల్లు నిర్మాణ పనులకు ఆయన శుక్రవారం భూమిపూజ చేసి పనులను ప్రారంభించారు. పేదల సొంతింటి కలను సాకారం చేసే దిశగా రాష్ట్ర ప్రభుత్వం వేగంగా అడుగులు వేస్తోందని ఈ సందర్భంగా ఆయన పేర్కొన్నారు. అనంతరం మున్సిపల్ చైర్మన్ పుల్కం రాజు మాట్లాడుతూ... అర్హులైన ప్రతి పేద కుటుంబానికి సొంతింటిని సమకూర్చాలనే ఉద్దేశంతోనే రాష్ట్ర ప్రభుత్వం ఇందిరమ్మ ఇళ్ల పథకాన్ని అందుబాటులోకి తీసుకువచ్చిందన్నారు. నిరుపేదలకు ఇల్లు అనేది కేవలం ఒక కలగానే మిగిలిపోకుండా, వారి సొంత స్థలంలో ఇల్లు నిర్మించి ఇవ్వాలనే ఆశయంతో ప్రభుత్వం ఈ నిర్ణయం తీసుకుందని తెలిపారు. ఇంటి నిర్మాణ పనులను పూర్తి నాణ్యతా ప్రమాణాలతో, వేగవంతంగా పూర్తి చేసుకునేలా లబ్ధిదారులకు అవసరమైన అన్ని రకాల సహాయ సహకారాలను అందిస్తామని స్పష్టం చేశారు. ప్రభుత్వం నుంచి మంజూరైన నిధులను నిబంధనలకు లోబడి లబ్ధిదారులు సరిగ్గా వినియోగించుకోవాలని సూచించారు. సంవత్సరాలుగా ఎదురుచూస్తున్న సొంతింటి కల ఇందిరమ్మ ఇళ్ల పథకం ద్వారా నెరవేరుతుండటంపై లబ్ధిదారులు హర్షం వ్యక్తం చేశారు. నిరుపేదల సంక్షేమానికి కృషి చేస్తున్న ప్రభుత్వానికి ధన్యవాదాలు తెలిపారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ అధికారులు, సిబ్బంది, ఇందిరమ్మ కమిటీ సభ్యులు, పట్టణ నాయకులు, ప్రజాప్రతినిధులు మరియు లబ్ధిదారులు తదితరులు ఉన్నారు.




## ఘనంగా ఆది శ్రీనివాస్ జన్మదిన వేడుకలు..

**- వృద్ధాశ్రమంలో కేక్ కట్ చేసి, వృద్ధులకు పండ్ల పంపిణీ..**

బలగం టీవీ, తంగళ్లపల్లి:
రాష్ట్ర ప్రభుత్వ విప్, వేములవాడ ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్ జన్మదిన వేడుకలను ఇందిరమ్మ కాలనీ సర్పంచ్ గడ్డం రచన చోటు ఆధ్వర్యంలో కాంగ్రెస్ నాయకులు ఘనంగా నిర్వహించారు. తంగళ్లపల్లి మండలం మండేపల్లి ప్రభుత్వ వయోవృద్ధుల ఆశ్రమంలో వృద్ధుల సమక్షంలో కేక్ కట్ చేసి జన్మదిన వేడుకలు నిర్వహించారు.

అనంతరం వృద్ధాశ్రమంలోని వృద్ధులకు పండ్లు పంపిణీ చేశారు. ప్రజల కోసం నిరంతరం పనిచేస్తున్న నాయకుడి జన్మదిన వేడుకలను కేవలం హంగూ ఆర్భాటాలకు పరిమితం చేయకుండా, వృద్ధుల మధ్య సేవా కార్యక్రమాలతో నిర్వహించడం సంతోషంగా ఉందని కాంగ్రెస్ నాయకులు తెలిపారు. ఆది శ్రీనివాస్ మరిన్ని జన్మదిన వేడుకలు జరుపుకుంటూ ప్రజలకు మరింత సేవ చేయాలని వారు ఆకాంక్షించారు. ప్రజా సేవలో ఆయన మరింత ముందుకు సాగాలని కోరుకున్నారు. ఈ కార్యక్రమంలో తంగళ్లపల్లి మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు మునిగిల రాజు, SIR కార్యక్రమ జిల్లా కో-ఆర్డినేటర్ జలగం ప్రవీణ్, పసుల వెంకన్న, బండి పరశురాములు, ఎగుర్ల ప్రశాంత్, గుగ్గిళ్ల భరత్, ఎడ్ల తిరుపతి, గట్టు లింగారెడ్డి, ఇందిరమ్మ కాలనీ గ్రామ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు కొంపెల్లి శ్యామ్, గ్రామ ఉప సర్పంచ్ కొండ శ్రీకాంత్, వార్డు సభ్యులు ఒడ్డెపెల్లి రమ, మందాటి శారద, కొండ భరత్, కాంగ్రెస్ పార్టీ నాయకులు బల్ల లక్ష్మీపతి, మాటేటి రాజు, భోగ రంగయ్య, గాలి వీరేశం, బండారి కిషన్ తదితరులు పాల్గొన్నారు.

## సొంత వ్యాపారంతోనే స్వయం సమృద్ధి సాధ్యం

**సర్పంచ్ కొండ రమేష్ గౌడ్...**

బలగం టీవీ, ఎల్లారెడ్డిపేట:
ఉద్యోగ అవకాశాల కోసం ఎదురుచూస్తూ కాలాన్ని వృథా చేయకుండా యువత స్వయం ఉపాధి మార్గాలను ఎంచుకుని సొంత కాళ్లపై నిలదొక్కుకోవాలని రాచర్ల గొల్లపల్లి గ్రామ సర్పంచ్ కొండ రమేష్ గౌడ్ పిలుపునిచ్చారు. రాజన్న సిరిసిల్ల జిల్లా ఎల్లారెడ్డిపేట మండలం రాచర్ల గొల్లపల్లి గ్రామంలో నూతనంగా ఏర్పాటు చేసిన 'సెల్ పాయింట్' ను స్థానిక ప్రజాప్రతినిధులతో కలిసి సర్పంచ్ కొండ రమేష్ గౌడ్ ఘనంగా ప్రారంభించారు.

ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఉద్యోగం రాలేదని యువత నిరాశ చెందాల్సిన అవసరం లేదన్నారు. కష్టపడే మనస్తత్వం, పట్టుదల, స్వయంకృషితో సొంతంగా వ్యాపారం ప్రారంభిస్తే స్వయం ఉపాధి రంగంలో మంచి ప్రగతి సాధించవచ్చని పేర్కొన్నారు. గ్రామీణ ప్రాంత ప్రజలకు అవసరమైన సెల్‌ఫోన్ సంబంధిత సేవలు అందుబాటులోకి తీసుకురావాలనే ఉద్దేశంతో సెల్ పాయింట్ ఏర్పాటు చేయడం అభినందనీయమన్నారు. అనంతరం సెల్ పాయింట్ నిర్వాహకుడు సయ్యద్ ఫారూక్ను ప్రజాప్రతినిధులు అభినందించి, నూతన వ్యాపారంలో విజయవంతంగా రాణించి ఉన్నత స్థాయికి ఎదగాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో స్థానిక ప్రజాప్రతినిధులు, గ్రామ పెద్దలు, యువకులు, సయ్యద్ ఫారూక్ కుటుంబ సభ్యులు, మిత్రులు తదితరులు పాల్గొన్నారు.





## ముదిరాజ్ సంఘం మండల అధ్యక్షుడికి ఘన సన్మానం..

బలగం టీవీ, ఎల్లారెడ్డిపేట:
ఎల్లారెడ్డిపేట మండల ముదిరాజ్ సంక్షేమ సంఘం అధ్యక్షుడిగా ఎన్నికైన దుమాల గ్రామానికి చెందిన పెరుమాండ్ల ఆంజనేయులును రాజన్న సిరిసిల్ల జిల్లా సర్పంచుల సంఘం జేఏసీ అధ్యక్షులు, తిమ్మాపూర్ సర్పంచ్ అందె సుభాష్ శుక్రవారం ఘనంగా సన్మానించారు.

ఈ సందర్భంగా ఆంజనేయులును శాలువాతో సత్కరించి, పుష్పగుచ్ఛం అందజేసి శుభాకాంక్షలు తెలిపారు. ముదిరాజ్ సంఘం అభివృద్ధితో పాటు సంఘం సభ్యుల సంక్షేమానికి కృషి చేయాలని ఆకాంక్షించారు. మండల అధ్యక్షుడిగా ఆంజనేయులు ఎన్నిక కావడం పట్ల పలువురు నాయకులు, సంఘం సభ్యులు హర్షం వ్యక్తం చేస్తూ అభినందనలు తెలిపారు. కార్యక్రమంలో గుండ్ల రాజయ్య, చెక్కల సత్తయ్య, కాసుల రామస్వామితో పాటు పలువురు నాయకులు, ముదిరాజ్ సంఘం సభ్యులు పాల్గొన్నారు.

# కాలువలకు నీళ్లు వదలండి..

## గణేశ్ నిమజ్జనాలను ప్రశాంతంగా నిర్వహించండి..



**-రేవంత్–కేటీఆర్ దోస్తీ.. భూదోపిడీపై డ్రామాలు..**
**-లక్ష కోట్ల భూదోపిడీకి ఆధారాలుంటే బయటపెట్టండి..**
**- కేంద్ర మంత్రి బండి సంజయ్**

బలగం టీవీ, రాజన్న సిరిసిల్ల:

గణేశ్ నిమజ్జనోత్సవాలు ప్రశాంతంగా, భక్తిశ్రద్ధలతో జరిగేలా రాష్ట్ర ప్రభుత్వం తక్షణ చర్యలు చేపట్టాలని కేంద్ర మంత్రి బండి సంజయ్‌కుమార్ డిమాండ్ చేశారు. సిరిసిల్ల పట్టణంలో కేంద్ర మంత్రి బండి సంజయ్ శనివారం పర్యటించారు. పలు గణేష్ మండపాలను సందర్శించి ప్రత్యేక పూజలు చేశారు.బీజేపీ కార్యకర్త శ్రీశైలం కొన్న కొత్త ఆటోను బండి సంజయ్ స్వయంగా నడిపి ప్రారంభించారు. అనంతరం ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో బండి సంజయ్ మాట్లాడుతూ..

రాష్ట్రవ్యాప్తంగా నిమజ్జనాలకు ఉపయోగించే కాలువలు, చెరువులు ఎండిపోయాయని, ముఖ్యంగా ఎస్సారెస్పీ పరిధిలోని కాలువల్లో నీళ్లు లేకపోవడం ఆందోళన కలిగిస్తోందన్నారు.ఈ విషయాన్ని ఇప్పటికే రాష్ట్ర ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లినట్లు తెలిపారు. సీఎం రేవంత్‌రెడ్డి వెంటనే జోక్యం చేసుకుని కాలువలకు నీటిని విడుదల చేయాలని, పరిస్థితి చేయి దాటకముందే నిమజ్జనోత్సవాలపై సీఎం స్థాయిలో సమీక్ష నిర్వహించి, అవసరమైన ఏర్పాట్లు చేయాలని సూచించారు.కాలువలకు నీళ్లు విడుదల చేయకపోతే వినాయక విగ్రహాలను రోడ్లపై ఉంచాల్సిన పరిస్థితి ఏర్పడే అవకాశం ఉందని, దీనివల్ల శాంతిభద్రతల సమస్యలు తలెత్తే ప్రమాదం ఉందని హెచ్చరించారు. హిందూ పండుగలను చులకనగా చూస్తే ఊరుకునేది లేదని, నిమజ్జనోత్సవాలను రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా తీసుకుని అన్ని శాఖలను సమన్వయం చేసి భక్తులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా చూడాలని కోరారు.మహారాష్ట్ర తర్వాత తెలంగాణలోనే గణేశ్ నిమజ్జనోత్సవాలు పెద్ద ఎత్తున జరుగుతున్నాయని అన్నారు. చిన్నాపెద్దా తేడా లేకుండా భక్తియుత వాతావరణంలో ఉత్సవాల్లో పాల్గొనాలని, తప్పుడు ప్రచారాలను నమ్మకుండా అధికారులకు సహకరించాలని ప్రజలకు పిలుపునిచ్చారు. నిమజ్జనోత్సవాల సందర్భంగా ఎలాంటి అవాంఛనీయ ఘటనలు చోటుచేసుకోకుండా ప్రభుత్వం ముందస్తు చర్యలు చేపట్టాలని కోరారు.

కాంగ్రెస్ –బీఆర్ఎస్ మధ్య లోపాయికారీ ఒప్పందం బీఆర్ఎస్ హయాంలో లక్ష కోట్ల రూపాయల భూదోపిడీ జరిగిందని చెబుతున్న ప్రభుత్వం.. అందుకు సంబంధించిన పూర్తి ఆధారాలను బయటపెట్టాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వం వద్ద ఆధారాలు ఉన్నప్పుడు చర్యలు తీసుకోవడానికి ఎందుకు ఆలస్యం చేస్తున్నారని ప్రశ్నించారు. భూకబ్జాలపై చర్యలు తీసుకోవడంలో ప్రభుత్వం జాప్యం చేస్తోందని బండి సంజయ్ గతంలోనూ ప్రశ్నించారు.సీఎం స్థాయి వ్యక్తి తలుచుకుంటే మూడు గంటల్లోనే అన్ని ఆధారాలను బయటపెట్టవచ్చని, కానీ కాంగ్రెస్, బీఆర్ఎస్ మధ్య లోపాయికారీ ఒప్పందం ఉందని ఆరోపించారు. రేవంత్‌రెడ్డి, కేటీఆర్ దోస్తులేనని, అందుకే భూదోపిడీ అంశాన్ని రాజకీయ టైంపాస్‌గా మార్చారని,ఏఐసీసీకి ఈఎంఐలు చెల్లించేందుకు భూదోపిడీ అంశాన్ని అడ్డుపెట్టుకుని బేరసారాలు చేస్తున్నారని ఆరోపించారు. ఈ వ్యాఖ్యల తరహాలోనే భూదోపిడీ అంశంపై బండి సంజయ్ ఇటీవల కూడా కాంగ్రెస్ ప్రభుత్వాన్ని ప్రశ్నించారు.

**సిరిసిల్లలో 8 వేల ఎకరాల కబ్జాకు ఆధారాలున్నాయా..?**

సిరిసిల్లలో 8 వేల ఎకరాలను బీఆర్ఎస్ కబ్జా చేసిందని చెబుతున్నారని, దానికి సంబంధించిన ఆధారాలను బయటపెట్టాలని డిమాండ్ చేశారు. ఆధారాలు చూపిస్తే ఆ భూములను తామే రక్షిస్తామని, అవసరమైతే పేదలకు పంచాలని అన్నారు. ప్రజల దృష్టిని మళ్లించేందుకే కాంగ్రెస్, బీఆర్ఎస్ చిల్లర రాజకీయాలు చేస్తున్నాయనిఅన్నారు .బీఆర్ఎస్ నేతలపై భూకబ్జా ఆరోపణలకు ఆధారాలు ఉంటే వాటిపై చర్యలు తీసుకోవాలని, లేకపోతే ఆరోపణలు చేసినవారు ప్రజలకు వివరణ ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఇటీవల బీఆర్ఎస్ హయాంలో భూకబ్జాలపై విచారణకు సిట్టింగ్ జడ్జితో కమిషన్ ఏర్పాటు చేయాలని కూడా డిమాండ్ చేశారు.

**6 గ్యారంటీలపై చర్చ లేకుండా అసెంబ్లీలో రాజకీయ డ్రామాలు**

రాష్ట్రంలో ఆరు గ్యారంటీలు, తెలంగాణ అభివృద్ధి, ప్రజా సమస్యలపై చర్చ జరగాల్సిన సమయంలో అసెంబ్లీలో రాజకీయ డ్రామాలు నడుస్తున్నాయని,సిరిసిల్లలో కాంగ్రెస్ పార్టీ పరిస్థితి ఏమిటని,కాంగ్రెస్‌పై ప్రజల్లో వ్యతిరేకత వచ్చిందని అన్నారు.



## తిరుమల కొండ పై అనంతారం చిన్నారి కళా ప్రదర్శన

బలగం టీవీ, ఇల్లంతకుంట




ఇల్లంతకుంట మండలంలోని అనంతారం గ్రామానికి చెందిన మూల ఆరాధ్య తిరుమల కొండ పై తన నృత్య కళ ప్రదర్శన తో చూపరులను ఆకట్టుకుంది.తిరుమల తిరుపతి బ్రాహ్మోత్సవాలలో భాగంగా రెండో రోజు స్వామి వారు సింహవాహనం పై మారవిధుల్లో ఊరేగుతున్న సమయం లో తిరుపతి సంగీత కళా నృత్య కళాశాల ఆధ్వర్యంలో నిర్వహించిన ప్రదర్శన లో సిద్దిపేట జిల్లా కు చెందిన హిమగిరి అకాడమీ తరుపున 23 మంది చిన్నారులు పాల్గొని భక్తులను సాంప్రదాయ నృత్యం తో ఆకట్టుకున్నారు.తిరుమల కొండ పై తమ కూతురు నృత్య ప్రదర్శన పట్ల ఆరాధ్య తల్లిదండ్రులు ఆనందం వ్యక్తం చేశారు.నృత్య ప్రదర్శన లో ప్రతిభ చాటుతున్న తమ గ్రామ చిన్నారి మరింత ప్రతిభ చూపి గొప్ప స్థాయి కి ఎదగాలని గ్రామస్తులు ఆకాంక్షిస్తూన్నారు. నృత్య ప్రదర్శన గావించిన కళాకారులకు టీ టీడి తరుపున స్వామి వారి తీర్థ ప్రసాదాలు అందజేసి శాలువా లతో సత్కరించారు



## సాయి చరణ్ మృతికి బీఆర్ఎస్ నాయకుల సంతాపం..

బలగం టీవీ, వేములవాడ:

చీర్లవంచ (R&R కాలనీ) గ్రామ మాజీ ఉప సర్పంచ్ సంధనాల శ్రీనివాస్ కుమారుడు సంధనాల సాయి చరణ్ (23) ఆత్మహత్య చేసుకుని మృతి చెందడంతో గ్రామంలో విషాదఛాయలు అలుముకున్నాయి. సాయి చరణ్ భౌతిక కాయాన్ని బీఆర్ఎస్ సీనియర్ నాయకులు ఏనుగు మనోహర్ రెడ్డి, సెస్ డైరెక్టర్ హరిచరణ్ రావు, మాజీ జడ్పీటీసీ మ్యాకల రవి, మాజీ ఎంపీపీ బూర వజ్రమ్మ-బాబు తదితరులు సందర్శించి నివాళులర్పించారు. అనంతరం కుటుంబ సభ్యులను పరామర్శించి, వారి కుటుంబానికి ప్రగాఢ సానుభూతి తెలిపారు. ఈ కార్యక్రమంలో సర్పంచులు ముత్త సంజన-మహేష్, ఊరడి సునీత-రాజిరెడ్డి, మాజీ సర్పంచులు రంగు సత్తవ్వ-రాములు, కొండపల్లి వెంకటరమణ, అలాగే వెంకటేష్, భాస్కర్ గౌడ్, నడిగోట్ల హరికృష్ణ, శ్రీనివాస్ గౌడ్, బాలరాజు, శ్రీకాంత్ తదితరులు, గ్రామ ప్రజలు పాల్గొని సాయి చరణ్‌కు నివాళులర్పించారు.



## బాలల రక్షణకు ప్రతి ఒక్కరూ బాధ్యతగా వ్యవహరించాలి..
### - పోక్సో చట్టంపై అవగాహన అవసరం..

బలగం టీవీ, రాజన్న సిరిసిల్ల:

బాలలపై లైంగిక నేరాలను అరికట్టడం, బాలల హక్కులను పరిరక్షించడంపై సమాజంలోని ప్రతి ఒక్కరికీ అవగాహన కలిగి ఉండటం ఎంతో అవసరమని లోక్ అదాలత్ సభ్యులు/న్యాయవాది ఆడెపు వేణు అన్నారు. శుక్రవారం తంగళ్ళపల్లి మండల కేంద్రంలోని శ్రీ సరస్వతి ఇంగ్లీష్ మీడియం ఉన్నత పాఠశాలలో జిల్లా న్యాయ సేవాధికర సంస్థ అధ్యక్షురాలు, జిల్లా ప్రధాన న్యాయమూర్తి పి.నీరజ ఆదేశాలతో సీనియర్ సివిల్ జడ్జి/కార్యదర్శి, DLSA పి.లక్ష్మణాచారి సమన్వయంతో న్యాయ విజ్ఞాన సదస్సును నిర్వహించడం జరిగింది.

ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. పిల్లలకు సురక్షితమైన వాతావరణాన్ని కల్పించడం కోసం లైంగిక నేరాల నుంచి బాలల రక్షణ చట్టం–2012 (Protection of Children from Sexual Offences Act – POCSO) ను ప్రవేశ పెట్టడం జరిగిందని తెలిపారు. ఈ కార్యక్రమంలో లోక్ అదాలత్ సభ్యులు చింతోజు భాస్కర్, పాఠశాల కరెస్పాండెంట్ శ్రీనివాస్, న్యాయవాదులు కుంట శ్రీనివాస్, గుర్రం ఆంజనేయులు, అరుణ, ఉపాధ్యాయులు మరియు విద్యార్థులు పాల్గొన్నారు.

# స్వచ్ఛత హి సేవా పోస్టర్ ఆవిష్కరణ..




**- వినాయక నవరాత్రుల్లో ప్లాస్టిక్‌కు దూరంగా ఉండాలి..**
**మున్సిపల్ చైర్‌పర్సన్ జిందం కళా చక్రపాణి,**

బలగం టీవీ, సిరిసిల్ల:

స్వచ్ఛత హి సేవ కార్యక్రమంలో భాగంగా శనివారం సిరిసిల్ల మున్సిపల్ కార్యాలయంలో స్వచ్ఛత హి సేవ పోస్టర్‌ను ఆవిష్కరించారు. మున్సిపల్ చైర్‌పర్సన్ జిందం కళా చక్రపాణి, వైస్ చైర్మన్ దార్ల సందీప్, మున్సిపల్ కమిషనర్ ఖదీర్ పాషా, కౌన్సిల్ సభ్యులు, కో-ఆప్షన్ సభ్యుల ఆధ్వర్యంలో పోస్టర్ ఆవిష్కరణ కార్యక్రమం నిర్వహించారు.

ఈ సందర్భంగా పట్టణంలో స్వచ్ఛతపై ప్రజల్లో అవగాహన కల్పించేందుకు చేపట్టాల్సిన కార్యక్రమాలపై చర్చించారు. అనంతరం మున్సిపల్ చైర్‌పర్సన్ జిందం కళా చక్రపాణి, కమిషనర్ ఖదీర్ పాషా మాట్లాడుతూ.. వినాయక నవరాత్రుల సందర్భంగా వినాయక మండపాల్లో ప్లాస్టిక్ పువ్వులు, కవర్లు, ఇతర ప్లాస్టిక్ వస్తువులను వినియోగించవద్దని ప్రజలకు విజ్ఞప్తి చేశారు. పర్యావరణ పరిరక్షణతో పాటు పట్టణ పరిశుభ్రతను కాపాడేందుకు ప్రతి ఒక్కరూ సహకరించాలని కోరారు. వినాయక విగ్రహాల నిమజ్జనం సమయంలో ప్లాస్టిక్ పువ్వులు, కవర్లు, ఇతర ప్లాస్టిక్ వస్తువులను నీటిలో వేయకూడదని సూచించారు. నిమజ్జనం అనంతరం ప్లాస్టిక్ వ్యర్థాలను వేరు చేసి మున్సిపల్ సిబ్బందికి అందించాలని తెలిపారు.



# రష్యా ఇంధనం కొనుగోలు చేసే దేశాలపై అమెరికా కొరడా

**100 శాతం వరకు సుంకాలు విధించే అధికారం ట్రంప్‌కు..**
**ఇరాన్‌పైనా ఆంక్షలు పొడిగింపు**

బలగం టీవీ, వాషింగ్టన్



రష్యా నుంచి ముడిచమురు, సహజవాయువు కొనుగోలు చేసే దేశాలపై ఒత్తిడి పెంచేందుకు అమెరికా కీలక చట్టాన్ని అమల్లోకి తీసుకురానుంది. 'లిండ్సే ఓ. గ్రాహం శాంక్షనింగ్ రష్యా అండ్ ఇరాన్ యాక్ట్–2026'పై అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ శుక్రవారం సంతకం చేయడంతో బిల్లు చట్టంగా మారింది. చట్టం ప్రకారం నిర్దిష్ట పరిస్థితులు, ప్రమాణాలు నెరవేరితే రష్యా ఇంధనాన్ని భారీగా దిగుమతి చేసుకునే దేశాల నుంచి వచ్చే వస్తువులపై 100 శాతం వరకు సుంకాలు విధించే అధికారం అధ్యక్షుడికి లభించింది. అయితే చట్టం అమల్లోకి వచ్చిన వెంటనే ఏ దేశంపైనా 100 శాతం సుంకం ఆటోమేటిక్‌గా విధించరు. ఎప్పుడు, ఏ దేశంపై, ఎంత మేర సుంకం విధించాలన్నది అధ్యక్షుడి నిర్ణయంపై ఆధారపడి ఉంటుంది.

చట్టం 30 రోజుల్లోగా అమల్లోకి వచ్చే అవకాశం ఉంది. రష్యా నాయకత్వం, ఇంధన రంగం, రక్షణ పరిశ్రమలు, వాణిజ్య నౌకల కార్యకలాపాలకు సహకరించే సంస్థలు, వ్యక్తులపై ఆంక్షలు విధించేందుకు కూడా ఇది అవకాశం కల్పిస్తోంది. రష్యా చమురును అంతర్జాతీయ మార్కెట్లకు తరలించేందుకు ఉపయోగిస్తున్నట్లు అమెరికా ఆరోపిస్తున్న 'షాడో ఫ్లీట్' నౌకలు, ఆర్థిక సంస్థలు, బ్యాంకులు, రక్షణ రంగ నెట్‌వర్క్‌లపైనా ఆంక్షలు విధించవచ్చు. రష్యా ఇంధన ఆదాయాన్ని తగ్గించి ఉక్రెయిన్ యుద్ధానికి అందుతున్న ఆర్థిక వనరులపై ఒత్తిడి తీసుకురావడం అమెరికా చర్యల లక్ష్యంగా పేర్కొంటోంది.

భారత్, చైనాపై ప్రభావం?

రష్యా ముడిచమురు కొనుగోలు చేసే ప్రధాన దేశాల్లో భారత్, చైనా ఉన్నాయి. దీంతో కొత్త చట్టంలోని సుంకాల నిబంధనలపై రెండు దేశాల్లోనూ ఆసక్తి నెలకొంది. అయితే భారత్‌పై 100 శాతం సుంకం విధించినట్లు ప్రస్తుతానికి భావించాల్సిన అవసరం లేదు. చట్టం ట్రంప్‌కు ఆ అధికారం మాత్రమే కల్పించింది. దాన్ని ఎప్పుడు, ఏ దేశంపై, ఏ స్థాయిలో వినియోగించాలన్నది తదుపరి నిర్ణయాలపై ఆధారపడి ఉంటుంది.

ఇరాన్‌పైనా ఆంక్షలు

రష్యాతోపాటు ఇరాన్‌పై కూడా అమెరికా ఆంక్షల వ్యవస్థను కొనసాగించేలా చట్టంలో నిబంధనలు ఉన్నాయి. ఇరాన్ శాంక్షన్స్ యాక్ట్‌ను మరో ఐదేళ్లపాటు పొడిగించారు. దీంతో ఇరాన్ ఇంధన, ఆయుధ రంగాలపై అమెరికా ఆంక్షలు కొనసాగనున్నాయి.

భారీ మెజారిటీతో ఆమోదం

ఈ చట్టానికి అమెరికా కాంగ్రెస్‌లో భారీ మద్దతు లభించింది. సెనెట్‌లో ఆగస్టులో 86–11 ఓట్లతో, ప్రతినిధుల సభలో 262–159 ఓట్లతో బిల్లు ఆమోదం పొందింది. ట్రంప్ సంతకంతో అది చట్టంగా మారింది. దివంగత రిపబ్లికన్ సెనేటర్ లిండ్సే గ్రాహం పేరును ఈ చట్టానికి పెట్టారు. రష్యాపై కఠిన ఆంక్షలకు ఆయన దీర్ఘకాలంగా మద్దతు ఇచ్చారు.

# హెచ్-1బీ వీసాలపై ట్రంప్ సర్కార్ నిఘా

**అమెరికా ఉద్యోగులను తొలగించి విదేశీ సిబ్బందిని నియమించే సంస్థలపై ప్రత్యేక దృష్టి**

బలగం టీవీ, వాషింగ్టన్

హెచ్-1బీ వీసాల దుర్వినియోగాన్ని అరికట్టేందుకు ట్రంప్ ప్రభుత్వం చర్యలు ప్రారంభించింది. అమెరికా ఉద్యోగులను తొలగించి అదే సమయంలో హెచ్-1బీ వీసాల ద్వారా విదేశీ సిబ్బందిని నియమించుకునే సంస్థలపై నిఘా పెంచాలని నిర్ణయించింది. ఇందుకోసం విదేశాంగ, కార్మిక, హోంల్యాండ్ సెక్యూరిటీ శాఖలకు కొత్త మార్గదర్శకాలు జారీ చేస్తూ అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ ఎగ్జిక్యూటివ్ ఆర్డర్‌పై సంతకం చేశారు. అలాగే కొన్ని హెచ్-1బీ వీసా దరఖాస్తులకు విధించిన లక్ష డాలర్ల అదనపు ఫీజును మరో ఏడాది పొడిగించారు.

ఎగ్జిక్యూటివ్ ఆర్డర్ ప్రకారం హెచ్-1బీ వీసా కోసం దరఖాస్తు చేసే సంస్థ గత ఏడాదిలో అమెరికాలోని ఉద్యోగులను తొలగించిందా? భవిష్యత్తులోనూ ఉద్యోగాల కోతకు ప్రణాళికలు ఉన్నాయా? ఉద్యోగుల స్థానంలో హెచ్-1బీ వీసాల ద్వారా విదేశీ సిబ్బందిని తీసుకునే ప్రయత్నం జరుగుతోందా? అనే అంశాలను అధికారులు పరిశీలించనున్నారు. ఇప్పటివరకు వీసా నిబంధనలు, ఉద్యోగ స్వభావం, వేతనాలు తదితర అంశాల ఆధారంగా జరిగే పరిశీలనకు ఇకపై సంస్థలోని ఉద్యోగాల కోతలు కూడా జతకానున్నాయి.

ఆరు శాఖల సమన్వయం

హెచ్-1బీ కార్యక్రమం పర్యవేక్షణలో విదేశాంగ, కార్మిక, హోంల్యాండ్ సెక్యూరిటీ, వాణిజ్య, విద్యాశాఖలు, స్మాల్ బిజినెస్ అడ్మినిస్ట్రేషన్ సమన్వయంతో సమాచారాన్ని సేకరించనున్నాయి. వేతనాలు, పరిశ్రమల పరిస్థితులు, ఉద్యోగాల స్వభావం, ఉపాధి వివరాల ఆధారంగా దరఖాస్తులను మరింత సమగ్రంగా పరిశీలించనున్నారు. గతంలో సమర్పించిన లేబర్ కండిషన్ దరఖాస్తులను కూడా సమీక్షించాలని కార్మిక శాఖను ఆదేశించారు.

లక్ష డాలర్ల ఫీజు మరో ఏడాది

కొన్ని హెచ్-1బీ దరఖాస్తులకు విధించిన లక్ష డాలర్ల అదనపు చెల్లింపు నిబంధనను మరో 12 నెలలు పొడిగించారు. 2025 సెప్టెంబర్ 19న తొలిసారి తీసుకొచ్చిన ఈ నిబంధన తాజా ప్రకటన ప్రకారం 2026 సెప్టెంబర్ 21 నుంచి 2027 సెప్టెంబర్ 21 వరకు కొనసాగనుంది. అమెరికా వెలుపల ఉన్న హెచ్-1బీ అభ్యర్థుల విషయంలో సంబంధిత పిటిషన్‌కు లక్ష డాలర్ల చెల్లింపు లేకపోతే ప్రవేశ పరిమితి వర్తిస్తుంది. జాతీయ ప్రయోజనం దృష్ట్యా కొన్ని మినహాయింపులకు అవకాశం ఉంది. ఇప్పటికే అమెరికాలో విద్యార్థి వీసాలపై ఉన్నవారికి, ప్రస్తుత వీసాల పునరుద్ధరణలకు ఈ ఫీజు నిబంధన వర్తించదని ప్రభుత్వం తెలిపింది.

రిజిస్ట్రేషన్లు 92 శాతం తగ్గాయి

హెచ్-1బీ కార్యక్రమం ఉద్దేశం నుంచి దూరమైందని ట్రంప్ ప్రభుత్వం ఆరోపిస్తోంది. అమెరికన్ల కంటే హెచ్-1బీ వీసాదారులకు తక్కువ వేతనాలు చెల్లిస్తున్నారని పేర్కొంది. 2025లో లక్ష డాలర్ల ఫీజు నిబంధన అమల్లోకి వచ్చిన తర్వాత భారీ ఐటీ ఔట్‌సోర్సింగ్ సంస్థలు దాఖలు చేసిన హెచ్-1బీ రిజిస్ట్రేషన్లు 92 శాతం తగ్గాయని వైట్‌హౌస్ తెలిపింది. కాన్సులర్ ప్రాసెసింగ్ అభ్యర్థనలు కూడా దాదాపు 97 శాతం తగ్గినట్లు పేర్కొంది.

ఇదిలా ఉండగా హెచ్-1బీ ఎంపిక విధానంలోనూ ప్రభుత్వం మార్పులు చేసింది. పూర్తిగా యాదృచ్ఛిక లాటరీకి బదులుగా వేతన స్థాయిని పరిగణనలోకి తీసుకునే వెయిటెడ్ విధానాన్ని తీసుకొచ్చింది. 2027 ఆర్థిక సంవత్సరానికి సంబంధించిన ఎంపికల్లో ఈ విధానం తొలిసారిగా అమలవుతుందని వైట్‌హౌస్ తెలిపింది. ఈ మార్పుల నేపథ్యంలో హెచ్-1బీ రిజిస్ట్రేషన్లు దాదాపు 40 శాతం తగ్గినట్లు పేర్కొంది.

## పాత్రికేయులపై ట్రంప్ కక్షసాధింపు!

**సీఎన్‌ఎన్, 'ఎమ్ఎస్ నౌ' విలేకరులకు వైట్‌హౌస్ ప్రాంగణంలోకి నో ఎంట్రీ!**

**పాస్‌లు రద్దు చేసి వెనక్కి పంపిన సెక్యూరిటీ; ఫస్ట్ అమెండ్‌మెంట్ హక్కులపై తీవ్ర దాడిగా అభివర్ణించిన మీడియా సంస్థలు**

బలగం టీవీ, వాషింగ్టన్

అమెరికా అధ్యక్షుడు డోనాల్డ్ ట్రంప్ విధించిన నిషేధం నేపథ్యంలో ప్రముఖ వార్తా సంస్థలు సీఎన్ఎన్ (CNN), ఎమ్ఎస్ నౌ (MS NOW) ప్రతినిధులను వైట్‌హౌస్‌లోకి వెళ్లకుండా భద్రతా సిబ్బంది శనివారం అడ్డుకున్నారు. తమ వ్యాపార, పాలనాపరమైన నివేదికలను "ఫేక్ న్యూస్"గా ప్రచారం చేస్తున్నారనే సాకుతో సీఎన్ఎన్, ఎమ్ఎస్ నౌ, పొలిటికో (Politico) మీడియా సంస్థలపై నిషేధం విధిస్తున్నట్లు ట్రంప్ శుక్రవారం ప్రకటించారు.

శనివారం ఉదయం వైట్‌హౌస్ కవరేజ్ కోసం వెళ్లిన ఎమ్ఎస్ నౌ రిపోర్టర్ అకైలా గార్డ్‌నర్, సీఎన్ఎన్ సీనియర్ రిపోర్టర్ బెట్సీ క్లెయిన్‌ల ఎంట్రీ పాస్‌లను (హార్డ్ పాసెస్) సెక్యూరిటీ సిబ్బంది నిలిపివేసి రద్దు చేశారు. గేట్ వద్ద సెక్యూరిటీ స్కానింగ్ సమయంలో తమ పాస్‌లు పనిచేయకపోవడంతో, పై అధికారుల ఆదేశాల మేరకు వాటిని స్వాధీనం చేసుకున్నట్లు భద్రతాధికారి తెలిపారు. ఈ పరిణామంపై మీడియా సంస్థలు మరియు వాక్ స్వాతంత్ర్య పోరాట సమూహాలు తీవ్ర నిరసన వ్యక్తం చేశాయి:

వాక్ స్వాతంత్ర్యానికి ముప్పు: ఈ చర్యలు అమెరికా రాజ్యాంగం కల్పించిన 'ఫస్ట్ అమెండ్‌మెంట్' (పత్రికా స్వేచ్ఛ) ప్రాథమిక హక్కులను తీవ్రంగా ఉల్లంఘించడమేనని సీఎన్ఎన్, ఎమ్ఎస్ నౌ ప్రతినిధులు మండిపడ్డారు. తమ విధులను నిర్భయంగా కొనసాగిస్తామని స్పష్టం చేశారు.

ప్రజాస్వామ్యానికే ప్రమాదం: వైట్‌హౌస్ కరస్పాండెంట్స్ అసోసియేషన్ (WHCA) మరియు చట్టపరమైన విశ్లేషకులు స్పందిస్తూ.. ప్రభుత్వం నచ్చని కథనాలను రాసే ప్రసార మాధ్యమాలపై ఇలా నిషేధం విధించడం ప్రజాస్వామ్య వ్యవస్థకే ముప్పని విమర్శించారు.

గతంలోనూ ఇదే తరహా వివాదాలు: గతేడాది మెక్సికో సింధుశాఖ (Gulf of Mexico) పేరును "గల్ఫ్ ఆఫ్ అమెరికా"గా మార్చాలన్న ట్రంప్ కార్యనిర్వాహక ఉత్తర్వులను పాటించకపోవడంతో అసోసియేటెడ్ ప్రెస్ (AP) విలేకరులపై కూడా వైట్‌హౌస్ పరిమితులు విధించింది. ప్రస్తుతం ఈ అంశంపై కోర్టులో విచారణ కొనసాగుతోంది.

ట్రంప్ ప్రభుత్వం తమ మీడియా హక్కులను అడ్డుకోవడంపై న్యాయపోరాటం చేసేందుకు ఆయా వార్తా సంస్థలు సిద్ధమవుతున్నాయి.

## ఉద్యోగులే కాదు.. యజమానులూ మారాల్సిందే!

**ఏఐ విస్తరణతో మారుతున్న ఉద్యోగ స్వరూపం**

**ఇతర రంగాల అనుభవాన్ని గుర్తించాల్సిన అవసరం ఉందంటున్న ఆస్ట్రేలియా అధ్యయనం**

బలగం టీవీ, సిడ్నీ

కృత్రిమ మేధ (AI) వేగంగా విస్తరిస్తున్న కొద్దీ వివిధ రంగాల్లో ఉద్యోగులు చేసే పనులు, వారికి అవసరమైన నైపుణ్యాల స్వరూపం వేగంగా మారిపోతోంది. ఈ మార్పుల వల్ల ఉద్యోగులు తమ రంగాలను లేదా ఉద్యోగాలను మార్చుకోవాల్సిన అవసరం పెరుగుతోంది. ముఖ్యంగా పురుషుల కంటే మహిళలపై ఏఐ ప్రభావం ఎక్కువగా ఉంటుందని, వారు చేసే ఉద్యోగాల స్వభావం పూర్తిగా మారే అవకాశం ఉందని 'జాబ్స్ అండ్ స్కిల్స్ ఆస్ట్రేలియా' అధ్యయనం పేర్కొంది. అయితే, నైపుణ్యాలు పెంచుకోవడం (Re-skilling) కేవలం ఉద్యోగుల బాధ్యత మాత్రమే కాదని, యజమానులు (Employers) కూడా తమ నియామక ప్రక్రియల్లో మార్పులు చేసుకోవాలని నిపుణులు సూచిస్తున్నారు.

ఆస్ట్రేలియాలోని కన్‌స్ట్రక్షన్ (రహదారులు, భవన నిర్మాణం) రంగంలో పనిచేస్తున్న 655 మంది మహిళలపై జరిపిన అధ్యయనంలో ఆసక్తికర విషయాలు వెల్లడయ్యాయి. హెల్త్‌కేర్, విద్య, ఫైనాన్స్, హాస్పిటాలిటీ వంటి ఇతర రంగాలు వదిలి నిర్మాణ రంగంలోకి వచ్చిన మహిళలు అనేక మేనేజ్‌మెంట్, కమ్యూనికేషన్, కోఆర్డినేషన్ నైపుణ్యాలను తమతో పాటు తెచ్చినట్లు పరిశోధకులు గుర్తించారు. వేరే రంగంలో పనిచేసినంత మాత్రాన అనుభవం శూన్యం కాదని, వారి పాత నైపుణ్యాలు కొత్త రంగానికి కూడా ఎంతగానో ఉపయోగపడతాయని వెల్లడైంది. ప్రస్తుతం ఆస్ట్రేలియా నిర్మాణ రంగంలో 20,000 ఉద్యోగాలు ఖాళీగా ఉండగా, మహిళల భాగస్వామ్యాన్ని పెంచడం ద్వారా ఈ లోటును దాదాపు 44 శాతం తగ్గించవచ్చని అంచనా వేస్తున్నారు. కేవలం పరిచయాలు, నెట్‌వర్క్ ఉన్నవారు మాత్రమే రంగాలు మారగలుగుతున్నారని, అధికారిక రిక్రూట్‌మెంట్‌లో యజమానులు కేవలం 'గతంలో ఇదే రంగంలో పనిచేసిన అనుభవం ఉందా?' అని మాత్రమే చూడటం పెద్ద అడ్డంకిగా మారిందని నియామక నిర్వాహకులు ఒప్పుకుంటున్నారు. స్పెషలిస్ట్ లేదా సాంకేతిక హోదాలకు మినహా, అడ్మినిస్ట్రేషన్, ఫైనాన్స్, సేఫ్టీ వంటి విభాగాల్లో ఇతర రంగాల నుంచి వచ్చేవారి నైపుణ్యాలు చాలా బాగా ఉపయోగపడతాయి. అందువల్ల, "మా పరిశ్రమలో అనుభవం ఉందా?" అని చూడటానికి బదులుగా "వారు ఎలాంటి ఇతర నైపుణ్యాలు తేగలరు?", "కొత్త విషయాలు నేర్చుకోగలరా?" అని యజమానులు ఆలోచించినప్పుడే ఏఐ తెస్తున్న సవాళ్లను సమర్థవంతంగా ఎదుర్కోగలమని నిపుణులు అభిప్రాయపడుతున్నారు.



# నేడు బరిలోకి భారత అథ్లెట్లు..

### సెప్టెంబరు 20న ప్రధాన ఈవెంట్ల వివరాలు!

### షూటింగ్, బ్యాడ్మింటన్, హాకీల్లో పతకాల వేట; సెమీస్ బరిలో భారత మహిళల క్రికెట్ జట్టు

బలగం టీవీ, హైదరాబాద్

జపాన్‌లో ఘనంగా ప్రారంభమైన 20వ ఆసియా క్రీడల్లో ఆదివారం (సెప్టెంబరు 20) పలు కీలక ఈవెంట్లలో భారత క్రీడాకారులు తమ అదృష్టాన్ని పరీక్షించుకోనున్నారు. షూటింగ్, హాకీ, బ్యాడ్మింటన్ సహా ప్రధాన విభాగాల్లో భారత అథ్లెట్లు బరిలోకి దిగుతుండగా.. నేడు జరగనున్న భారత ఈవెంట్ల రోజువారీ షెడ్యూల్ వివరాలు ఇలా ఉన్నాయి:

క్రికెట్: మహిళల క్రికెట్ విభాగంలో భారత జట్టు సెమీఫైనల్ మ్యాచ్ ఆడనుంది.

హాకీ: పురుషుల పూల్-ఎ విభాగంలో ఇండోనేసియాతో భారత్ తలపడనుండగా, మహిళల పూల్-బి మ్యాచ్‌లో ఉజ్బెకిస్థాన్‌తో భారత మహిళల జట్టు పోటీపడనుంది.

షూటింగ్: మహిళల 10 మీటర్ల ఎయిర్ రైఫిల్ వ్యక్తిగత, జట్టు విభాగాల అర్హత రౌండ్లతో పాటు ఫైనల్ పోరు జరగనుంది.

బ్యాడ్మింటన్: పురుషుల, మహిళల జట్ల విభాగాల్లో ప్రాథమిక రౌండ్ మ్యాచ్‌లు ప్రారంభం కానున్నాయి.

టేబుల్ టెన్నిస్: పురుషుల, మహిళల జట్ల గ్రూప్ దశ పోటీలు జరగనున్నాయి.

స్విమ్మింగ్: పురుషుల 100 మీటర్ల ఫ్రీస్టైల్, 100 మీటర్ల బ్యాక్‌స్ట్రోక్ ఈవెంట్లు ముగియనున్నాయి.

సాఫ్ట్ టెన్నిస్: పురుషుల జట్ల సెమీఫైనల్స్, ఫైనల్స్ పోరు జరగనుంది.

టెక్‌బాల్: పురుషుల డబుల్స్, మహిళల సింగిల్స్, మిక్స్‌డ్ డబుల్స్ ఫైనల్ మ్యాచ్‌లు నిర్వహించనున్నారు.

వుషు: పురుషుల చాంగ్‌క్వాన్ ఫైనల్స్‌తో పాటు సాండా ప్రాథమిక రౌండ్లు జరగనున్నాయి.

మిక్స్‌డ్ మార్షల్ ఆర్ట్స్: పురుషుల సంప్రదాయ విభాగం 77 కిలోలు, మహిళల సంప్రదాయ విభాగం 60 కిలోల మ్యాచ్‌లు జరగనున్నాయి.




## రంజీ తొలి రెండు మ్యాచ్‌లకు హైదరాబాద్ కెప్టెన్‌గా సిరాజ్

బలగం టీవీ, హైదరాబాద్

భారత పేసర్ మహ్మద్ సిరాజ్ రానున్న రంజీ ట్రోఫీ సీజన్‌లో తొలి రెండు మ్యాచ్‌లకు హైదరాబాద్ జట్టుకు కెప్టెన్‌గా వ్యవహరించనున్నాడు. సీవీ మిలింద్‌ను ఉపకెప్టెన్‌గా నియమించినట్లు హైదరాబాద్ క్రికెట్ సంఘం శనివారం ప్రకటించింది. 15 మంది సభ్యులతో కూడిన జట్టులో అనుభవజ్ఞుడైన బ్యాటర్ తన్మయ్ అగర్వాల్, రాహుల్ సింగ్, వికెట్ కీపర్లు రాహుల్ రాదేశ్, సాయి ప్రజ్ఞయ్ రెడ్డి ఉన్నారు. తనయ్ త్యాగరాజన్, అనికేత్ రెడ్డి, అజయ్ దేవ్ గౌడ్ తదితరులకు కూడా చోటు లభించింది.

జట్టు: మహ్మద్ సిరాజ్ (కెప్టెన్), సీవీ మిలింద్ (ఉపకెప్టెన్), తన్మయ్ అగర్వాల్, ఎం. అభిరథ్ రెడ్డి, రాహుల్ సింగ్, కే. హిమతేజ, రాహుల్ రాదేశ్ (వికెట్ కీపర్), సాయి ప్రజ్ఞయ్ రెడ్డి (వికెట్ కీపర్), వరుణ్ గౌడ్, తనయ్ త్యాగరాజన్, అనికేత్ రెడ్డి, సీ.ఎల్.టి. రక్షణ్ రెడ్డి, అజయ్ దేవ్ గౌడ్, రుథిక్ యాదవ్ మెండే, సాయి వికాస్ రెడ్డి.

స్టాండ్‌బైలు: భావేశ్ సేథ్ (వికెట్ కీపర్), హెచ్.కే. సింహ, టీ. రవితేజ, శౌనక్ కులకర్ణి, ముదస్సర్ హుస్సేన్, కార్తికేయ కాక, ఏ. పృథ్వీ రెడ్డి.



## సెమీస్‌లో ఓడిన క్వింసీ డిసౌజా

### కాంస్య పతకంపై ఆశలు

బలగం టీవీ, హైదరాబాద్

జపాన్ వేదికగా జరుగుతున్న ఆసియా క్రీడల్లో భారత్‌కు తెక్‌బాల్‌లో పసిడి ఆశలు రేపిన క్వింసీ డిసౌజా సెమీఫైనల్లో ఓటమిపాలైంది. మహిళల సింగిల్స్ సెమీస్‌లో ఇండోనేషియాకు చెందిన సుమయా చేతిలో పరాజయం చవిచూసిన డిసౌజా.. కాంస్య పతకం కోసం ఆదివారం పోరాడనుంది.

సుమయాతో జరిగిన మ్యాచ్‌లో 24 ఏళ్ల డిసౌజా తొలి సెట్‌ను 12-7తో గెలుచుకుంది. అయితే రెండో సెట్‌లో సుమయా పుంజుకుని 12-9తో విజయం సాధించి స్కోరును సమం చేసింది. నిర్ణయాత్మక మూడో సెట్‌లోనూ సుమయాదే పైచేయి. 12-7తో సెట్‌ను గెలిచి ఫైనల్‌కు చేరింది.

ఫైనల్ బెర్తు చేజారినా డిసౌజాకు కాంస్యం సాధించే అవకాశం ఉంది. మూడో స్థానం కోసం జరిగే పోరులో కంబోడియాకు చెందిన కౌయెంయాన్ డీతో డిసౌజా తలపడనుంది. గ్రూప్ దశలో ఆమెను ఓడించి సెమీస్ చేరిన డిసౌజా.. మరోసారి విజయం సాధించి పతకం అందుకోవాలని పట్టుదలగా ఉంది. ఆదివారం ఉదయం 10 గంటలకు ఈ పోరు జరగనుంది. మిక్స్‌డ్ డబుల్స్‌లోనూ మహ్మద్ అనస్ ఇమ్రాన్ బేగ్‌తో కలిసి డిసౌజా కాంస్యం కోసం బరిలోకి దిగనుంది.



## షో జంపింగ్‌లో హైదరాబాద్ యువ రైడర్ హాషమ్ విజయం

బలగం టీవీ, హైదరాబాద్

తెలంగాణ షో జంపింగ్ చాంపియన్‌షిప్‌లో హైదరాబాద్ యువ రైడర్ మహమ్మద్ హాషమ్ సత్తా చాటాడు. నాసర్ పోలో–ఈక్వెస్ట్రియన్ అకాడమీ వేదికగా శనివారం ప్రారంభమైన టోర్నీలో 115–120 సెం.మీ. షో జంపింగ్ ఓపెన్ కేటగిరీలో హాషమ్ విజేతగా నిలిచాడు. ది అశ్వ కలెక్టివ్ జట్టుకు ప్రాతినిధ్యం వహించిన హాషమ్ 'కాని కాంగ్' గుర్రంపై అద్భుత ప్రదర్శనతో అగ్రస్థానం సాధించాడు. కోవై స్టేబుల్స్ రైడర్ స్నేథిల్ రన్నరప్‌గా నిలిచాడు.

# ఆసియా గేమ్స్ సమరం మొదలు!

### జపాన్‌లో ఆసియా క్రీడల హంగామా..

### పతాకధారులుగా మను భాకర్, పవన్ సెహ్రావత్!

### 503 మంది క్రీడాకారులతో బరిలోకి దిగిన భారత్;

### భావోద్వేగానికి గురైన స్టార్ షూటర్ మను

బలగం టీవీ, హైదరాబాద్

జపాన్‌లోని అయిచి-నగోయా వేదికగా 20వ ఆసియా క్రీడలు అంగరంగ వైభవంగా ప్రారంభమయ్యాయి. పాలొమా మిజుహో స్టేడియంలో శనివారం నిర్వహించిన కన్నులపండువ ప్రారంభోత్సవ వేడుకల్లో భారత క్రీడాకారుల బృందం ఉత్సాహంగా పాల్గొంది.






ఈ ప్రారంభోత్సవ పరేడ్‌లో భారత స్టార్ షూటర్ మను భాకర్, కబడ్డీ స్టార్ ప్లేయర్ పవన్ సెహ్రావత్ భారత పతాకధారులుగా వ్యవహరించి బృందానికి నాయకత్వం వహించారు. ఈసారి టోర్నీలో భారత్ నుంచి 36 క్రీడాంశాల్లో పోటీపడేందుకు 503 మందితో కూడిన భారీ అథ్లెట్ల బృందం బరిలోకి దిగింది. గత ఆసియా క్రీడల్లో స్వర్ణం సాధించిన భారత పురుషుల కబడ్డీ జట్టు సభ్యుడైన పవన్ సెహ్రావత్, ఒలింపిక్ పతక విజేత మను భాకర్‌తో కలిసి జాతీయ పతాకాన్ని చేతబూని భారత దళాన్ని ముందుండి నడిపించారు.

భారత పతాకధారిగా ఎంపిక కావడంపై మను భాకర్ తీవ్ర ఆనందం, భావోద్వేగం వ్యక్తం చేసింది. షూటింగ్‌లోకి అడుగుపెట్టిన రోజుల్లో ఒకానొక రోజు దేశ పతాకధారిగా నిలుస్తానని ఎప్పుడూ ఊహించలేదని, ఈ గౌరవం దక్కడం ఎంతో గర్వంగా ఉందంటూ తనకు మద్దతుగా నిలిచిన ప్రతి ఒక్కరికీ ధన్యవాదాలు తెలిపింది.

## జపాన్ పయనానికి ముందు భారత క్రికెట్ జట్టుకు కిట్ తిప్పలు!

### శ్రేయస్ అయ్యర్ సేనకు బీసీసీఐ ప్రత్యేక వసతి;

### ఐఓఏ జెర్సీలతోనే ఆసియాడ్ బరిలోకి!

బలగం టీవీ, హైదరాబాద్

జపాన్‌లో జరుగుతున్న ఆసియా గేమ్స్ 2026 పోటీల కోసం బయల్దేరాల్సిన శ్రేయస్ అయ్యర్ నాయకత్వంలోని భారత పురుషుల టీ20 క్రికెట్ జట్టు కిట్ కష్టాలను ఎదుర్కొంటోంది. ఆదివారం న్యూఢిల్లీ నుంచి జపాన్‌కు విమానం ఎక్కాల్సి ఉండగా, జట్టులోని చాలా మంది ఆటగాళ్లకు అధికారిక కిట్లు ఇంకా పూర్తిగా అందకపోవడం గమనార్హం. ఈ విషయమై బీసీసీఐ, ఇండియన్ ఒలింపిక్ అసోసియేషన్ (IOA), కిట్ స్పాన్సర్ జేఎస్‌డబ్ల్యూ ఇన్‌స్పైర్ మధ్య నిరంతరం సంప్రదింపులు జరుగుతున్నట్లు పీటీఐ నివేదించింది.




ఈ పర్యటనలో భారత జట్టు రెండు వేర్వేరు జెర్సీలతో కనిపించనుంది. జపాన్‌తో జరిగే ఏకైక మ్యాచ్‌లో సాధారణ బీసీసీఐ జెర్సీని ధరించనున్న భారత జట్టు, ఆసియా గేమ్స్‌లో మాత్రం స్పాన్సర్లు లేని ప్రత్యేక ఐఓఏ జెర్సీలతోనే బరిలోకి దిగనుంది. అంతర్జాతీయ మల్టీ-స్పోర్ట్స్ ఈవెంట్లలో క్రీడా సంఘాల గుర్తింపు కంటే జాతీయ ఒలింపిక్ సంఘానికే ప్రాధాన్యం ఉంటుందున, అథ్లెటిక్స్, హాకీ తరహాలోనే క్రికెటర్లు కూడా దేశం తరఫున ఒకే రకమైన నేషనల్ కిట్‌ను ధరించాల్సి ఉంటుంది.

మరోవైపు ఆసియా గేమ్స్ నిర్వాహకులు కేటాయించిన గదుల్లో కిట్ బ్యాగులు పెట్టుకోవడానికి కూడా స్థలం సరిపోకపోవడంతో, బీసీసీఐ రంగంలోకి దిగి నాగోయాలో పురుషుల క్రికెట్ జట్టు కోసం ప్రత్యేక వసతి ఏర్పాట్లు చేసింది. ఐసీసీ ర్యాంకింగ్స్ ఆధారంగా నేరుగా క్వార్టర్ ఫైనల్స్‌కు అర్హత సాధించిన భారత జట్టు సెప్టెంబరు 28న తన తొలి మ్యాచ్ ఆడనుంది. డిఫెండింగ్ ఛాంపియన్‌గా బరిలోకి దిగుతున్న భారత్ అక్టోబరు 3న జరిగే ఫైనల్‌లో స్వర్ణమే లక్ష్యంగా పోటీపడనుంది.

## 2028 ఆసియా సీనియర్ వుషు ఛాంపియన్‌షిప్‌నకు భారత్ ఆతిథ్యం!



బలగం టీవీ, హైదరాబాద్

భారత క్రీడారంగానికి మరో అరుదైన అవకాశం దక్కింది. చరిత్రలోనే తొలిసారిగా 2028లో

### తొలిసారిగా మెగా టోర్నీ నిర్వహణకు దక్కిన హక్కులు; నాగోయా కాంగ్రెస్‌లో నిర్ణయాన్ని ఆమోదించిన ఆసియా వుషు ఫెడరేషన్

జరగబోయే 'ఆసియా సీనియర్ వుషు ఛాంపియన్‌షిప్' ఆతిథ్య హక్కులను భారతదేశం కైవసం చేసుకుంది. జపాన్‌లోని అయిచి-నాగోయాలో నిర్వహించిన ఆసియా వుషు ఫెడరేషన్ కాంగ్రెస్ సమావేశంలో ఈ నిర్ణయానికి అధికారికంగా ఆమోదం లభించింది. ఈ సమావేశంలో భారత వుషు సంఘం తరఫున సుహేల్ అహ్మద్ ప్రాతినిధ్యం వహించారు.

ఈ ప్రతిష్ఠాత్మక టోర్నీ 11వ ఎడిషన్‌లో ఆసియా ఖండంలోని 42 దేశాల నుంచి దాదాపు 500 మంది అథ్లెట్లు పాల్గొంటారని అంచనా వేస్తున్నారు. క్రీడాకారులతో పాటు వివిధ దేశాలకు చెందిన కోచ్‌లు, అంపైర్లు, సాంకేతిక అధికారులు, క్రీడా నిర్వాహకులు కూడా పెద్ద సంఖ్యలో హాజరుకానున్నారు. మరో కీలక పరిణామంలో, భారత వుషు సంఘానికి చెందిన భూపేందర్ సింగ్ బాజ్వా ఆసియా వుషు ఫెడరేషన్ ఎగ్జిక్యూటివ్ కమిటీ సభ్యుడిగా ఎంపికయ్యారు.

ఈ నిర్ణయంపై భూపేందర్ సింగ్ బాజ్వా హర్షం వ్యక్తం చేస్తూ.. ఇది భారత వుషు రంగానికి ఎంతో గర్వకారణమని కొనియాడారు. అంతర్జాతీయ స్థాయిలో సరికొత్త ప్రమాణాలను నెలకొల్పేలా ఈ టోర్నీని అత్యంత ఘనంగా నిర్వహించడమే లక్ష్యంగా అందరం కలిసికట్టుగా పనిచేస్తామని స్పష్టం చేశారు.

## లంకను క్లీన్‌స్వీప్ చేసి అగ్రస్థానానికి ఇంగ్లండ్..

### రెండో స్థానానికి పడిపోయిన భారత్!

### శ్రీలంకపై 3-0తో సిరీస్ కైవసం; టీమిండియాను వెనక్కి నెట్టి అగ్రపీఠం కైవసం చేసుకున్న హ్యారీ బ్రూక్ సేన

బలగం టీవీ, హైదరాబాద్

అంతర్జాతీయ పురుషుల టీ20ల్లో ఇంగ్లండ్ క్రికెట్ జట్టు విజయపరంపర కొనసాగుతోంది. స్వదేశంలో ఇటీవల ఐదు టీ20ల సిరీస్‌లో భారత జట్టును వైట్‌వాష్ చేసిన ఇంగ్లండ్, తాజాగా శ్రీలంకను కూడా క్లీన్‌స్వీప్ చేసి ఐసీసీ టీ20 ర్యాంకింగ్స్‌లో అగ్రస్థానానికి ఎగబాకింది.

శనివారం జరిగిన మూడో టీ20లో శ్రీలంకపై 8 వికెట్ల తేడాతో ఘనవిజయం సాధించిన హ్యారీ బ్రూక్ సేన, మూడు టీ20ల సిరీస్‌ను 3-0తో క్లీన్‌స్వీప్ చేసింది. ఈ అద్భుత విజయంతో 269 రేటింగ్ పాయింట్లతో ఇంగ్లండ్ నంబర్ 1 ర్యాంకును దక్కించుకోగా, ఇప్పటివరకు అగ్రస్థానంలో ఉన్న భారత జట్టు రెండో స్థానానికి పడిపోయింది.

ప్రస్తుతం ఐసీసీ పురుషుల టీ20 జట్ల ర్యాంకింగ్స్‌లో ఇంగ్లండ్ మొదటి స్థానంలో నిలవగా.. భారత్, ఆస్ట్రేలియా, న్యూజిలాండ్, దక్షిణాఫ్రికాలు వరుసగా రెండు, మూడు, నాలుగు, ఐదో స్థానాల్లో కొనసాగుతున్నాయి.






## చెస్ ఒలింపియాడ్‌లో భారత్ ఘనవిజయం..

### స్పెయిన్‌పై పురుషులు, మంగోలియాపై మహిళలు గెలుపు!

### స్పానిష్ గ్రాండ్‌మాస్టర్ షిరోవ్‌పై ప్రపంచ ఛాంపియన్ డి.గుకేశ్ అద్భుత విజయం; 3-1 తేడాతో ముందంజ

బలగం టీవీ, హైదరాబాద్

ఉజ్బెకిస్థాన్‌లోని సమర్‌కండ్ వేదికగా జరుగుతున్న 46వ చెస్ ఒలింపియాడ్‌లో డిఫెండింగ్ ఛాంపియన్లైన భారత పురుషుల, మహిళల జట్లు తమ విజయ పరంపరను కొనసాగిస్తున్నాయి. శనివారం జరిగిన నాల్గో రౌండ్‌లో భారత పురుషుల జట్టు 3-1 పాయింట్ల తేడాతో పటిష్టమైన స్పెయిన్‌ను ఓడించగా, మహిళల జట్టు కూడా 3-1 తేడాతో మంగోలియాపై ఘనవిజయం సాధించింది.

ఓపెన్ (పురుషుల) విభాగంలో ప్రపంచ ఛాంపియన్ డి. గుకేశ్ అద్భుత గేమ్‌తో భారత్‌ను ముందంజలో నిలిపాడు. మాజీ ప్రపంచ ఛాలెంజర్ అలెక్సీ షిరోవ్‌తో జరిగిన గేమ్‌లో గుకేశ్ 42 ఎత్తుల్లో విజయం సాధించాడు. మరో వైపు రెండో బోర్డుపై అర్జున్ ఎరిగైసి సైతం సంచలన దాడితో విజయాన్ని ఖాయం చేయగా, ఆర్. ప్రజ్ఞానంద, నిహాల్ సరిన్‌లు తమ గేమ్‌లను డ్రాలుగా ముగించారు.

మహిళల విభాగంలో బి. సవిత శ్రీ వరుసగా నాలుగో విజయాన్ని నమోదు చేసుకుని ఆకట్టుకోగా, ప్రపంచకప్ విజేత దివ్య దేశ్‌ముఖ్ సైతం విజయం సాధించి జట్టుకు తిరుగులేని ఆధిక్యాన్ని అందించింది. స్టార్ ప్లేయర్లు కోనేరు హంపి, ఆర్. వైశాలి తమ గేమ్‌లను డ్రా చేసుకోవడంతో భారత మహిళల జట్టు మంగోలియాపై 3-1 తేడాతో శుభవిజయాన్ని అందుకుంది.

## ఆసియా క్రీడలోకి రాజకీయాలు వచ్చేశాయి

బలగం టీవీ, హైదరాబాద్

ఆసియా క్రీడల్లోకి రాజకీయాలు ఇప్పటికే ప్రవేశించాయని ఒలింపిక్ కౌన్సిల్ ఆఫ్ ఏషియా అధ్యక్షుడు షేక్ జువాన్ బిన్ హమద్ అల్ థానీ వ్యాఖ్యానించారు. క్రీడల్లో రాజకీయాలకు తావు ఉండకూడదని ఆయన అభిప్రాయపడ్డారు. ఆసియా క్రీడల ప్రారంభోత్సవానికి కొన్ని గంటల ముందు మీడియాతో మాట్లాడిన ఆయన.. శుక్రవారం తైవాన్ క్రీడల మంత్రి లీ యాంగ్‌కు ఎదురైన ఘటనపై స్పందించారు.

తైవాన్ ప్రతినిధి లీ యాంగ్‌ను స్వాగత కార్యక్రమం, జెండా ఆవిష్కరణకు తొలుత అనుమతించకపోవడంతో వివాదం తలెత్తింది. అనంతరం ఆయనకు కార్యక్రమంలో పాల్గొనే అవకాశం కల్పించారు. ఈ ఘటన అపార్థం కారణంగా జరిగిందని ఒలింపిక్ కౌన్సిల్ ఆఫ్ ఏషియా వివరణ ఇచ్చింది. క్రీడలను రాజకీయాలతో కలపకూడదన్న తమ విధానం ఉన్నప్పటికీ, ఇప్పటికే రాజకీయాలు క్రీడల్లోకి వచ్చాయని అల్ థానీ పేర్కొన్నారు. ఇలాంటి ఘటనలు పునరావృతమైతే తమ నిబంధనల ప్రకారం చర్యలు తీసుకుంటామని, అన్ని దేశాల ప్రతినిధులకు పాటించాల్సిన నిబంధనలు, ప్రొటోకాల్ గురించి తెలుసని చెప్పారు.

బ్యాడ్మింటన్‌లో రెండు సార్లు ఒలింపిక్ స్వర్ణ పతక విజేత అయిన లీ యాంగ్.. 2020, 2024 ఒలింపిక్స్‌లో పురుషుల డబుల్స్‌లో స్వర్ణాలు సాధించారు. రెండు ఫైనల్స్‌లోనూ చైనా జోడీలపైనే విజయం సాధించారు.

చైనా తైవాన్‌పై హక్కు ప్రకటిస్తున్న నేపథ్యంలో తైవాన్ ఆసియా క్రీడలు, ఒలింపిక్స్‌లో 'చైనీస్ తైపీ' పేరుతో పాల్గొంటోంది. తైవాన్ క్రీడా కమిటీ ఉపాధ్యక్షుడు చెన్ షిహ్ క్వీ మాట్లాడుతూ తమ క్రీడాకారులు అన్ని కార్యక్రమాల్లో సమానంగా, గౌరవప్రదంగా పాల్గొనేలా చూడాలని నిర్వాహకులను కోరినట్లు తెలిపారు. తమ హక్కులు, గౌరవాన్ని కాపాడుకునేందుకు తైవాన్ ప్రతినిధులు పట్టుదలగా వ్యవహరించారని చెప్పారు.

లీ యాంగ్ కూడా తమ హక్కులను కాపాడుకునేందుకు ప్రయత్నిస్తున్నామని, ఎలాంటి అణచివేతకు గురికావాలని కోరుకోవడం లేదని తైవాన్ మీడియాతో అన్నారు. క్రీడల్లో తైవాన్ క్రీడాకారులు అత్యుత్తమ ప్రదర్శన చేసి అంతర్జాతీయ వేదికపై తమ దేశానికి మరింత గుర్తింపు తీసుకురావాలని ఆకాంక్షించారు.